

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆


ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 122 | విజయవాడ, బుధవారం 3 డిసెంబర్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Wednesday 3 December 2025 | Rs







అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - బనగానపల్లె

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నంద్యాల జిల్లా బనగానపల్లె మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దరాజుపాలెం గ్రామానికి చెందిన రైతు బస్తిపాడు చంద్రశేఖర్ గౌడ్ (37) తన రెండెకరాల సొంత పొలంతో పాటు ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేశారు. గత మూడు సంవత్సరాలుగా పంటలు చేతికందకపోవడంతో సాగు కోసం చేసిన అప్పులకు వడ్డీల భారం అధికమైంది. ఈ ఏడాది మొక్కజొన్న పంట సాగు చేశారు. అధిక వర్షాలతో దిగుబడి తగ్గిపోయింది. దక్కిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో అప్పుల భారం మరింతగా పెరిగింది. మొత్తం రూ. పది లక్షల మేర అప్పులు మిగిలాయి. పంటలు దక్కకపోవడం, అప్పులు తీరే దారిలేకపోవడంతో ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హరిత ట్రావెల్స్ ప్రమాదంపై రవాణాశాఖ మంత్రి ఆరా..

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కర్ణాటకలో హరిత ట్రావెల్ బస్సు బోల్తాపడిన ఘటనపై రవాణాశాఖ మంత్రి మండేపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సౌకర్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ ప్రమాదంలో ప్రొద్దుటూరుకు చెందిన మహిళ మృతిపట్ల ఆయన సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తరచూ ప్రైవేట్ బస్సులు ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నాయని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో భద్రతా ప్రమాణాలు పాటించని బస్సుల నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

నెల్లూరు మేయర్‌పై 18న అవిశ్వాసం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు మేయర్ పొట్లూరి స్రవంతిపై 18న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. నెల్లూరు నగరంలో మొత్తం 54 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరంతా 2021లో వైసిపి తరఫున గెలిచారు. టిడిపి అధికారంలోకి రావడంతో 42 మంది టిడిపిలో చేరారు. వైసిపికి 11 మంది మద్దతు ఉంది. మేయర్ ఒక్కరు మాత్రమే మిగిలారు. టిడిపి నాయకత్వం ఇటీవల అవిశ్వాస తీర్మాన నోటీసులు జారీ చేసింది. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అప్పుడు ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. మంగళవారం ఆయన విధుల్లోకి చేరడంతో ఈ నెల 18న మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయనున్నారు.

కర్నూలు ఎంపిపిపై నెగ్గిన అవిశ్వాసం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు మండల పరిషత్ అధ్యక్ష పదవిపై టిడిపి అనుకూల సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు. మంగళవారం కర్నూలు జిల్లా పరిషత్‌లో నిర్వహించిన సమావేశానికి అవిశ్వాసం ప్రవేశపెట్టిన 13 మంది ఎంపిటిసి సభ్యులు హాజరయ్యారు. వ్యతిరేకపక్ష సభ్యులు ఎవ్వరూ హాజరుకాకపోవడంతో అవిశ్వాసాన్ని ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానం చేశారు. కర్నూలు మండల అధ్యక్ష స్థానాన్ని గతంలో వైసిపి కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. మొత్తం సభ్యులు 23 మంది కాగా నాలుగు ఖాళీలు ఉన్నాయి. మిగతా 19 మందిలో 13 మంది హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరయ్యారు.

పాలకొల్లులో మహిళ హత్య

ప్రజాశక్తి - పాలకొల్లు

అడిగిన డబ్బు ఇవ్వలేదని సహజీవనం చేస్తున్న మహిళను మూడో అంతస్తుపై నుంచి కిందకు తోసి హత్య చేసిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలోని టిడ్కో ఇళ్ల వద్ద మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకొల్లుకు చెందిన తాడి సుధాకర్, తాడి రాధ (30) పట్టణంలోని టిడ్కో ఇంటిలో ఉంటున్నారు. సుధాకర్ ఇద్దరు కుమార్తెలు కూడా వీరి వద్దే ఉంటున్నారు. సుధాకర్ తన భార్యను ఆరేళ్ల క్రితం హత్య చేశాడు.

ప్రస్తుతం రాధతో సహజీవనం చేస్తున్నాడు. రోజూ మద్యం తాగి డబ్బులు ఇవ్వాలని ఆమెతో గొడవపడేవాడు. మంగళవారం తెల్లవారుజామున కూడా రాధతో గొడవపడ్డాడు. డబ్బులు ఇవ్వనని రాధ చెప్పడంతో ఆమెను మేడపై నుంచి తోసేశాడు. ఆమె పడిపోయాక అంబులెన్స్ తెస్తానని సుధాకర్ పరారయ్యాడు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ, నరసాపురం డిఎస్‌పి శ్రీవేద, పాలకొల్లు సిఐ గుత్తుల శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ముద్దాయిని పట్టుకోడానికి పోలీస్ బృందాలు గాలిస్తున్నాయని ఎస్‌పి చెప్పారు. మృతురాలిని సుధాకర్ తాగి గొడవపడి కిందకు తోసినట్లు ఆయన కుమార్తె భవ్యశ్రీ చెప్పినట్లు తెలిపారు.

తెలంగాణలో మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ

- ప్రారంభించిన తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఏర్పాటు చేసిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ దేశానికే తలమానికమని తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ యూనివర్సిటీని మంగళవారం ఆయన ప్రారంభించారు. 60 ఏండ్ల తెలంగాణ ఉద్యమ ఆకాంక్ష నెరవేర్చిన డాక్టర్ మన్మోహన్‌సింగ్ పేరిట దేశంలోనే ఏకైక ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీ నెలకొల్పుకోవటం గొప్ప విషయమని అన్నారు. 'విద్యను విస్తరించాలి.. ప్రపంచ ఖనిజ సంపద మీద పరిశోధనలు జరగాలి, సింగరేణి లాంటి సంస్థలను పెంపొందించాలి' అనే ఉద్దేశంతోనే ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని కొత్తగూడెంలో నెలకొల్పినట్టు చెప్పారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ స్ఫూర్తితో విద్య, నీటిపారుదల రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజాపాలన సాగిస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఈ విశ్వవిద్యాలయానికి కావాల్సిన సౌకర్యాలన్నీ కల్పిస్తామని మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి హామీ ఇచ్చారు. ఖనిజ సంపద ఉన్న ప్రాంతానికి ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీ ఇచ్చినందుకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

సాగునీటి ప్రాజెక్టుల వద్దే పిఎస్‌పిలు

- ఒప్పందాలు 60 రోజుల్లో కార్యరూపం దాల్చాలి
- సమీక్షలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



రాష్ట్రంలోని రిజర్వాయర్ల వద్ద పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు(పిఎస్‌పి)లు ఏర్పాటు చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. ఇంధన శాఖపై సచివాలయంలో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. సాగునీటి ప్రాజెక్టుల వద్ద పిఎస్‌పి ప్రాజెక్టులు ఏర్పాటు చేసుకుంటే పెద్దఎత్తున విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు మరో ఏడాది పాటు ప్రోత్సాహకాలను పొడిగిస్తునట్లు చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యమైన సరఫరా చేయాలని ఆదేశించారు. రుణసమీకరణలో వడ్డీ భారాన్ని విద్యుత్ సంస్థలు తగ్గించుకోవాలని, విద్యుత్ కొనుగోళ్లలోనూ వ్యయం తగ్గించుకోవాలని చెప్పారు. కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఇతర రాష్ట్రాలతో విద్యుత్ స్వాపింగ్ ఒప్పందాలు కుదుర్చుకోవాలని సిఎం సూచించారు. గత పాలకులు విద్యుత్ వ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చేశారని, పిపిఎల రద్దు నిర్ణయంతో రూ.9వేల కోట్ల మేరభారం ప్రజలపై పడిందని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఈ వ్యవస్థలను గాడిలో పెట్టామన్నారు. తద్వారా విద్యుత్ ఛార్జీలను పెంచకుండానే ఆ భారాన్ని జీరో చేయగలిగామన్నారు. పిఎం కుసుమ్ సహా ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్‌బిజిలీ యోజన కింద సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు. కుసుమ్ ప్రాజెక్టుల కింద 4792 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని చెప్పారు.ప్రభుత్వ భవనాలపై సౌర ఫలకలను ఏర్పాటు చేయాలని అన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో యూనిట్‌కు 20పైసల చొప్పున కొనుగోలు వ్యయం తగ్గించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇపిఎంఎస్ విధానంతో నిరంతరం పర్యవేక్షణ ద్వారా రూ.400 నుంచి 500 కోట్ల మేర పొదుపు చేశామని వివరించారు. పిఎం సూర్యఘర్ కింద బిసి వినియోగదారులకు 3 కిలోవాట్ల వరకూ రూ.20వేల సబ్సిడీని, చేనేతలకు ఉచిత 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు ఉచిత 500 యూనిట్ల పథకాలను అమలు చేయాలని ఆదేశించారు. విద్యుత్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన సంస్థలు ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా 60 రోజుల్లోనే తమ కార్యాచరణను ప్రారంభించేలా చూడాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించి అనుమతులు జారీ చేయాలని చెప్పారు. పాలసీలో భాగంగా మూలధన రాయితీ, జిఎస్టి మినహాయింపు సహా తొమ్మిది అంశాలకు ముఖ్యమంత్రి అంగీకారం తెలిపారు. ఆర్టీసి బస్సులను ఐదేళ్లల్లో ఈవీలుగా మార్చాలని, వెయ్యి బస్సులను త్వరలో కొనుగోలు చేయాలని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 5వేల ఈవి చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నాన్‌టారీఫ్ ఆదాయంపై పంపిణీ సంస్థలు దృష్టిపెట్టాలని సూచించారు. థర్మల్ ప్లాంట్లల్లోని బూడిదను వివిధ అవసరాలకు సద్వినియోగం చేసుకునే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఈ సమావేశంలో ఇంధన శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్, జెన్‌కో ఎండి నాగలక్ష్మి, ట్రాన్స్‌కో జెఎండి సూర్యసాయిప్రవీణ్ చంద్,డిస్కంల సిఎండిలు శివశంకర్, పృథ్వీతేజ్, పుల్లారెడ్డి, నెడ్‌క్యాప్ ఎండి కమలాకర్ బాబు, ట్రాన్స్‌కో డైరెక్టర్ ఎకెవి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పేరెంట్, టీచర్ సమావేశాలను రాజకీయ ప్రచార వేదికలుగా మార్చొద్దు

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 5న పాఠశాలల్లో జరగనున్న మెగా పేరెంట్, టీచర్ సమావేశాల్లో పాల్గొనాలని టిడిపి కార్యకర్తలకు ముఖ్యమంత్రి పిలుపునివ్వడం తీవ్ర అభ్యంతరకరమని సిపిఎం రాష్ట్ర కమిటీ తెలిపింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారిక కార్యక్రమాల్లో తమ పార్టీ కార్యకర్తలను పాల్గొనాలని చెప్పడం పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలకు తేడా లేకుండా చేయడమేనన్నారు. పాఠశాల అకడమిక్ కార్యకలాపాలను అధికార పార్టీ రాజకీయ ప్రచారానికి వినియోగించుకోవడం సరైంది కాదని, విద్యా కమిటీలు, తల్లిదండ్రులు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలను మాత్రమే వీటికి అనుమతించాలని కోరారు. బయట వ్యక్తులు, విద్యార్థి సంఘాలు విద్యా సంస్థల్లోకి ప్రవేశించరాదని, ఒకపక్క జిఓ ఇచ్చి మరోపక్కన తమ పార్టీ కార్యకర్తలను విద్యా సంస్థల్లో జరిగే సమావేశాల్లో పాల్గొనాలని చెప్పడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని వెల్లడిస్తోందని విమర్శించారు. విద్యాసంస్థల్లో బయట వ్యక్తులనే పేరుతో విద్యార్థి సంఘాలను నిషేధిస్తూ జిఓ జారీ చేయడాన్ని రాష్ట్రంలోని విద్యార్థి సంఘాలు, ప్రజాతంత్ర వాదులు, మేధావులందరూ నిరశించినా ప్రభుత్వం తన మొండివైఖరి కొనసాగిస్తోందని వివరించారు. మరోపక్క తమ పార్టీ కార్యకర్తలకు ఎటువంటి ఆటంకం లేకుండా ప్రవేశం కల్పించడం గర్హనీయమని తెలిపారు. ప్రజాస్వామ్యయుతంగా విద్యాసంస్థల్లో ప్రవేశానికి విద్యార్థి సంఘాలకు అవకాశం కల్పించేలా ప్రభుత్వం ఇప్పటికైనా ఆ జిఓను ఉపసంహరించుకోవాలన్నారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

నాలుగు రోజుల క్రితం అంబేద్కర్ కోనసీమ కొబ్బరి చెట్లకు తెగులు సోకి ఉత్పత్తి తగ్గడంపై డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను ఇప్పటికైనా ఉపసంహరించుకుని ప్రాంతీయ విద్వేషాలు పెరగకుండా నివారించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. తెగులును నివారించడానికి చర్యలు తీసుకునేందుకు బదులు తెలంగాణ దిష్టి తగిలిందని పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. కొబ్బరి రైతులను ఆదుకోవడంలో తమ వైఫల్యాన్ని కప్పిపెట్టుకోవడానికి తెలంగాణ ప్రజలపై ఆ నెపం నెట్టడం సహించరానిదని పేర్కొన్నారు. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే ఈ వ్యాఖ్యలను సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. పవన్‌కల్యాణ్ ఇప్పటికైనా వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది.

'ఐఎబి' ఇంత అధ్వానంగా ఎప్పుడూ జరగలేదు

- ఆళ్లగడ్డ రైతాంగ సమస్యలపై చర్చే లేదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన నీటిపారుదల సలహా మండలి సమావేశం ఇంత అధ్వానంగా ఎప్పుడూ జరగలేదని, ఆళ్లగడ్డ నియోజకవర్గ రైతుల సమస్యలపై చర్చే లేదని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఎబి సమావేశం ముగిసిన అనంతరం నంద్యాల పట్టణంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగు గంగ ప్రాజెక్టు చైర్మన్ సంజీవ్ కుమార్ రెడ్డి, సాగునీటి డిస్ట్రిబ్యూటరీ కమిటీల డైరెక్టర్లతో కలిసి ఆమె మాట్లాడారు. తెలుగు గంగ ప్రాజెక్టు నుండి ఆళ్లగడ్డ చివరి ఆయకట్టు వరకు రబీ పంటల సాగుకు ఎంతవరకు నీళ్లు ఇస్తామనేది స్పష్టత ఇవ్వలేదని తెలిపారు. సున్నా నుండి 150 కిలోమీటర్ల వరకు కెసి కెనాల్‌కు నీళ్లు ఇవ్వలేమని అధికారులు చెబుతున్నారని, శ్రీశైలం నుండి బానకచర్ల ద్వారా ఇవ్వడానికి అవకాశం ఉన్నా వాటి గురించి చర్చ చేయకపోవడం దారుణమని అన్నారు. నీటి పారుదలపై అవగాహన లేని తెలుగు గంగ ఎస్ఇ, కెసి కెనాల్ ఇఇ ప్రతాప్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ఇరిగేషన్ అధికారులకు అవగాహన లేదన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంపై చర్చ లేనప్పుడు తమకు సమాచారం ఇవ్వద్దని స్పష్టం చేశారు. ఐఎబి సమావేశం తీరును సిఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

ధాన్యం కొనుగోలు సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్

- ఖరీఫ్‌లో ఇప్పటి వరకు 11,93,743 మెట్రిక్ టన్నులు సేకరణ
- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం విక్రయ పద్ధతిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సివిల్ సప్లై భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధాన్యం సేకరణ, అందుతున్న ఫిర్యాదులపై అధికారులతో సివిల్ సప్లై భవన్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 1,77,934 మంది రైతుల నుంచి 11,93,743 మెట్రిక్ టన్నుల ధాన్యం తమ ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. ఇందుకు సంబంధించి ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.2,830 కోట్లు జమ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఎటువంటి సమస్యలున్నా 1967 టోల్‌ఫ్రీ నెంబరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెంబరు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

రైతులు ధాన్యం రిజిస్ట్రేషన్ సమస్యలు, టోకెన్ రావడంలో ఆలస్యం, మిల్లుల్లో తూకం సమస్యలు, ఎఫ్‌టిఓ పెండింగ్, రవాణా లేదా గోనె సంచుల కొరత వంటి వాటితో పాటు ఏదైనా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోళ్లు ఆగిపోవడం వంటి సమస్యలన్నింటినీ టోల్ ఫ్రీ నెంబరుకు తెలియజేయవచ్చన్నారు. ఫోన్ చేసే ముందు రైతులు వారి ఆధార్, రిజిస్ట్రేషన్, టోకెన్ నెంబర్లు, గ్రామం పేరు, రైతు సేవా కేంద్రం వివరాలు దగ్గర ఉంచుకోవాలని మంత్రి సూచించారు. కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపుతామన్నారు. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు అధికారులు చొరవ తీసుకుంటారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సివిల్ సప్లై అధికారులు, మండలాల వారీ రైతులు, రైస్‌మిల్లర్లు రైతు సేవా కేంద్రాల నిర్వాహకులను ఫోన్ ద్వారా సంప్రదించి ధాన్యం కొనుగోలు సమస్యలను తెలుసుకుని వారికి సూచనలు అందిస్తారన్నారు. ఈ సమీక్షలో సివిల్ సప్లై డైరెక్టర్ ఆర్ గోవిందరావు, సివిల్ సప్లై అడ్మిన్ మేనేజరు జి శిరీష, కంట్రోల్ రూమ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

గురజాడ ఇంటిపై దాడి



గురజాడ నివాసం, ఇంటి ఆవరణలో విరగ్గొట్టిన లైట్

- మహనీయుని రచనలకు రక్షణ కరువు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి గురజాడ నివాసంలో చొరబడి తలుపులు, లైట్లు, ఇతర సామగ్రి ధ్వంసం చేశారు. గురజాడ వినియోగించిన సామగ్రిని భద్రపర్చిన గది తాళాలు విరగ్గొట్టారు. గురజాడ ఇంటిపై తరచూ దాడులు జరుగుతున్నా జిల్లా అధికారులుగాని, ఆర్కియాలజీ డిపార్టుమెంట్‌గాని పట్టించుకోకపోవడంతో కవులు, సాహితీవేత్తలు, పలు సాహితీ సంఘాలు ఆవేదన చెందుతున్నారు. గురజాడ అప్పారావు ఇంటిని శుభ్రం చేయడానికి రోజువారీలా మంగళవారం ఉదయం పనిమనిషి తాళాలు తీసి లోపలకు వెళ్లి చూడగా బాత్రూం డోర్ విరగ్గొట్టి ఉంది. వెంటనే గురజాడ వారసులైన గురజాడ వెంకట ప్రసాద్‌కు, ఆయన భార్య ఇందిరకు ఆమె సమాచారం ఇవ్వడంతో, వారు వచ్చి పరిశీలించారు. ఇంట్లో ఫ్యాన్లు, కుర్చీలు, ఇతర సామాన్లు ఉన్న గది తలుపులు తీసి ఉన్నాయి. అందులో ఒక సుత్తి మాయమైనట్లు గమనించారు. రచనలు ఉన్న గదిలోకి వెళ్లడానికి చెక్క తలుపును తొలగించిన అగంతుకులు గాజు అద్దాలతో ఉన్న డోర్ తెరవలేక పోయినట్లు ఆనవాలు ఉన్నాయి. గమనించిన గురజాడ వారసులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. తహశీల్దార్ కూర్మనాథరావు, ఆర్ఐ రాజు, వన్‌టౌన్ సిఐ చౌదరి, ఎస్ఐ లక్ష్మీ ప్రసన్నకుమార్, సిబ్బంది వచ్చి పరిశీలించారు. ఈ చర్యలకు పాల్పడిన వారిని గురించి తగుచర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. వెంటనే సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. గురజాడ నివాసంలో దాడి జరగడం ఇది మూడోసారి. రెండు రోజుల క్రితమే గురుజాడ వర్ధంతిని ఇటు సాహితీ స్రవంతి, అటు గురుజాడ సాంస్కృతిక సమాఖ్య ఘనంగా నిర్వహించాయి. గురజాడకు సముచిత స్థానం కల్పించాలని, రాష్ట్ర పండగగా గుర్తించాలని, గురజాడ జాతీయ స్మారక చిహ్నంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేశారు.

జూన్ నాటికి స్పోర్ట్స్ అకాడమీల పునరుద్ధరణ

- శాప్ చైర్మన్ రవినాయుడు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వచ్చే ఏడాది జూన్ నాటికి అన్ని జిల్లాల్లో స్పోర్ట్స్ అకాడమీలను పున:ప్రారంభిస్తామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. శాప్ డైరెక్టర్లు పి.రవీంద్రనాథ్, కె.జగదీశ్వరితో కలిసి ఏలూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు స్టేడియం, ఇండోర్ స్టేడియం పూర్తిగా పరిశీలించామని, వాటిని పూర్తి స్థాయిలో క్రీడాకారులకు ఉపయోగపడేలా సిద్ధం చేస్తామని తెలిపారు. అల్లూరి సీతారామరాజు స్టేడియంలో మూడు లేయర్ల సింథటిక్ ట్రాక్ నిర్మిస్తామని చెప్పారు. ఇటీవల నిర్వహించిన డిఎస్‌సిలో 81 మందికి స్పోర్ట్స్ కోటాలో పిఇటిలు, పీడీలుగా ఉద్యోగాలు వచ్చినట్లు తెలిపారు. నకిలీ సర్టిఫికెట్లకు చెక్ పెట్టే విధంగా ఆధార్ అనుసంధానంతో క్రీడాయాప్ తీసుకొస్తామని తెలిపారు. నేషనల్, జోనల్, యూనివర్సిటీ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులు ఆ యాప్‌లో నమోదు చేసుకుంటే వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. అమరావతి, తిరుపతి, రాజమండ్రి, విశాఖపట్నం, గుంటూరు, కర్నూలు, అనంతపురం ప్రాంతాలను స్పోర్ట్స్ హబ్‌లుగా తయారు చేయనున్నామని, ప్రతి జిల్లాలో స్థానికంగా ఎక్కువ ప్రాచుర్యం పొందిన నాలుగు క్రీడలను ఎంపిక చేసి వాటి అభివృద్ధికి పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. జనవరి నాటికి రూ. ఐదు కోట్ల రూపాయలతో అన్ని జిల్లాలకు క్రీడా పరికరాలు అందిస్తామని, త్వరలోనే కోచ్‌ల నియామకాలు చేపడతామని తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల జీతాలు పెంచాలి

- ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ పథకంలోని ఫీల్డ్ అసిస్టెంట్ (ఎఫ్ఎ)ల జీతాలు పెంచాలని, దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ డైరెక్టర్ వైవి షణ్ముక్ కుమార్, సభ్య కార్యదర్శి మద్దిలేటిని యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం పరందామయ్య, బి నరసింహులు తదితర నాయకులు మంగళవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో రకరకాల యాప్‌లతో ఫీల్డ్ అసిస్టెంట్లపై అదనపు భారం వేస్తున్నట్లు చెప్పారు. మ్యాన్ డేస్ విధానం రద్దు చేసి, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎన్ఎంఎంఎస్ విధానంలో హాజరు సక్రమంగా నమోదు కాకపోవడం వల్ల ప్రతి వారంలో ఒక్కో ఉపాధి కూలీ రెండు రోజులు నష్టపోతున్నారని డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. 2016లో ఇచ్చిన సెల్‌ఫోన్‌లు నేటికీ వాడుతున్నారని, కొత్త ఫోన్‌లు ఇవ్వాలని కోరారు.

శివారు గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాల్లో అదనపు పనులు నిర్వహిస్తున్న ఎఫ్ఎలకు అలవెన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి కూలీలు నష్టపోకుండా వెంటనే తగు చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ షణ్ముక్ కుమార్ హామీ ఇచ్చారు. పిఆర్ అండ్ ఆర్‌డి కమిషనర్‌తో చర్చించి సానుకూలమైన పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు పి జాన్‌బాబు, ఎల్ రవి, ఎం హరినాథ్, రామకృష్ణ, ఎస్ వెంకన్న, బేబిరాణి, విశ్వనాథం, రమేష్, స్వరూప్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే చలో అసెంబ్లీ

చేనేత కార్మికుల ధర్నాలో సంఘం నాయకులు పి బాలకృష్ణ

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)



డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

చేనేత కార్మికులకు ఉచిత కరెంట్, రూ.25 వేలు స్కీములను అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో చలో అసెంబ్లీ నిర్వహిస్తామని తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని చేనేత, జౌళిశాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ఎపి చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికులకు 200 విద్యుత్ యూనిట్లు ఉచితంగా కరెంటు ఇస్తామని 2024 ఆగస్టు 7వ తేదీన సిఎం చంద్రబాబు ప్రకటించారని, ఈ ఏడాది ఆగస్టు 7న ప్రతి చేనేత కార్మికునికి సంవత్సరానికి రూ.25 వేలు ఇస్తామని చెప్పారని, కానీ ఇప్పటి వరకూ వీటిని అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. అదే విధంగా సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.176 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కో సహకార సంఘాల వద్ద కొనుగోలు చేసిన బట్టలకు నగదు వెంటనే చెల్లించాలని కోరారు. త్రిఫ్ట్ ఫండ్ కింద చేనేత కార్మికులకు ఇవ్వవలసిన రూ.27 కోట్లు వెంటనే విడుదల చేయాలని, చేనేతపై జిఎస్‌టి పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం చేనేత డైరెక్టర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు కాకి మల్లికార్జునరావు, డోకుపర్తి రామారావు, గోలి దుర్గాప్రసాద్, సిహెచ్ సీతారామాంజనేయులు, తిరువీధుల హేమ సుందర్రావు, గుంటి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



థర్మల్ ప్రతులను దహనం చేస్తున్న థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు

థర్మల్ ప్లాంట్ ప్రతులు దహనం

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

శ్రీకాకుళం జిల్లా సరుబుజ్జిలి మండలంలోని వెన్నెలవలస గ్రామంలో థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యాన థర్మల్ పవర్‌ప్లాంట్ ప్రతులను మంగళవారం దహనం చేసి నిరసన తెలిపారు. థర్మల్ ప్లాంట్ వద్దంటే వద్దు అని పెద్దపెట్టున నినాదాలు చేశారు.

తక్షణమే థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదనను టిడిపి కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కొండ ప్రాంతాలను నమ్ముకుని జీవనం సాగిస్తున్న గిరిజనుల బతుకులను థర్మల్ ఏర్పాటుతో బుగ్గిపాలు చేయొద్దని కోరారు. కార్యక్రమంలో థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు బాడంగి సురేష్ దొర, సవర సింహాచలం, ఎ.రవికాంత్, గిరిజనులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 40 గొర్రె పిల్లలు మృత్యువాత

ప్రజాశక్తి - పొందూరు

శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలంలోని కొంచాడ గ్రామంలో కుక్కల దాడిలో 40 గొర్రె పిల్లలు మంగళవారం మృత్యువాతపడ్డాయి. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అన్నదమ్ములు కురమాన రమణ, కురమాన గౌరినాయుడు తమ గొర్రెల శాలలో ఉంచిన గొర్రె పిల్లలపై మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా కుక్కల గుంపు దాడి చేశాయి. గొర్రె పిల్లల అరుపులకు సమీపంలో ఉన్న వారు పరుగెత్తి వచ్చి కుక్కలను తరిమికొట్టారు. అప్పటికే అందులో ఉన్న 40 గొర్రె పిల్లలూ మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటనతో సుమారు రూ.మూడు లక్షల వరకూ నష్టం వాటిల్లింది.

మృతి చెందిన గొర్రె పిల్లలకు పెనుబర్తి పశు వైద్యాధికారి హేమంత్ పోస్టుమార్టం నిర్వహించారు. గొర్రెల పెంపకమే తమ జీవనాధారమని, గొర్రె పిల్లలన్నీ మృతి చెందడంతో రోడ్డున పడ్డామని బాధితులు వాపోయారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.



మృతి చెందిన గొర్రె పిల్లలను చూసి రోదిస్తున్న బాధితులు



భారీ బందోబస్తు నడుమ జోగి రమేష్‌ను కోర్టుకు హాజరు పరుస్తున్న పోలీసులు

నకిలీ మద్యం కేసులలో జోగి సోదరులకు 14 రోజుల రిమాండ్

ప్రజాశక్తి - ములకలచెరువు/తంబళ్లపల్లి (అన్నమయ్యజిల్లా)

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఇప్పటివరకు 33 మందిపై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులుగా చేర్చిన మాజీ మంత్రి జోగి రమేష్, జోగి రాములను పిటి వారెంట్‌పై ఎక్సైజ్ పోలీసులు తంబలపల్లి కోర్టులో హాజరుపరిచారు. ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం కేసులో నిందితులుగా నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న వీరిద్దరినీ భారీ బందోబస్తు నడుమ తంబలపల్లి కోర్టుకు తీసుకువచ్చారు. నిందితులకు తంబలపల్లి కోర్టు జడ్జి ఉమర్ ఫరూక్ 14 రోజులు రిమాండ్ విధించారు. అనంతరం వారిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసులో ఇప్పటివరకు 29 మందిని అరెస్టు చేయగా మరో నలుగురు పరారీలో ఉన్నారు. కోర్టుకు హాజరు పరిచి బయటకు తీసుకొచ్చిన సందర్భంలో జోగి రమేష్‌ను తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి, మదనపల్లి వైసిపి సమన్వయకర్త నిషార్ అహ్మద్ కలిశారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 122 | విజయవాడ, బుధవారం 3 డిసెంబర్ 2025 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 3 December 2025 | Rs

'సంచార్ సాథీ' మంటలు

- ఉభయసభల్లో నిరసనల పర్వం
- దేశ ప్రజల గోప్యతపై దాడి అంటూ ప్రతిపక్షాల ఆందోళన
- విస్తృత చర్చ జరగాలని కాంగ్రెస్, సిపిఎం డిమాండ్

8

కోహ్లి, రోహిత్‌పైనే ఆశలు



- సిరీస్ ఇక్కడే సాధించాలి
- నేడు దక్షిణాఫ్రికాతో రెండో వన్డే
- మధ్యాహ్నం 1.30గం॥ల నుంచి

10

ఎస్ఐఆర్.. ఓట్ల చోరీ ఆపాలి



ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేస్తున్న ప్రతిపక్ష పార్టీల సభ్యులు.

అట్టుడికిన ఉభయ సభలు

- లోక్‌సభ పలుమార్లు వాయిదా... రాజ్యసభ నుంచి ప్రతిపక్షాల వాకౌట్
- పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్షాల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో రెండో రోజు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అంశం ఉభయ సభల్ని కుదిపేసింది. ఎస్ఐఆర్‌పై చర్చకు అధికార పక్షం ముందుకు రాకపోవడంతో ప్రతిపక్షాలు ఆందోళనలు కొనసాగించాయి. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా అమలు చేస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేసిన ఆందోళనతో వరుసగా రెండో రోజు కూడా లోక్‌సభకు అంతరాయం కలిగింది. రాజ్యసభలో కూడా అనేకసార్లు కార్యకలాపాలు అంతరాయం కలిగింది. హడావిడిగా ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టడంపై అత్యవసరంగా చర్చించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీనివల్ల అనేక రాష్ట్రాల్లో ఒత్తిడితో అనేకమంది బిఎల్‌వోలు ఆత్మహత్య చేసుకున్నారు. వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక చర్చ తర్వాతే ఎస్ఐఆర్ అంశాన్ని పరిగణించవచ్చని మోడీ ప్రభుత్వం మొండిపట్టుదలతో ఉంది. ఇప్పటికే కుదించిన శీతాకాల సమావేశాలను ఎటువంటి గందరగోళం లేకుండా శాంతియుతంగా నిర్వహించడంలో తమకు ఆసక్తి లేనట్టుగా కేంద్ర ప్రభుత్వ వైఖరి ఉంది. శీతాకాల సమావేశాలకు ముందు జరిగిన అఖిలపక్ష సమావేశంలో ఎస్ఐఆర్‌తో సహా ఏదైనా అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. సమావేశాల మొదటి రెండు రోజుల్లో ప్రతిపక్షాలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా సభకు అంతరాయం కలగడానికి కారణమైంది.

మంగళవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ ప్రారంభం కాగానే, స్పీకర్ ఓం బిర్లా జార్జియన్ పార్లమెంట్ అధ్యక్షులు షల్వా పాపువాష్విలీ నేతృత్వంలోని జార్జియా పార్లమెంట్ బృందానికి స్వాగతం పలికారు. ప్రతినిధి బృందం పర్యటన రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారం, సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందన్నారు. ఎస్ఐఆర్ అంశంపై చర్చకు ప్రతిపక్ష పార్టీలు పట్టుబట్టాయి. వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేయడంతో.. 16 నిమిషాల్లోనే మధ్యాహ్నం 12 గంటలకు సభ వాయిదా పడింది. తిరిగి సభ ప్రారంభంకాగానే... కాంగ్రెస్, డిఎంకె, సిపిఎం, సిపిఐ, ఎన్‌సిపి, ఎస్‌పి, టిఎంసి తదితర ప్రతిపక్ష పార్టీల సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ఎస్ఐఆర్‌పై చర్చకు డిమాండ్ చేశారు. సభా కార్యక్రమాలకు అంతరాయం కలిగించవద్దని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపక్ష ఎంపిలను కోరారు. 'ఓట్ చోరీ, గద్దీ చోరీ' అంటూ సభ్యులు నినాదాలు హోరెత్తించారు. దీంతో తొమ్మిది నిమిషాల్లోనే మధ్యాహ్నం 2 గంటలకు సభ వాయిదా పడింది. తిరిగి సభ ప్రారంభమైనా ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించాయి. దీంతో సభను బుధవారానికి వాయిదా వేశారు.

రాజ్యసభ నుంచి వాకౌట్

అతి ముఖ్యమైన ఎస్ఐఆర్‌పై చర్చ జరగాలని రాజ్యసభలోనూ ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. తొలుత రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్ జార్జియ బృందానికి స్వాగతం పలికారు. అనంతరం జీరో అవర్‌ను ప్రారంభించారు. వివిధ అంశాలపై చర్చ చేపట్టాలని రూల్ 267 కింద ఇచ్చిన 20 నోటీసులను చైర్మన్ తిరస్కరించారు. వెంటనే ప్రతిపక్ష ఎంపిలు ఎస్ఐఆర్, ఇతర అంశాలపై చర్చకు మిగతా 5లో



నెల్లూరు నగరంలో వామపక్షాలు, ఇతర రాజకీయ పక్షాలు నిర్వహించిన భారీ ర్యాలీ

నెల్లూరు జిల్లా

బంద్ సక్సెస్

వర్షం పడుతున్నా రోడ్డుపైకి వచ్చి వేలాదిగా మద్దతు

- స్వచ్ఛందంగా దుకాణాలు, వ్యాపార, విద్యా సంస్థలు మూసివేత
- పెంచలయ్య హత్యను నిరసిస్తూ వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ర్యాలీలు
- టిడిపి, వైసిపి సంఘీభావం

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

ప్రజాగాయకులు, సిపిఎం నాయకులు కె.పెంచలయ్య హత్యకు నిరసనగా మంగళవారం నెల్లూరు జిల్లా బంద్ విజయవంతమైంది. సిపిఎం ఇచ్చిన బంద్ పిలుపునకు నెల్లూరు నగరంతోపాటు, జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి భారీ మద్దతు లభించింది. దిత్వా తుపాను ప్రభావంతో జోరు వర్షం కురుస్తున్నా జిల్లా వ్యాప్తంగా వేలాదిగా ప్రజలు రోడ్డుపైకి వచ్చి బంద్‌లో పాల్గొన్నారు. సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్, సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ, ఆర్‌పిఐ, కాంగ్రెస్, బిఎస్‌పి, ఇసికెతోపాటు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్, ఎంఆర్‌పిఎస్, దళిత సంఘాలు, ప్రజా సంఘాలు బంద్ విజయవంతానికి కృషి చేశాయి. బంద్‌లో భాగంగా జోరు వర్షంలోనూ ర్యాలీలు నిర్వహించారు. టిడిపి, వైసిపి సంఘీభావం ప్రకటించాయి. దుకాణాలను వ్యాపారులు స్వచ్ఛందంగా మూసి బంద్‌కు మద్దతు తెలిపారు. వ్యాపార, విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు మూతబడ్డాయి. నెల్లూరు నగరంలోని వర్తకులు, వ్యాపారులు బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ప్రయివేటు బస్సులు కూడా తిరగలేదు. నెల్లూరు నగరంలో నిర్వహించిన ర్యాలీలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. 'ఖబడ్దార్... ఖబడ్దార్.. గంజాయి గూండాల్లారా... గంజాయి అంతం.. సిపిఎం పంతం... జోహార్ పెంచలయ్య... సాధిద్దాం... సాధిద్దాం.. పెంచలయ్య ఆశయాలను.' అంటూ సింహపురి మారుమోగింది. ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద నిరసన తెలిపారు. సుందరయ్య కాలనీ వద్ద జాతీయ రహదారిపై ధర్నాతో కొద్దిసేపు వాహనాలు మిగతా 5లో

అమరావతిలో రెండో దశ సమీకరణకు ఉత్తర్వులు

- వేలిముద్ర తప్పనిసరి
- లక్ష్యం 20,494 ఎకరాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధాని అమరావతిలో రెండోదశ భూ సమీకరణకు రంగం సిద్ధమైంది. 20.494 ఎకరాల భూమిని సమీకరించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ మంగళవారం జిఓ నెంబరు 252 విడుదల చేశారు. ఎపిసిఆర్‌డిఏ చట్టంలోని సెక్షన్ 55లోని సబ్‌సెక్షన్ 2 ప్రకారం సమీకరణ ప్రక్రియ చేపడుతున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. . మొత్తం ఏడు గ్రామాల పరిధిలో భూములు సమీకరించాలని సిఆర్‌డిఏ అథారిటీ తీర్మానం నెంబరు 556/2025 ప్రకారం నవంబరు 27న జరిగిన మంత్రివర్గ ఉపసంఘం తీసుకున్న నిర్ణయం మేరకు సమీకరణ చేపట్టే అధికారం సిఆర్‌డిఏ కమిషనర్‌కు అప్పగించారు. అయితే రెండోదశ సమీకరణలో గతంలో మాదిరి కాకుండా ఖచ్చితంగా వేలిముద్ర ఆధారంగా రైతుల నుండి సమీకరణ అనుమతి తీసుకోనున్నారు. దీనికి ఆధార్ నెంబరు ధృవీకరణ కూడా తప్పనిసరి చేశారు. దీంతో భవిష్యత్‌లో రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేయడం, కోర్టుకు వెళ్లడం వంటి పనులకు అవకాశం ఉండదని అధికారులు భావిస్తున్నారు. తొలిదశలో వచ్చిన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని రెండోదశలో 9.3 అగ్రిమెంటు పకడ్బందీగా రూపొందించారు. జిఓ ప్రకారం అమరావతి మండలంలోని వైకుంఠపురం, పెదమద్దూరు, యండ్రాయి, కర్లపూడి లేమల్లేలో 9619 ఎకరాలు తీసుకోనున్నారు. దీనిలో పట్టా భూమి 7465 ఎకరాలు, అసైన్డ్ భూమి 97, ప్రభుత్వ భూమి 2054 ఎకరాలు ఉంది. తుళ్లూరు మండలంలోని వడ్డమాను, హరిశ్చంద్రాపురం, పెదపరిమి గ్రామాల్లో 10878 ఎకరాల భూమి తీసుకోనున్నారు. ఇందులో 9097.56 ఎకరాల పట్టాభూమి, 7.01 ఎకరాల ఎసైన్డ్, 1774.07 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది.

● ఎకరాలలో

గ్రామం	పట్టా	అసైన్డ్	ప్రభుత్వ భూమి	మొత్తం
వైకుంఠపురం	1965	0	1395.48	3361
పెదమద్దూరు	1018	0	127	1145
యండ్రాయి	1879	46	241	2166
కర్లపూడిలేమల్లె	2603	51	290.75	2944
వడ్డమాను	1763	4.72	168.86	1937
హరిశ్చంద్రాపురం	1448	2.29	977.87	2428
పెదపరిమి	5886	0	627.34	6513

'స్క్రబ్ టైఫస్'పై ప్రజలకు అవగాహన

- వ్యాధి తీవ్రత పెరగకముందే చికిత్స
- సమీక్షలో సిఎం చంద్రబాబు



వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ వ్యాధికి సంబంధించిన కేసుల నమోదుపై వైద్యారోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి సౌరభ్‌గౌర్‌తో కలిసి మంగళవారం సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ.. విజయనగరం జిల్లాలో స్క్రబ్ టైఫస్ బారిన పడి చందక రాజేశ్వరి అనే మహిళ మృతి చెందిన తరహా ఘటనలు మరెక్కడా జరగకుండా చూడాలన్నారు. చిగ్గరమైట్ తరహా కీటకాలు కుట్టడం వల్ల వచ్చే వ్యాధితో పాటు ప్రమాదాన్ని ఏ విధంగా కట్టడి చేయాలనే దానిపై ప్రజలకు వివరించాలన్నారు. స్క్రబ్ టైఫస్ కేసులు, ఆ వ్యాధి లక్షణాలు, వాటివల్ల ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోననే అంశంపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించాలని అధికారులకు సూచించారు. చిన్న చిన్న కీటకాలు కుడితే మరణించే పరిస్థితి రాకూడదని, పూర్తి స్థాయిలో అవగాహన పెంచడమే సరైన పరిష్కారమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అధికారులు చూడాలన్నారు. ఏమైనా కీటకాలు కుట్టిన వెంటనే పరీక్షలు చేయించేలని, వ్యాధి తీవ్రత పెరగకముందే అవసరమైన చికిత్స అందించేలా వైద్యారోగ్యశాఖ సిద్ధంగా ఉండాలని సూచించారు. వైద్యారోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి సౌరభ్‌గౌర్ మాట్లాడుతూ.. విజయనగరానికి చెందిన రాజేశ్వరిని చిగ్గర్‌మైట్ అనే కీటకం కుట్టిందని, ముందుగా టైఫాయిడ్ చికిత్స అందించారని ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం రాపిడ్ టెస్ట్ ద్వారా స్క్రబ్ టైఫస్ పాజిటివ్ అని తేల్చారన్నారు. విజయనగరం క్యాసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాజేశ్వరి మరణించినట్లు తెలిపారు. ఓరింటియా సుసుగామషి అనే బ్యాక్టీరియా ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుందని, అధిక జ్వరం, చలి, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పులతో పాటు మైట్ కుట్టిన తర్వాత పుండ్లు ఏర్పడటం వంటివి ఈ వ్యాధి లక్షణాలని ముఖ్యమంత్రికి తెలిపారు. సకాలంలో చికిత్స అందిస్తే ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. ఈ సమీక్షలో పలువురు వైద్యారోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు ఆర్‌టిజిఎస్‌తో గుర్తించండి

- ఉత్తరాంధ్ర కేంద్రగా మెటల్ పరిశ్రమల క్లస్టర్
- సమీక్షా సమావేశంలో సిఎం

6

రూపాయి రికార్డు పతనం

ముంబయి : అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రోజు రోజుకు రూపాయి విలువ చారిత్రాత్మక పతనాన్ని చవి చూస్తోంది. మంగళవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ 42 పైసలు పతనమై 89.61 దిగజారింది. ఫారెక్స్ మార్కెట్‌లో ఉదయం 89.70 వద్ద ప్రారంభమైన రూపాయి విలువ ఓ దశలో 47 పైసలు కోల్పోయి క్షీణించి 90కి పడిపోయింది. భారత్‌పై అమెరికా వేసిన భారీ టారిఫ్‌లకు తోడు, విదేశీ నిధులు బయటకు తరలిపోవడం, డాలర్ల కొనుగోళ్లకు దిగుమతిదారులు మొగ్గు చూపడం, రూపాయి పతనాన్ని కట్టడి చేయడంలో మోడీ సర్కార్ విఫలం కావడం దేశీయ కరెన్సీని అగాథంలోకి నెట్టుతున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 0.25 శాతం తగ్గి 63.03 వద్ద నమోదయ్యింది. మంగళవారం బిఎస్ఇ సెన్సెక్స్ 503.63 పాయింట్లు కోల్పోయి 85,138 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 144 పాయింట్ల నష్టంతో 26,032కు పరిమితమయ్యింది. సోమవారం సెషన్‌లో విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.1,171.31 కోట్లు తరలించుకుపోయారు. ఇది కూడా రూపాయిపై ఒత్తిడిని పెంచుతోంది.

గంజాయి ఖైదీలతో కిక్కిరిసిన కేంద్ర కారాగారం

- డ్రగ్స్ రవాణాకు అడ్డాగా విశాఖ!
- యథేచ్ఛగా అమ్మకాలు
- ఈ ఏడాదిలో 533 కేసులు, 1,435 అరెస్టులు



చింతపల్లి మండలం వర్తనపల్లి వద్ద ఇటీవల పట్టుబడ్డ 760 కిలోల గంజాయి బస్తాలు

అరెస్టులు, కేసుల వివరాలు

2025లో నమోదైన గంజాయి కేసులు	: 533
అరెస్టయిన వారు	: 1,435 మంది
అందులో విశాఖ జిల్లా వారు	: 712 మంది
ఇతర జిల్లాల నిందితులు	: 332
ఇతర రాష్ట్రాలకు చెందిన వారు	: 391 మంది

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

గంజాయి ఖైదీలతో విశాఖలోని కేంద్ర కారాగారం కిక్కిరిసింది. గంజాయి కేసుల్లో పట్టుబడిన వారిలో శిక్షపడిన వారు, విచారణ ఖైదీలు ఈ కారాగారంలో 1,100 మంది వరకూ ఉన్నారు. ఈ జైలు వాస్తవ సామర్థ్యం 914 మందేనని జైలు సూపరింటెండెంట్ ఎం.మహేష్ 'ప్రజాశక్తి'కి తెలిపారు. అంతకుమించి ఇక్కడ గంజాయి ఖైదీలే ఉన్నారు. మిగతా ఖైదీలు సుమారు 400 మంది ఉన్నారు. డ్రగ్స్, గంజాయి రవాణాకు అడ్డాగా విశాఖ మారింది. చాక్‌లెట్స్, టాబ్లెట్ రూపంలో వీటి అమ్మకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. గంజాయి మత్తుకు యువత ఎక్కువగా బానిసవుతోంది. గంజాయిని, డ్రగ్స్‌ని బైకులపైనా, కారుల్లోనూ, బస్సుల్లో బ్యాగుల్లోనూ తీసుకొస్తూ పట్టుబడిన వారిలో యువకులే అధికంగా ఉంటున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన వారే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు చెందిన పలువురు ఈ స్మగ్లింగ్‌లో నిందితులుగా ఉన్నారు. గంజాయి, ఇతర డ్రగ్స్ వ్యాపారాల తనిఖీకి రాష్ట్రంలోనే అత్యధిక నెట్‌వర్క్ విశాఖలో ఉంది. 21 డాగ్‌స్క్వాడ్స్, ప్రత్యేక బృందాలు ఉన్నప్పటికీ అదుపులో పురోగతి కానరావడం లేదు. గంజాయి, డ్రగ్స్ అక్రమార్కులు ప్రభుత్వం, పోలీసుల ఎత్తుకు పైఎత్తులు వేస్తూ తమ అక్రమ రవాణాను ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు విస్తరించారు. రవాణాదారులు, వినియోగదారులే పట్టుబడుతున్నారు. తయారీదారులు, సరఫరాదారుల వివరాలు బయటకు రావడం లేదు. గంజాయి మాఫియా కొంతమంది నిరుద్యోగ యువతను తమ వ్యాపారానికి సాధనంగా ఎంచుకుని యథేచ్ఛగా తన వ్యాపారాన్ని కొనసాగిస్తోంది. యువతను టార్గెట్ చేసి సరఫరా చేస్తోంది. వారితో అమ్మిస్తోంది.

ప్రముఖ విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ఆఖరుకు కేంద్ర కారాగారంలోనూ...

విశాఖ నగరంలోని కొన్ని యూనివర్సిటీలు, కొన్ని ప్రముఖ కాలేజీల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గంజాయి, డ్రగ్స్‌కు బానిసైనట్లు పోలీసు ఉన్నతాధికారులే బహిరంగంగా వెల్లడించారు. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు సరఫరా అవుతోంది. రోడ్డు ప్రమాదాలు, హత్యలు, దాడులు, అశ్లీల మిగతా 5లో

ఆ విద్యాభిలాషులు.. టిడిపి కార్యకర్తలేనా..?

- మెగా పిటిఎం మార్గదర్శకాల్లో విద్యాశాఖ కొత్తపదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'విద్యా సంస్థల్లో రాజకీయ జెండాలు, నాయకులు, రాజకీయ ప్రసంగాలు వద్దు' అని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్న మాటలు ఇవి. కాని, ముఖ్యమంత్రి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మాత్రం పాఠశాలల్లో జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (పిటిఎం) సమావేశాల్లో పాల్గొనాలని తన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఇటీవల ఆదేశాలిచ్చారు. సిఎం మాటలకు తగ్గట్టుగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ మంగళవారం ఆదేశాలివ్వడం గమనార్హం. గతంలో పాఠశాలల్లో జరిగిన మెగా పిటిఎంలలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులు మాత్రమే హాజరుకావాలని ఆదేశాలు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ ఈసారి మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించింది. ఈ నెల 5న జరిగే మెగా పిటిఎం విధి విధానాలు, మార్గదర్శకాలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు మంగళవారం మిగతా 5లో

కేరళ వాదనల్లో న్యాయం ఉంది

- ఎస్ఐఆర్ గణన పొడిగింపుపై ఇసి లోతుగా పరిశీలించాలి
- సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ : కేరళలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఈ నెల 13 తర్వాత కనీసం ఒక వారం రోజుల పాటు పొడిగించాలని కేరళ ప్రభుత్వం, రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు చేస్తున్న అభ్యర్థనలు సరైనవేనని, వాటిల్లో న్యాయం వుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. భారత ఎన్నికల కమిషన్ వాటిని లోతుగా పరిశీలించాల్సిన అవసరం వుందని అభిప్రాయపడింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఇసికి అభ్యర్థన పంపని పక్షంలో పొడిగింపునకు గల కారణాలను వివరిస్తూ ఒక లేఖను పంపాల్సిందిగా కేరళ ప్రభుత్వాన్ని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని బెంచ్ మంగళవారం ఆదేశించింది. బుధవారానికల్లా ఇసికి ఈ అభ్యర్థన అందేలా చూడాలని పేర్కొంది. రాష్ట్రం చేసిన అభ్యర్థనలను సానుభూతితో, నిష్పాక్షికతతో రాబోయే రెండు రోజుల్లో పరిశీలించాల్సిందిగా ఇసిని కోర్టు కోరింది. కింది స్థాయి ప్రజాస్వామ్యానికి అత్యంత కీలకమైన స్థానిక సంస్థల ఎన్నికలను ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్వహించుకునేందుకు అనుమతించాల్సిందిగా రాష్ట్రప్రభుత్వం, రాజకీయ పార్టీలు చేసిన అభ్యర్థనలను కూడా బెంచ్ పరిగణనలోకి తీసుకుంది.

941 గ్రామ పంచాయతీలు, 152 బ్లాక్ పంచాయతీలు, 14 జిల్లా పంచాయతీలు, 87 మున్సిపాలిటీలు, ఆరు కార్పొరేషన్లతో కూడిన 1200 స్థానిక స్వపరిపాలనా సంస్థల ఎన్నికలకు కేరళ సమాయత్తం అవుతోంది. మొత్తంగా మిగతా 5లో

సంపాదకీయం


పెరుగుతున్న విపత్తుల తీవ్రత

భూ వాతావరణం మారుతున్నకొద్దీ తుపాన్లు, వరదలు తరచుగా, విస్తృతంగా విరుచుకుపడుతున్నాయి. ఈ సంవత్సరం దక్షిణాసియాలో కురిసిన భారీ వర్షాలు, వాటి కారణంగా వచ్చిన వరదలు థాయ్‌లాండ్, ఇండోనేషియా, శ్రీలంకల్లో తీవ్ర నష్టం కలిగించాయి. వెయ్యికి పైగా మరణాలకు కారణమయ్యాయి. మన దేశంలోనూ నష్టాలు కనిపించాయి. మన రాష్ట్రంలో పెద్దగా ప్రాణ నష్టం కనిపించనప్పటికీ, పొరుగు రాష్ట్రాల్లో కొందరి ప్రాణాలు పోయాయి. దిత్వా తుపాన్ శ్రీలంకలో సృష్టించిన బీభత్సం కళ్లముందే కనపడుతోంది. సెన్యార్ తుపాన్ కూడా శ్రీలంక, సుమత్రాలపై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. అక్కడ నగరాలు, గ్రామీణ ప్రాంతాలన్న తేడా లేకుండా విలయం చోటుచేసుకుంది. ఇంతకు ముందెన్నడూ చూడనంత తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నామని రక్షణ బృందాలు చెబుతున్నాయి. ఆ స్థాయిలో కాకపోయినా మన పొరుగు రాష్ట్రమైన తమిళనాడులోనూ భారీ నష్టం చోటుచేసుకుంది. ఈ రెండు తుపాన్ల కారణంగా ఆ రాష్ట్రంలో 57వేలహెక్టార్లు పైగా పంటలు దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా! పూర్తి స్థాయి గణాంకాలు ఇంకా సిద్ధం కావాల్సి ఉంది. తుపాన్లను ఎదుర్కోవడంలో మన దేశంలో, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని అధికార యంత్రాంగం మంచి అనుభవాన్ని సాధించింది. దానికి తగ్గట్టుగానే వాతావరణ కేంద్రం నుండి అందే హెచ్చరికల ఆధారంగా ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడం, తీర ప్రాంతాల్లోని లక్షలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటివి కొంత కాలంగా అలవాటైన చర్యలు! అప్పుడప్పుడు వాతావరణ హెచ్చరికలు నూరు శాతం నిజం కాకపోయినా, ప్రజా ప్రయోజనాల రీత్యా రక్షణ చర్యలు తీసుకోవడం మాత్రం తప్పనిసరి!

వాతావరణ విపత్తుల తీవ్రత అంతకంతకూ పెరుగుతోంది. ప్రతి విపత్తు పెను ముప్పుగా మారుతోంది. అలాగే వాటి సంఖ్య కూడా పెరుగుతూ ఉంది. మన దేశం కూడా ఈ పరిస్థితికి మినహాయింపు కాదు. సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సిఎస్‌ఇ) చేసిన అధ్యయనం ప్రకారం దేశ వ్యాప్తంగా 2022 నుండి ఇప్పటివరకు 1,227 రోజుల పాటు ప్రతి ఒక్క రోజూ ఏదో ఒక వాతావరణ విపత్తు చోటుచేసుకుంది. అతివృష్టి, వేడి గాలులు, వడగండ్ల వాన, తుపాను, వరదలు ఇలా ఏదో ఒకటి దేశంలో ఏదో ఒక ప్రాంతంలో ఈ రోజుల్లో నమోదైంది. ఇన్ని రోజుల పాటు విపత్తుల నమోదు కావడమన్నది గతంలో ఎన్నడూ లేని దుస్థితి. శీతాకాలంలో వడగాలులు, వేసవిలో ముంచెత్తే వానలు, రుతుపవనాల మధ్యలో పొడి వాతావరణం నెలకొనడం వంటి అసాధారణాలు సాధారణమవుతున్నాయి. ఫలితంగా ఒకప్పుడు క్రమం తప్పకుండా పలకరించే రుతువులు ఇప్పుడు గతి తప్పుతున్నాయి. వ్యవసాయ చక్రాలు మారిపోతున్నాయి. ఎండల తీవ్రత దృష్ట్యా మార్చిలోనే పాఠశాలలు వేసవి సెలవులను ప్రకటిస్తున్నాయి. వర్షాల కారణంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో కూడా విద్యాసంస్థలు మూసివేయాల్సి వస్తోంది.

ఉష్ణోగ్రతల పెరుగుదల కారణంగా చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పులు. ధనిక దేశాలు అమలు చేస్తున్న విధానాల కారణంగా ఏటా భూతాపం పెరుగుతూనే ఉంది. హరిత గృహ వాయువుల మోతాదు చరిత్రలో ఎప్పుడూ లేని స్థాయికి చేరుకుంది. ఫలితంగా సముద్ర జలాల వేడి కూడా భారీగా పెరుగుతోంది. ఇవన్నీ భారత ఉపఖండంలోని సముద్రాలలో చోటుచేసుకుంటున్న తుపాన్ల సంఖ్య, తీవ్రత, మార్గాలన్నింటిని మార్చి వేస్తున్నాయి. ఒకప్పుడు పశ్చిమ బెంగాల్ వైపు దూసుకువెళ్లే అత్యధిక తుపాన్లు, ఇప్పుడు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తీరాల వైపు మళ్లుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. దిత్వా తుపాన్ గమనమే దీనికి తాజా ఉదాహరణ. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ఉన్న హెచ్చరికల వ్యవస్థలు, తీసుకుంటున్న రక్షణ చర్యలు రానున్న రోజుల్లో ఏమాత్రం చాలవు. మన వ్యవస్థలను మార్చుకోవాల్సి ఉంది. అనూహ్యమైన చోట విరుచుకుపడుతున్న వరద నీటిని నిల్వ చేసే విధానాలను రూపొందించాలి. నగరాలు, పట్టణాల్లో ముంపును నివారించేందుకు అధునాతన డ్రైనేజ్ వ్యవస్థతో కూడా ప్రణాళికలను అమలు చేయాలి. సముద్రతీర ప్రాంతాల్లో బఫర్ జోన్‌లు, మడ అడవుల పునర్నిర్మాణం వంటి చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. రైతాంగాన్ని ఆదుకునేందుకు వాతావరణ బీమాను అమలులోకి తీసుకురావాలి. అప్పుడే విపత్తులు సృష్టించే విలయం నుండి కొంతమేరకైనా భరోసా ప్రజలకు దక్కుతుంది.

మహనీయుల మాట



ఉడుతను పెంచాను..
పారిపోయింది.
చిలుకను పెంచాను...
పారిపోయింది.
మొక్కను పెంచాను..
పై రెండూ వచ్చి చేరాయి.

- అబ్దుల్ కలాం,
క్షిపణి శాస్త్రవేత్త, పూర్వ రాష్ట్రపతి.

వ్యాఖ్య

కార్మికులపై జిహాద్ : బానిసత్వానికి శాసనబాట

బీహార్ శాసనసభ ఎన్నికల్లో ప్రధానమైన విజయం అనంతరం ఆ ఊపులోనే భారత ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు విడుదల చేసింది. వేతనాలు, పారిశ్రామిక సంబంధాలు, వృత్తిగత భద్రత, సామాజిక భద్రతలకు సంబంధించిన ఈ కోడ్‌లు 29 కార్మిక చట్టాలు సులభతరం చేయడమనే పేరిట రుద్దబడ్డాయి.

అయితే ఆ చట్టాలలో వున్న కార్మిక భద్రతాంశాల అవశేషాలు ఏ మాత్రం మిగిలివున్నా ఈ నాలుగు కోడ్‌లు వాటినీ నీరుగారుస్తాయన్నది అసలు నిజం. ఉద్యోగ భద్రత విషయంలో కార్మిక శాఖకు ఏయే పాత్రలు కల్పించబడినా వాటన్నిటికీ ఇప్పుడు స్వస్తి చెప్పడం జరుగుతుంది. అసంఘటిత రంగంలోని 90 శాతం మంది కార్మికులకు ఏ మాత్రం రక్షణ లేకుండా చేయబడుతుంది. వారిని నియమించే అధికార వ్యవస్థ అంటూ వుండకుండా పోతుంది.

ఈ లేబర్ కోడ్‌లు అందరికీ ఒక కనీస వేతనం వుండేలా చేస్తాయని కేంద్రం చెప్పుకుంటున్నది. అయితే అనేక రాష్ట్రాలలో ఇప్పుడున్న కనీస వేతనాలను తగ్గించుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. స్కీమ్ వర్కర్లతో సహా లక్షోపలక్షల మంది కార్మికులు న్యాయమైన జీవితానికి అవసరమైన వేతనం సంగతి అటుంచి కనీస వేతనం పరిధి నుంచి కూడా మినహాయించబడతారు.

అన్నీ అవాస్తవాలే

ఈ సోషల్ కోడ్‌లు గిగ్ వర్కర్లకూ వీధుల్లో పనిచేసేవారికీ సామాజిక భద్రతను తొలిసారి ప్రవేశపెడతాయని కూడా కేంద్రం చెబుతున్నది. అయితే ఇందుకు ఎలాంటి నిధుల కేటాయింపుగానీ కాలవ్యవధిగానీ నిర్ణయించింది లేదు. ఉద్యోగులకూ యాజమాన్యానికి మధ్యన సంబంధమేమిటో కూడా ప్రస్తావించలేదు. అలాంటప్పుడు ఏదో ఆధార్ కార్డు వుందంటే దాని ద్వారా కార్మిక బలగం పరిస్థితి ఎలా మెరుగవుతుంది?

లేబర్ కోడ్‌ల ప్రకారం నిర్ణీత కాలవ్యవధిగల ఉద్యోగాలకు సమానమైన ప్రయోజనాలు లభించు తాయని కూడా చెప్పబడుతున్నది. వాస్తవం ఏమంటే దీనివల్ల నిరంతరాయంగా కొనసాగే ఉద్యోగాలలో ఈ కోడ్ స్వల్పకాలిక కాంట్రాక్టుల ద్వారా శాశ్వత ప్రాతిపదికన తాత్కాలిక ప్రతిపత్తి ప్రవేశపెడుతుంది. తద్వారా సర్వీసు కొనసాగింపు దెబ్బతినిపోవడమే గాకుండా యూనియన్లుగా ఏర్పడే హక్కులు కూడా లేకుండా పోతాయి.

లేబర్‌కోడ్‌ల వల్ల ప్రభుత్వం వాటి అమలుకు సంబంధించిన పర్యవేక్షణ పాత్రను, క్రమబద్ధీకరణ పాత్రనూ కోల్పోతుంది. ఫిర్యాదులు అందితే తనిఖీ చేయడమనే ప్రస్తుత పద్ధతిని పూర్తిగా లేకుండా చేస్తుంది. దాని స్థానే తమకు తామే సర్టిఫికెట్లు ఇచ్చుకునే పద్ధతి తెచ్చి పెడుతుంది. అంటే దాని అర్థం వారు ప్రస్తుతమున్న నిబంధనలు పాటించకుండా వారు అన్ని రకాలైన ఉల్లంఘనలకూ పాల్పడవచ్చునన్నమాట. ఉద్యోగులు రక్షణ కోసం కల్పించబడిన ఈ ప్రయోజనాల తొలగింపునకు పెట్టుకున్న ముద్దు పేరే స్వీయ అమలు ప్రకటన.



> **లేబర్‌కోడ్‌ల వల్ల ప్రభుత్వం వాటి అమలుకు సంబంధించిన పర్యవేక్షణ పాత్రను, క్రమబద్ధీకరణ పాత్రనూ కోల్పోతుంది. ఫిర్యాదులు అందితే తనిఖీ చేయడమనే ప్రస్తుత పద్ధతిని పూర్తిగా లేకుండా చేస్తుంది. దాని స్థానే తమకు తామే సర్టిఫికెట్లు ఇచ్చుకునే పద్ధతి తెచ్చి పెడుతుంది. అంటే దాని అర్థం వారు ప్రస్తుతమున్న నిబంధనలు పాటించకుండా వారు అన్ని రకాలైన ఉల్లంఘనలకూ పాల్పడవచ్చునన్నమాట. ఉద్యోగులు రక్షణ కోసం కల్పించబడిన ఈ ప్రయోజనాల తొలగింపునకు పెట్టుకున్న ముద్దు పేరే స్వీయ అమలు ప్రకటన.**

ఈ లేబర్‌కోడ్‌లు చిన్న మధ్య తరహా పరిశ్రమలు (ఎం.ఎస్.ఎం.ఇ లు) టీ తోటల వంటివి, గనులు నిర్మాణ కార్మికుల పరిస్థితి మెరుగుదలకు తీసుకొచ్చినట్టు చిత్రించడం జరుగుతున్నది. ఇంతకన్నా పచ్చి అసత్యం మరొకటి వుండదు. ఎం.ఎస్.ఎం.ఇ లలో పని చేసే కార్మికులు చట్టం పరిధిలో లేరు. సెస్ వసూలులోనూ పారదర్శకతను కాపాడే యంత్రాంగమేమీ లేదు. అపాయకరమైన ప్రమాదాలు జరిగే గనులు, తోటల వంటి చోట్ల తనిఖీలను నీరుగార్చడం మరింత తీవ్రమైన ప్రమాదాలు జరగడానికి దారితీస్తుంది. నేరపూరిత దోషం చట్టం కింద యజమానులకు బాధ్యత లేకుండా చేయబడుతుంది.

ఐ.ఎల్.సి ఏమైంది?

లేబర్ చట్టాల స్థానంలో లేబర్ కోడ్‌లు ప్రవేశపెట్టే విషయమై కార్మికులతో తాము సాధ్యమైనంత ఎక్కువగా చర్చలు జరిపామని కేంద్ర ప్రభుత్వం పత్రికా ప్రకటనలు చేస్తున్నది. సోషల్ మీడియాలోనూ చెప్పుకుంటున్నారు. స్వతంత్ర భారతదేశంలో మొదటి లేబర్ కమిషన్ 1966లో ఏర్పడింది. ప్రభుత్వం, ఉద్యోగులు, కార్మికుల త్రైపాక్షిక సంప్రదింపులకు ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐ.ఎల్.సి) అనేది వ్యవస్థాపక యంత్రాంగంగా వుండాలని మొదటి లేబర్ కమిషన్ సిఫార్సు చేసింది. కానీ గత పదేళ్లలో ఒక్కసారి కూడా ఐ.ఎల్.సి సమావేశం జరిపిందే లేదు. అందువల్ల పార్లమెంటు ఎలాంటి అర్థవంతమైన చర్చలు లేకుండానే ఈ లేబర్‌కోడ్‌లు రూపొందించింది. ఇంకా చెప్పాలంటే కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తయారైనాయి. యాజమాన్యాల తప్పులను నేరం కాకుండా చేయడానికీ, తమ సమిష్టి హక్కులు, బేరసారాలను సాధించుకోవడం కోసం కార్మికులు జరిపే పోరాటాలను, నిరసనలనూ నేరంగా మార్చడానికీ ఇవి ఉద్దేశించబడ్డాయనేది స్పష్టమే. ఉద్యోగులపై యాజమాన్యాల అభిప్రాయాన్నే రుద్దే ప్రక్రియకు ఇది కచ్చితంగా పరాకాష్ట.

పెట్టుబడులూ ఉద్యోగాల నిజాలు

కనుక హోరెత్తిస్తున్న సులభతర వాణిజ్యం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) నినాదానికి బాటలు వేయడమే ఈ లేబర్‌కోడ్‌ల వెనక నిర్దేశం. దాంతో భారీగా పెట్టుబడులు వచ్చేస్తాయనీ, ఆ వెంటనంటి ఉద్యోగాల కల్పన కూడా పెద్ద ఎత్తున జరిగిపోతుందనీ భావించడం విచారకరం. పరిశ్రమలపై అనేక సంవత్సరాల నివేదికలు పరిశీలిస్తే కనిపించే కఠోర వాస్తవాలు ఇందుకు పూర్తి విరుద్ధంగా వున్నాయి. 1981-82లో వచ్చిన వేతనాల నికర విలువ 30.27 శాతం వుంటే 2023-24లో కేవలం 15.97 శాతానికి పడిపోయిందని ఈ నివేదికలు చెబుతున్నాయి. ఇదే కాలంలో యజమానుల లాభాలు మాత్రం 23.39 శాతం నుంచి 51.01 శాతానికి చేరుకున్నాయి. దీని ప్రభావం కార్మికులపై మరింత తీవ్రంగా కనిపిస్తుంది. ఉత్పత్తి రంగంలో సగటున వేతనాల పెరుగుదల రేటు 2013-14లో 6.7 శాతం వుంటే 2023-24లో 4.8 శాతానికి దిగజారింది.

చదువుకున్న నిరుద్యోగ యువత సంఖ్య పెరిగిందని ప్రభుత్వం ఒప్పుకుంటుంది. 2024-25 ఎకనామిక్ సర్వే చూస్తే సగటున వచ్చే పదేళ్లలో ఏడాదికి 85 లక్షల ఉద్యోగాలు కల్పించబడతాయని చెబుతున్నది. యువతలో నిరుద్యోగం రేటు ఆసియాలోనే అత్యధికంగా మన దేశంలో 17.6 శాతంగా వుంది. ఎ.ఐ అనే కృత్రిమ మేధస్సు ఇండియాలో ఐ.టి రంగంలో 20 లక్షల ఉద్యోగాలను హరించవచ్చునని నీతి ఆయోగ్ అంచనా వేసింది. ఉత్పత్తి రంగానికి సంబంధించిన డేటాను గమనిస్తే పనిలో పాల్గొంటున్నవారి సంఖ్య 2004-05 మధ్య 7.14 శాతం వుంటే 2023-24 మధ్య 5.92 శాతానికి పడిపోయింది.

ఈ లెక్కలను పరిశీలించినపుడు దేశంలో గిరాకి వేగంగా పడిపోతున్నట్టు స్పష్టంగా అర్థమవుతుంది. కార్మికులను దోచుకునే కార్పొరేట్లు, యజమానులపై ఎలాంటి ఆంక్షలు లేకుండా చేయడం వల్ల ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం మరింత పెరగడమే జరుగుతుంది. దాంతో దేశీయ గిరాకీ పూర్తిగా కుప్పకూలిపోతుంది. అలాంటి ఆందోళనకరమైన పరిస్థితి పెట్టుబడులు రావడానికి సానుకూలత ఎలా సృష్టించగలదు?

ఉత్పత్తి వ్యవస్థకే ముప్పు

లేబర్ కోడ్‌లు నిజంగానే కార్మికులను మరింత బానిసలుగా చేయడానికి పునాది వేస్తాయి. వాస్తవంలో ఆర్థిక ఉత్పత్తికి అవసరమైన రెండు ప్రాథమిక అంశాల్లోనూ అంటే శ్రామికులు, పెట్టుబడి అనే రెంటినీ దెబ్బతీస్తాయి. ఈ రెండింటి మధ్య సమతుల్యత గనక లేకుండా పోతే-ప్రభుత్వం యాజమాన్యాలపై అన్ని నియంత్రణలు ఎత్తివేసి కార్మికులు మగ్గిపోవలసిన పరిస్థితి కల్పిస్తే మొత్తం ఉత్పత్తి వ్యవస్థనే తెగిపోతుంది. స్తంభించిపోతుంది.

ఉత్పత్తి క్రమంలో సాంకేతిక పరిజ్ఞానం ఒక ముఖ్యమైన భాగమని ఎవరైనా భావించేట్టయితే ఈ రోజున దాన్ని పెట్టుబడితో కలిసి ఏకపక్షంగా గుమ్మరిస్తున్నారు. దానివల్ల ఒకవైపున ఉత్పాదకత పెరుగుతుంది. అయితే అందుకు తగినట్టు శ్రామికులకు రక్షణ లేకపోతే అనివార్యంగా అది వారిని మరింతగా దోచుకోవడానికే దారితీస్తుంది. లేబర్‌కోడ్‌ల లోని ప్రతి నిబంధనా ఆ దిశలోనే వుంది. అందుకనే వాటిని కార్మికులపై వర్గయుద్ధం (జిహాద్)గా చూడాల్సి వుంది. ఇక ఇప్పుడు ముందుకు పోవడానికి ఏకైక మార్గం శ్రామికుల సమిష్టి నిరసన, సమైక్య పోరాటాలు మాత్రమే. మాత్రమే. కార్పొరేట్ యజమానులకు ఆయుధాలు సమకూర్చేందుకు, అంతులేని ఆధిపత్యం కల్పించేందుకు మారుపేరుగా ముందుకొచ్చిన ఈ తప్పుడు సంస్కరణలతో నేరుగా ఢీకొనవలసిందే. అదృష్టవశాత్తూ కార్మికవర్గంలో ఐక్యత పెరుగుతుండటం, విస్తార రైతాంగ వర్గాలు కూడా వారితో భుజం కలపడం వల్ల ఈ పరిస్థితిని పరిష్కరించడానికి కృషి సాగించవచ్చు.

(నవంబరు 26 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం

సందర్భం

మెరుగైన ప్రపంచం కోసం పోరాడదాం

వికలాంగులలో సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికపరంగా చైతన్యం నింపేందుకు ఏర్పడినదే ప్రపంచ వికలాంగుల దినోత్సవం (డిసెంబర్ 3). వికలాంగులకు సమాన అవకాశాలు, హక్కులు కల్పించి వారిని సమాజాభివృద్ధిలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి 1981 సంవత్సరాన్ని అంతర్జాతీయ వికలాంగుల సంవత్సరంగా ప్రకటించింది.

ఆరోగ్య అసమానతల వలన చాలా మంది వికలాంగులు చనిపోతున్నారు. సమాజంలో వివక్షత, అసమాన విధానాలు ప్రజల ఆరోగ్యాన్ని నిర్ణయించే అంశాలుగా ఉన్నాయి. ఆరోగ్య సంరక్షణలో నాణ్యత లేకపోవడం, ఆరోగ్య కార్యకర్తలు తక్కువ మంది ఉండడం వంటివి వికలాంగుల జీవితాలపై ప్రభావం చూపుతున్నాయి. ఆరోగ్య అసమానతల వలన వికలాంగులు మెరుగైన వైద్యం పొందడంలో వెనకబడి ఉంటున్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 74 సంవత్సరాలు పూర్తయింది. రాజ్యాంగంలో పేర్కొన్న స్వేచ్ఛ, సమానత్వం సౌభ్రాతృత్వం వంటివి వికలాంగులకు అందని ద్రాక్షగానే మిగులుతున్నాయి. ఆర్టికల్ 14 నుండి 19 వరకు సమాజంలో పౌరులందరూ సమానమేనని, ఎలాంటి వివక్షతలు ఉండరాదని పేర్కొంది. ఇవేవీ వికలాంగులకు దక్కడం లేదు. సమాజంలో నేటికీ వికలాంగులు ద్వితీయ శ్రేణి పౌరులుగా బతకాల్సిన దుస్థితి దేశంలో ఏర్పడింది. విద్యా, ఉద్యోగాల్లో సైతం వివక్షత కొనసాగడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఆర్టికల్ 41 ప్రకారం వికలాంగులకు ఆర్థిక స్వావలంబన కల్పించి వారిని అభివృద్ధి చేయాలని, పని కల్పించే బాధ్యత ప్రభుత్వానిదే అని పేర్కొంది. ఇవేవీ అమలు కాకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనం.

విద్య, ఉద్యోగాల్లో న్యాయమైన వాటా వికలాంగులకు దక్కకపోవడంతో అనేకమంది ఉన్నత చదువులు చదివి నిరుద్యోగులుగా మారుతున్నారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ నియామకాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి. వికలాంగులకు ప్రత్యేక స్కూళ్లు, ప్రత్యేక శిక్షణ పొందిన టీచర్లను ఏర్పాటు చేయాల్సి ఉన్నా అమలు కావడం లేదు.

2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం 21 రకాల వైకల్యాలను గుర్తించింది. కానీ వైకల్య ధృవీకరణ పత్రాలు మాత్రం 1995 పి.డబ్ల్యు.డి చట్టం గుర్తించిన 7 రకాల వైకల్యాలకు మాత్రమే సర్టిఫికెట్లు ఇస్తున్నారు. కండరాల క్షీణత, తలసేమియా, ఆటిజం, సెరిబ్రల్ పాల్సీ వంటి తీవ్ర వైకల్యం కలిగిన వికలాంగులు సర్టిఫికెట్లు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చట్టం అమల్లోకి వచ్చి 9 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఏడు రకాల వైకల్యాలకు మాత్రమే వైకల్య ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తున్నారు.

అనేక పోరాటాల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం కోసం అనేక చట్టాలను చేసింది. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం, 2017 ఇంటర్ హెల్త్ కేర్, నేషనల్ ట్రస్ట్, ఆటిజం యాక్ట్ ఐక్యరాజ్యసమితి హక్కుల ఒప్పందం వంటి అనేక చట్టాలు దేశంలో వికలాంగుల సంక్షేమం కోసం ఉన్నా పాలకులకు చట్టాలను అమలు చేయాలనే చిత్తశుద్ధి లేదు. పెట్టుబడిదారులకు సానుకూల వాతావరణం కల్పించాలనే పేరుతో కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం వికలాంగుల చట్టాలను కూడా మార్చేందుకు ప్రయత్నిస్తున్నది.

నేటికీ సామూహిక ప్రాంతాలు వికలాంగులకు అందనంత దూరంలో ఉన్నాయి. వికలాంగులకు దివ్యాంగులుగా నామకరణం చేశారు ప్రధానమంత్రి. పేరు మార్చినంత మాత్రాన వికలాంగులకు ఒరిగిందేమీ లేదనే విషయం ప్రభుత్వాలు గుర్తించాలి. వికలాంగులపై వివక్షత, వేధింపులు అరికట్టేందుకు అట్రాసిటీ చట్టం లాంటి బలమైన చట్టం ప్రత్యేకంగా తీసుకురావాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్ట్ పేర్కొన్నదంటేనే దేశంలో వికలాంగులకు రక్షణ లేకుండా పోతోందని అర్థమవుతున్నది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వికలాంగుల వ్యతిరేక విధానాలపై ఉద్యమించవలసిన అవసరం ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం వికలాంగులపై మనుధర్మ భావజాలాన్ని రుద్దేందుకు ప్రయత్నిస్తున్నది. దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం, రైల్వేలో సౌకర్యాలు, అంత్యోదయ రేషన్ కార్డులు, నామినేటెడ్ పదవులలో రిజర్వేషన్లు, సామాజిక భద్రత, స్వయం ఉపాధి, మహిళా వికలాంగుల రక్షణ కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉంది.

- యం. అడివయ్య,
ఎన్.పి.ఆర్.డి జాతీయ ఉపాధ్యక్షులు,
సెల్ : 9490098713

అంతర్జాతీయం

అమెరికా విద్యావిధానంలో అవకాశాల కుదింపు



పెనుమల్లి మధు



భారత విద్యారంగంలో అనేక మార్పులు ప్రవేశ పెట్టినట్లే అమెరికాలో ట్రంప్ ఈ అక్టోబర్ 1వ తేదీన కొన్ని మార్పులు ప్రకటించాడు. భారత్‌లో విద్యా వ్యవస్థ కుదింపునకు గురికావడం, అశాస్త్రీయ ధోరణులు, మతోన్మాద భావజాలాన్ని తలకెత్తుకోవడం జరిగినట్లే అమెరికాలో 'అమెరికా ఫస్ట్' పేరిట కొందరికే విద్యావకాశాలు పరిమితం చేస్తున్నారు. కన్జర్వేటివ్ విధానాలను అంగీకరించేవారికే యూనివర్సిటీ విద్య అన్న విధానం అమల్లోకి తెచ్చే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

"యు.ఎస్ న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్టు" ట్రంప్ ఫెడరల్ ప్రభుత్వం చేపట్టిన కొత్త 'విద్యా నైపుణ్య ఒప్పందా'న్ని (కాంపాక్ట్ అకడమిక్ ఎక్సలెన్సీ) విశ్లేషించింది. 2025 అక్టోబర్ 1 నుండి ఇది అమల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు. రిక్ గార్నెట్ (నోట్రే డామే యూనివర్శిటీ), సెరినా మయేరి (యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా), అమంద షనూర్ (యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా), అలెగ్జాండర్ ఒలోక్ (యామోరి యూనివర్సిటీ), ఇల్యాసొమిన్ (జార్జ్ మాసోన్ యూనివర్శిటీ)లు అమెరికా లోని టాప్ యూనివర్శిటీ ప్రొఫెసర్లు. వీరు వివిధ భావజాల దృక్కోణాలకు సంబంధించిన వారైనా అందరూ ఈ 'విద్యా నైపుణ్య ఒప్పంద' విధానాన్ని ఒకే స్వరంతో తిరస్కరిస్తున్నట్లు ప్రకటించారు. ట్రంప్ ఒప్పందాన్ని తిరస్కరించండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి (రిజెక్ట్ ట్రంప్ కాంపాక్ట్, ప్రొటెక్ట్ డెమోక్రసీ) అని పిలుపునిచ్చారు.

"మాకు రాజకీయ అంశాల్లో తేడాలున్నా మేమంతా ఒకే మాటపై ఏకాభిప్రాయం కలిగిఉన్నాం" అని పైన పేర్కొన్న యూనివర్శిటీలలో పని చేసే ప్రొఫెసర్లు ప్రకటించారు. కొందరు కన్జర్వేటివ్ భావజాలం కలిగినవారు కాగా, మరి కొందరు లిబరల్ డెమోక్రటిక్ భావజాలం కలిగి ఉన్నామని తమకు తాము ప్రకటించుకొని కొత్త 'విద్యా నైపుణ్య ఒప్పంద' విధానాన్ని ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ విధానాలు అమెరికా ఉన్నత విద్యా స్వేచ్ఛను, పరిశోధనను తీవ్రంగా దెబ్బ తీస్తుందని ప్రకటించారు. అంతేకాక వైవిధ్యభరితమైన సామాజిక తరగతులున్న దేశంలో ఈ విధానం ప్రత్యర్థిని లొంగదీసుకోవడానికి ఉద్దేశించినదిగా ఉందని ప్రకటించారు. నేరుగా ప్రత్యర్థుల ప్రయోజనాల్ని దెబ్బతీసే ప్రతిపాదనల్ని ఇందులో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

'విద్యా నైపుణ్య ఒప్పంద' విధానం అంటే ...

ఈ విధానం ప్రకారం ఇప్పటిదాకా అమలులో ఉన్న భిన్నత్వం, భాగస్వామ్యం, సమ్మిళిత ప్రోగ్రామ్‌లు మూసివేయడం. ఈ విధానం ప్రకారం అంతర్జాతీయ విద్యార్థులకు అడ్మిషన్లు 15 శాతానికి కుదించబడతాయి. ఒకే దేశం నుండి వచ్చే విద్యార్థులకు అడ్మిషన్లు 5 శాతానికి తగ్గించబడతాయి (ఇప్పుడు పైన పేర్కొన్న శాతాల కంటే ఎక్కువ మంది అడ్మిషన్లు పొందుతున్నారు). 'అమెరికా ఫస్ట్' అన్న విధానం కింద 'తెల్లవారికి' మొదటి ప్రాధాన్యత అమలు చేయడం. యూనివర్సిటీలు సంస్థాగత తటస్థతను అమలు చేయాలని చెప్పి, ట్రంప్ భావజాలాన్ని ప్రోత్సహించే తటస్థతను అమలు చేయడం. కన్జర్వేటివ్ ఐడియాలజీని తక్కువజేసేలా ఫ్యాకల్టీగానీ, విద్యార్థులుగానీ మాట్లాడితే శిక్షలు విధిస్తారు. ప్రతిభ, వాస్తవికత, లక్ష్యాలను సాధించడం వంటి నినాదాలను 'విద్యా నైపుణ్య ఒప్పందం'లో పేర్కొన్నా అందులో ప్రధానంగా యూనివర్సిటీలు ట్రంప్ సిద్ధాంతాన్ని బలపరిచే కేంద్రాలుగా ఉంటాయి.

ఎందుకు తిరస్కరించాలి?

భావజాల రంగంలో పలచబడుతున్న ప్రభుత్వ సానుకూలత నేపథ్యంలో ప్రభుత్వాన్ని విమర్శించకుండా కట్టడి చేయడానికి తమ ప్రయోజనాల కోసం ట్రంప్ విద్యా కేంద్రాలను ఎంచుకొన్నాడు. విద్యా వ్యవస్థలో ప్రజాస్వామ్యాన్ని ఇది బందీ చేస్తుంది. ఇది రాజ్యాంగ విరుద్ధం. 'విద్యా నైపుణ్య ఒప్పందా'న్ని అమలు చేయడానికి ప్రభుత్వంతో విద్యా సంస్థలు స్వచ్ఛందంగా అంగీకరించాలి. అలా ఒప్పందం చేసుకొన్న వారికి మాత్రమే ఫెడరల్ నిధులు, గ్రాంట్లు, స్కాలర్‌షిప్‌లు, రీసెర్చ్‌కు మద్దతు, వీసాలకు ప్రోత్సాహాలు ఉంటాయి. స్టేట్ యూనివర్సిటీలపైన, ప్రైవేట్ యూనివర్సిటీలపైన ఫెడరల్ ప్రభుత్వ పెత్తనానికి ఇది దారితీస్తుంది. అంతేకాదు, కొన్నింటిని "టేకోవర్" చేయడానికి కూడా ఇది ఉద్దేశించబడింది. ఫెడరల్ ఫండింగ్‌ను బెదిరింపు ఆయుధంగా ఉపయోగించారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని 'విద్యా నైపుణ్య ఒప్పందం' దెబ్బతీస్తుంది. ఇది విద్యావ్యవస్థలో వివక్షను ప్రవేశపెడుతుంది. రాజకీయ సిద్ధాంతంపై ఆధిపత్యాన్ని సాధించడానికి ట్రంప్ విద్యారంగాన్ని ఎంచుకొన్నాడు. కన్జర్వేటివ్‌ల ఐడియాలజీకి మద్దతు పలచబడుతున్న సందర్భంలో దాన్ని కాపాడటం కోసమే విద్యారంగంలో ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. భిన్నత్వం, భాగస్వామ్యం, సమ్మిళితం వంటివి కన్జర్వేటివ్ విధానాల మీద హింసాత్మక దాడి చేస్తున్నట్లుగా భావించి ఈ విధానాల్ని ట్రంప్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. వలసలపై ఆంక్షలు విధించడం, అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యను తగ్గించడం, వారి సోషల్ మీడియా పోస్టులు చూసి భావజాలాన్ని బట్టి వీసాలు రద్దు చేయడం లాంటివి ఇప్పటికే ప్రమాదకరమైన ధోరణులుగా ఉన్నాయి. అలాగే ఇది యూనివర్సిటీల ప్రపంచవ్యాప్త సంబంధాలను దెబ్బతీస్తుంది. యూనివర్సిటీలలో రీసెర్చ్ అన్నది ఒక ముఖ్యమైన అంశం కాగా దాన్ని ఈ ట్రంప్ 'విద్యా నైపుణ్య ఒప్పందం' దెబ్బతీసి స్వేచ్ఛా వాతావరణాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తుంది. ట్రాన్స్‌జెండర్ విద్యార్థులను, మహిళా విద్యార్థులను క్రీడల నుండి బయటపెట్టడం శాస్త్రీయ దృష్టికి విరుద్ధం. ఫండింగ్, అకౌంటబులిటీ అంశాలను పరిశీలిస్తే మెరిట్ పేరుతో విద్యా నైపుణ్య విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు చెప్పినా వాస్తవానికి శాస్త్రీయ దృష్టికి, నైపుణ్యానికి వీలు లేకుండా చేస్తుందని పత్రికల నిండా వ్యాసాలు వచ్చాయి. తటస్థత అని ప్రకటించినా నిర్దిష్టంగా ఈ ట్రంప్ సిద్ధాంతాన్ని అంగీకరించి ఒప్పందం చేసుకొన్నవారికే ఫండింగ్ వస్తుంది. కనుక ప్రభుత్వ సిద్ధాంతాన్ని ఇది ఆదేశిస్తుంది. ఇది పరిశోధనను, ప్రతిభను దెబ్బతీస్తుంది. ఒప్పందం చేసుకొన్న యూనివర్సిటీల నడవడికను న్యాయశాఖ పర్యవేక్షిస్తుందని 'విద్యా నైపుణ్య ఒప్పందం' పేర్కొన్నది. ఒకవేళ విద్యార్థి చదువు మధ్యలో మానేస్తే యూనివర్సిటీకే డబ్బు తిరిగి చెల్లించాలన్న నిబంధన ఇందులో చొప్పించారు. ఇది అసాధారణమైన ఒత్తిడి అని ఫ్యాకల్టీలు పేర్కొన్నాయి.

యూనివర్సిటీల సమన్వయంతో ఆందోళనలు

'విద్యా నైపుణ్య ఒప్పందా'నికి వ్యతిరేకంగా దేశవ్యాపితంగా అక్టోబర్ మాసంలో విడివిడిగా ఆందోళనలు జరగగా నవంబర్ 7న యూనివర్సిటీల మధ్య సమన్వయంతో ఆందోళనలు మిన్నుముట్టాయి. వంద యూనివర్సిటీల్లో 1300 కేంద్రాల్లో విద్యార్థులు వీధుల్లోకి వచ్చి ప్రదర్శన చేశారు. 50 రాష్ట్రాల్లో ఈ ఆందోళనలు జరిగాయి.

ఏం చేయాలి?

అన్ని యూనివర్సిటీలు ఈ ఒప్పందాన్ని పూర్తిగా తిరస్కరించాలని, ఇది స్వచ్ఛందం కాదని, ఇది బెదిరింపు మాత్రమేనని ప్రకటించాయి. ఈ విధానాలను అక్టోబర్ 1న ప్రకటించగా నవంబరు 25 వరకు ఏ ఒక్క యూనివర్సిటీ కూడా ఈ ఒప్పందానికి తలొగ్గలేదు. వ్యక్తులు, అనేక విద్యా సంస్థలు ఇది రాజ్యాంగ వ్యతిరేకమని కోర్టుల్లో పిటిషన్లు వేశారు. విచారణలు కొనసాగుతున్నాయి.

యు.ఎస్ న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్టులో యూనివర్సిటీల ఫ్యాకల్టీలు ఈ కింది ప్రతిపాదనలు చేశారు. విద్యార్థులు, కాలమిస్టులు, ఫ్యాకల్టీలు బోధనా స్వేచ్ఛపై చర్చలు నిర్వహించాలి. విద్యా నైపుణ్య ఒప్పందాన్ని ఉపసంహరించాలి. ఖర్చు తగ్గించడం, ప్రతిభను ప్రోత్సహించడం, రాజకీయ ఒత్తిడి లేకుండా యూనివర్సిటీలు స్వతంత్రంగా పని చేసేలా మార్పులు కావాలి. ఈ స్వేచ్ఛను యూనివర్సిటీల్లో కోల్పోతే అవి ప్రమాణాలనే కాక, సాధారణ విద్య ప్రయోజనాన్ని కూడా కోల్పోతాయి. గ్లోబల్ గుర్తింపును కోల్పోతాయి. ఫ్యాకల్టీల సామర్థ్యం మొద్దుబారిపోతుంది.

/ వ్యాసకర్త సిపిఎం ఎ.పి పూర్వ కార్యదర్శి /

నెల్లూరు జిల్లా బంద్ సక్సెస్

(మొదటిపేజీ తరువాయి)

నిలిచిపోయాయి. ఆత్మకూరు బస్టాండ్ నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఆందోళన నిర్వహిస్తున్న సిపిఎం నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో, పోలీసులకు, సిపిఎం శ్రేణులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులును పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో, పోలీసు వాహనాన్ని కార్యకర్తలు అడ్డుకున్నారు. ఆ తర్వాత కత్తి శ్రీనివాసులును పోలీసులు విడుదల చేశారు. బంద్ నిర్వహిస్తుండగా మర్రిపాడు మండల కేంద్రంలోనూ సిపిఎం నాయకులకు, పోలీసులకు మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. కందుకూరు, గుడ్లూరు, ఉలవపాడు, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, వింజమూరు, దుత్తలూరు, ఎఎస్‌పేట, అనంతసాగరం, సంగం, విడవలూరు కొడవలూరు, బుచ్చి, కోవూరు, టిపి గూడూరు, ఇందుకూరుపేట, ముత్తుకూరు, పొదలకూరు, బిట్రగుంట, అల్లూరు, దగదర్తి ప్రధాన కేంద్రాల్లో బంద్ విజయవంతంగా సాగింది. బంద్‌కు వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. పెంచలయ్య హత్యను తీవ్రంగా ఖండించారు. పెంచలయ్య చిత్రపటానికి నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పూలమాలవేసి నివాళి అర్పించారు. బంద్ విజయవంతానికి సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి అరెగెల నాగేంద్ర సాయి, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ నాయకులు కె.రాంబాబు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, ఎం.మోహన్‌రావు, కె.అజయ్‌కుమార్, డివైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు రామన్న, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, బిఎస్‌పి నాయకులు జానకిరామ్, సిపిఐ (ఎంఎల్) నాయకులు యానాదయ్య, కొండమ్మ, ఎస్‌యుసిఐ నాయకులు బసవరాజు, ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు నాగేశ్వరరావు, భీమ్‌రామ్ భారత్ పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, ఆర్‌పిఐ నాయకులు మాబు, సిఐటియు, డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ, వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు కృషి చేశారు.

గంజాయిపై ఉక్కు పాదం మోపాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

రాష్ట్రంలో గంజాయి లేకుండా ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. బంద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒడిశా నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాలకు గంజాయి అక్రమ రవాణా జరుగుతోందన్నారు. నెల్లూరు జిల్లాలో గంజాయి, మాదక ద్రవ్యాల వ్యాపారం యథేచ్ఛగా సాగుతోందని తెలిపారు. పోలీసులు వాటిపై చర్యలు తీసుకోవడంలో వెనుకబడ్డారని విమర్శించారు. పెంచలయ్య తాను నివసిస్తున్న కాలనీలో గంజాయికి వ్యతిరేకంగా యువతను చైతన్యం చేశారని, దీంతో, ఆయనను గంజాయి మాఫియా అతి కిరాతకంగా హత్య చేసిందన్నారు. ఈ దురాఘాతానికి పాల్పడిన వారిని, ప్రోత్సహించిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బంద్‌కు మద్దతు తెలిపిన ప్రజలకు, రాజకీయ పార్టీలకు, ప్రజాసంఘాలకు రమేష్ అభినందనలు తెలిపారు.



నెల్లూరు విఆర్‌సి వద్ద మూత పడ్డ దుకాణాలు



గంజాయి గూండాల దిష్టిబొమ్మను గాంధీబొమ్మ వద్ద దగ్ధం చేస్తున్న దృశ్యం



నెల్లూరు గాంధీబొమ్మ వద్ద మానవహారం నిర్వహిస్తున్న వామపక్ష పార్టీలు

బంద్ జయప్రదం చేయడంపై సిపిఎం ధన్యవాదాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజా గాయకులు, సిపిఎం నాయకులు కె పెంచలయ్య హత్యకు నిరసనగా నెల్లూరు జిల్లా బంద్ జయప్రదం చేసిన ప్రజానీకానికి సిపిఎం రాష్ట్ర కమిటీ ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గంజాయి, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న పెంచలయ్య హత్యకు నిరసనగా జరిగిన బంద్‌కు వామపక్ష పార్టీలు, టిడిపి, వైసిపి, జనసేన, బిఎస్‌పి, విసికె, ఆప్, ఎంఆర్‌పిఎస్, మాలమహానాడుతో పాటు ప్రజా సంఘాలు, దళిత, గిరిజన, విద్యార్థి, యువజన, మహిళా, కళా, సాంస్కృతిక సంఘాలు ఏకోన్ముకంగా మద్దతు తెలపడం హర్షణీయమని తెలిపారు. స్వచ్ఛందంగా రవాణా, వ్యాపార సంస్థలు, వ్యక్తులు దుకాణాలు మూసివేసి నిరసన తెలపడం గంజాయి ముఠాకు చెంపపెట్టని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాన్ని సిపిఎం కొనసాగిస్తుందని వివరించారు. ఈ పోరాటానికి పార్టీలకు అతీతంగా సంఘాలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, మద్దతు ఇవ్వాలన్నారు. పెంచలయ్య కుటుంబానికి అండదండలిచ్చి ఆర్థికంగా ఆదుకోవాలన్నారు.

వారికి రెడ్ కార్పెట్ వేయాలా ?

- రోహింగ్యాలపై సుప్రీం వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : భారతదేశంలోకి అక్రమంగా ప్రవేశించిన వ్యక్తులను వెనక్కి తిప్పి పంపేటప్పుడు పద్ధతి ప్రకారం అన్ని విధి విధానాలు అనుసరించాలా అని సుప్రీం కోర్టు మంగళవారం ప్రశ్నించింది. అంతకుముందు ఢిల్లీ పోలీసుల కస్టడీలో వున్న పలువురు రోహింగ్యాలు కనిపించడం లేదంటూ దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బాగ్చిలతో కూడిన బెంచ్ విచారణ జరిపింది. మే మాసంలో రోహింగ్యాలను ఢిల్లీ పోలీసులు పట్టుకున్నారని, వారు ఇప్పుడు ఎక్కడున్నారో తెలియడం లేదని హక్కుల కార్యకర్త రీటా మన్‌చందా తన పిటిషన్‌లో పేర్కొన్నారు. చట్ట ప్రకారం నిర్దేశించిన విధానాలేవీ పాటించకుండానే వారిని తరలించేసి వుండవచ్చని ఆమె పేర్కొన్నారు. "ముందు సరిహద్దుల్లోని కంచెను అక్రమంగా దాటేసి వస్తారు, ఆ తర్వాత నుండి ఇంక.. మేం వచ్చాం, మీ చట్టాలు వర్తింపజేయాలి, నాకు షోకాజ్ నోటీసులివ్వాలి, ఆహారం ఇవ్వాలి, ఆశ్రయం ఇవ్వాలి, మా పిల్లలకు ఇదివ్వాలి, అదివ్వాలి అంటూ డిమాండ్లు చేస్తారు. ఈ రకంగా చట్టాన్ని పొడిగించుకుంటూ మేం వెళ్లాలా?" అని చీఫ్ జస్టిస్ మౌఖికంగా వ్యాఖ్యానించారు. దానిపై పిటిషనర్ తరపు న్యాయవాది మాట్లాడుతూ తాము తరలింపు ప్రక్రియను మొత్తంగా వ్యతిరేకించడం లేదని, ఏదైనా చట్ట ప్రకారం వుండాలని కోరుతున్నామని అన్నారు. పోలీసు కస్టడీలో వున్నారని తెలుసు, తర్వాత వారు అదృశ్యమైతే కస్టడీలో గల్లంతైనట్లు భావించాల్సి వస్తుందన్నారు. అసలు ఆ వ్యక్తులకు శరణార్థి హోదాను కేంద్రం ఇచ్చిందా అని బెంచ్ ప్రశ్నించింది. శరణార్థి అంటే దానికొక చటబద్ధమైన నిర్వచనం వుంది కదా ఆ ప్రకారం భారత ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులేవి అని చీఫ్ జస్టిస్ ప్రశ్నించారు.

ఆ విద్యాభిలాషులు.. టిడిపి కార్యకర్తలేనా..?

(మొదటిపేజీ తరువాయి)

ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. తల్లిదండ్రులు, ప్రజా ప్రతినిధులతో పాటు విద్యాభిలాషులు పెద్దయెత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఈ ప్రకటనలో పిలుపునివ్వడం గమనార్హం. టిడిపి నాయకులు, కార్యకర్తలను మెగా పిటిఎంలలో చొప్పించేందుకు విద్యాభిలాషులు పేరును తీసుకొచ్చినట్లు కనపడుతోందని విద్యావేత్తలు చెబుతున్నారు. విద్యా సంస్థల్లోకి విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడే విద్యార్థి సంఘాలను కూడా అనుమతించని ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి ఏకంగా తన పార్టీకి చెందిన వారిని పాల్గొనేలా చేసేందుకు వేసిన ఎత్తుగడగా అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి పౌరుడినీ అనుమానంలోకి నెడుతున్నారు!

- సామూహికంగా సవరణలు ఎలా చేపడతారు?
- వలసలు ప్రాతిపదిక కారాదు
- పౌరసత్వాన్ని పరిశీలించే అధికారాన్ని ఎలా తీసుకుంటారు
- ఎస్‌ఐఆర్‌పై పలు పిటిషన్లను విచారించిన సుప్రీం
- 4కి వాయిదా



న్యూఢిల్లీ : ఎన్నికల కమిషన్ ఇటీవల చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లను సుప్రీంకోర్టు మంగళవారం విచారించింది. పిటిషనర్ల తరపున న్యాయవాది ఎ.ఎం.సింఘ్వి వాదనలు వినిపిస్తూ, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21(3) కింద నిర్వహించే ప్రత్యేక సవరణలు ఎవరికి వారికి వ్యక్తిగతంగా వుండాలి తప్పితే సామూహికంగా చేపట్టరాదని అన్నారు. వలస అనేది మానవుల లక్షణమని, దాన్ని ఎస్‌ఐఆర్‌కు ఒక ప్రాతిపదికగా వాడుకోరాదని అన్నారు. పైగా ఎస్‌ఐఆర్ ప్రక్రియ పౌరులను 'ఊహాజనిత పౌరసత్వ జాబితా'లో వుంచుతోందని ఆయన వ్యాఖ్యానించారు. దీనికింద ఈ దేశంలో నివసించే ప్రతి పౌరుడూ తాను నిజంగా భారతీయ పౌరుడినే అని నిరూపించుకోవాల్సి వుంటుందని అన్నారు. ముందస్తు నోటీసులేవీ పంపకుండానే ఒక పౌరుడిని 'గెస్ట్ లిస్ట్'లో పెడుతోందని అన్నారు. ఎన్నికల కమిషన్ తనకు తానుగా పౌరసత్వాన్ని పరిశీలించే అధికారాన్ని తీసుకుందని విమర్శించారు. జస్టిస్ బాగ్చి జోక్యం చేసుకుంటూ, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 25 కింద పేర్కొన్న పద్ధతిలో ఎస్‌ఐఆర్‌ను కచ్చితంగా నిర్వహించాలని ఏమైనా చట్టబద్ధమైన నిబంధనలు వున్నాయా? లేదా? మన అవసరాలు లేదా కారణాల ప్రాతిపదికన ఎస్‌ఐఆర్ నిర్వహణకు ఇసి చర్యలు తీసుకోవచ్చా? అని ప్రశ్నించారు. వేగంగా పెరిగిపోతున్న పట్టణీకరణ, తరచుగా వలసలు వెళ్లిపోవడం వల్లే ఎస్‌ఐఆర్ నిర్వహించాల్సిన పరిస్థితులు వచ్చాయని ఇసి చెబుతోందని, ఇవన్నీ సర్వసాధారణమైనవని అన్నారు. వలసలనేవి మానవ జీవితంలో అత్యంత సాధారణమైన అంశమన్నారు. పైగా భారతదేశంలో ఎక్కడ గ్రామీణ ప్రాంతం ముగుస్తుందో, ఎక్కడ పట్టణ ప్రాంతం ప్రారంభమవుతుందో తెలియదని అన్నారు. ఇటువంటి అంశాన్ని ఎస్‌ఐఆర్‌కు ప్రాతిపదికగా చేయలేమన్నారు.

నియంతగా మారుతున్న ఇసి : ప్రశాంత్‌భూషణ్

అనంతరం న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తన వాదనలు వినిపిస్తూ, ఓటర్ల జాబితాలను మెషిన్ రీడబుల్ ఫార్మాట్‌లో ఎందుకు వుంచరాదని, పారదర్శకతను ఎందుకు ఎంచుకోవడం లేదని ప్రశ్నించారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియ పూర్తిగా పౌరసత్వ పరీక్షగా వుందని వ్యాఖ్యానించారు. 1950లో తొలి ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ పరిశుద్ధమైన దేశం నుండి ఆ ఎన్నిక నిర్వహించింది. కానీ, ఇప్పుడు గతంలో ఎన్నడూ సిద్ధం చేయని రీతిలో ఓటర్ల జాబితాను ఎస్‌ఐఆర్ పేరిట కొత్తగా రూపొందిస్తోంది. ఎందుకు ఇంత హడావిడి? 30మంది బిఎల్‌ఓలు తమ ప్రాణాలను తీసుకునే పరిస్థితిని ఎందుకు సృష్టించారు?" అని ప్రశాంత్ భూషణ్ ప్రశ్నించారు. ఎన్యూమరేషన్ ఫారాలు భర్తీ చేయడానికి చిన్న చిన్న విండోలు, పైగా హడావిడిగా ఎస్‌ఐఆర్, మెషిన్ రీడబుల్ ఫార్మాట్‌ల్లో లేని ఓటర్ల జాబితాలు ....ఇసికి మీరు గనక అధికారాలు ఇస్తే, కచ్చితంగా నిరంకుశంగా వ్యవహరిస్తుందని ఆయన వాదించారు. ఈ దశలో చీఫ్ జస్టిస్ జోక్యం చేసుకుని ప్రశాంత్ భూషణ్ తన వాదనలకే పరిమితం కావాలని సూచించారు. పలు పిటిషన్లపై వాదనలు విన్న అనంతరం ఈ నెల 4వ తేదీకి తదుపరి విచారణను బెంచ్ వాయిదా వేసింది.

మూకుమ్మడి ఓట్ల తొలగింపు ఆరోపణలు తోసిపుచ్చిన ఇసి

తమిళనాడులో 95.65 శాతం ఓటర్లు, పశ్చిమ బెంగాల్‌లో 99.77శాతం ఓటర్లు ఇప్పటికే తమ ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తి చేసి అందజేశారని ఎన్నికల కమిషన్ సుప్రీం కోర్టులో వేర్వేరుగా అఫిడవిట్లు దాఖలు చేసింది. మూకుమ్మడిగా ఓట్ల తొలగింపు ఆరోపణలు తోసిపుచ్చింది. ఇప్పటివకే 58.7శాతం ఎన్యూమరేషన్ ఫారాలు తమకు అందాయని, వాటిని డిజిటలైజ్ చేశామని తెలిపింది. పశ్చిమ బెంగాల్‌లో 30శాతం ఓటర్లను మినహాయించారని చేసిన వాదనలను ఇసి తిరస్కరించింది. బెంగాల్‌లో 70.14 శాతం ఫారాలు అందాయని తెలిపింది.

అనుమానంతో దేశమే కాకుండా చేస్తారా ?

"ఎస్‌ఐఆర్ ఒక వారసత్వ రికార్డును సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. ఇది తరతరాలుగా వ్యవస్థాగతంగా ఓటు హక్కును కోల్పోయేందుకు దారి తీస్తుంది." అని న్యాయవాది వృందా గ్రోవర్ పేర్కొన్నారు. "ఒక అనుమానం తలెత్తడమనేది ఓటు హక్కును నిరాకరించడమే కాకుండా, ఆ వ్యక్తికి తనదంటూ ఒక దేశం కూడా లేకుండా చేస్తుందా? ఒక అనుమానం, సందేహమే వారికి వారు వుండే దేశాన్ని లేకుండా చేస్తుంటే ఇక ఈ అధికారానికి ప్రాతిపదిక ఏమిటి? " అని ఆమె ప్రశ్నించారు. "ఎస్‌ఐఆర్ రాజ్యాంగ దార్శనికతను అసహనానికి గురి చేస్తోంది." అని చెప్పారు.

అణుయుద్ధం అనివార్యం

- రాబోయే పదేళ్లలో వస్తుందంటూ మస్క్ వ్యాఖ్యలు
- నెట్టింట వైరల్ అయిన మస్క్ పోస్ట్



న్యూయార్క్ : రానున్న పదేళ్ల కాలంలో అణుయుద్ధం అనివార్యమని టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎప్పుడూ ఎక్స్‌లో చురుగ్గా ఉండే మస్క్ త్వరలో ప్రపంచం యుద్ధ సంఘర్షణలో చిక్కుకుంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. హంటర్ యాష్ అనే ఎక్స్ యూజర్ తన ఖాతాలో ' శక్తివంతమైన దేశాలు అణ్వాయుధాలు కలిగి ఉండటంతో వాటి మధ్య యుద్ధాలు ఉండవని భావిస్తున్నాయి. ఇప్పుడున్న ప్రభుత్వాలు కూడా దాన్ని పిచ్చిగా నమ్ముతున్నాయి. కాబట్టి ఆ దేశాలపై బయటి శక్తుల ఒత్తిడి ఉండదు ' అంటూ పోస్ట్ పెట్టాడు. దీనిపై మస్క్ స్పందిస్తూ ' అణుయుద్ధం అనివార్యం. 5 సంవత్సరాలు లేదా గరిష్టంగా 10 సంవత్సరాలు ' అంటూ రాసుకొచ్చారు. అయితే నెటిజన్లు మస్క్ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్నారు. అది నిజమైందా లేక ఫేక్ పోస్టా అని ఫ్యాక్ట్ చెక్ చేశారు. ఎక్కువ మంది గ్రోక్‌ని అడగ్గా అది యూరప్ సంక్షోభం, ప్రపంచ పరిణామాలపై గతంలో మస్క్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించింది..కొంత మంది నెటిజన్లు ఇది గుర్తింపు రాజకీయాల కోసమని అంటే మరికొంత మంది యూఎస్, చైనా మధ్య జరుగుతున్న సంఘర్షణలు, రష్యా- ఉక్రెయిన్ వార్ నేపథ్యంలో మరో ప్రపంచ యుద్ధం వస్తుందా ? అని చర్చ చేయడం గమనార్హం.


811 మందికి ఒక్కడే వైద్యుడు

- వైద్యులు, జనాభా నిష్పత్తి 1:811
- రాజ్యసభలో వెల్లడించిన కేంద్ర మంత్రి నడ్డా

న్యూఢిల్లీ : భారతదేశంలో వైద్యులు, జనాభానిష్పత్తి 1:811 అని కేంద్రం మంగళవారం జరిగిన రాజ్యసభలో తెలిపింది. ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర మంత్రి జెపి నడ్డా తెలియజేశారు. అల్లోపతి, ఆయుష్ (ఆయుర్వేదం, యోగా, ప్రకృతి వైద్యం,యునాని, సిద్ధ, హోమియోపతి)ల్లో 80శాతం మంది రిజిస్టర్ వైద్యులు అందుబాటులో ఉన్నారని, దేశంలో వైద్యులు, జనాభా నిష్పత్తి 1:811గా ఉందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. దేశంలో మొత్తం 13,88,185 మంది రిజిస్టర్ అల్లోపతి వైద్యులు, ఆయుష్ వైద్య విధానంలో 7,51,768 మంది రిజిస్టర్డ్ ప్రాక్టిషనర్లు ఉన్నారని కేంద్ర ఆరోగ్యమంత్రి జె.పి.నడ్డా రాజ్యసభలో లిఖితపూర్వకంగా తెలిపారు. దేశంలో మెడికల్ కాలేజీలు, అండర్ గ్రాడ్యుయేట్ (యుజి), పిజి వైద్య సీట్లు గణనీయంగా పెరిగాయన్నారు. 2014 నుండి మెడికల్ కాలేజీల సంఖ్య 387 నుండి 818కి, యుజి సీట్లు 51,348 నుండి 1,28,875కి, పిజిసీట్లు 31,185 నుండి 82,059కి పెరిగాయని ఆయన వెల్లడించారు.

ఢిల్లీలో అమానుషం

- వివాహ ఊరేగింపు చూడ్డానికి వచ్చిన బాలుడి కాల్చివేత
- సిఐఎస్‌ఎఫ్ అధికారి ఘాతుకం



సాహిల్(ఫైల్)



మదన్ గోపాల్ తివారి

న్యూఢిల్లీ : బిజెపి పాలిత తూర్పు ఢిల్లీలోని షాహ్‌దారాన్‌లో అమానుష ఘటన జరిగింది. ఇక్కడ జరుగుతున్న ఒక వివాహ ఊరేగింపును చూడ్డానికి వచ్చిన 14 ఏళ్ల బాలుడ్ని కాల్చిచంపారు. హంతకుడు ఒక సిఐఎస్‌ఎఫ్ అధికారి కావడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షాహ్‌దారాన్‌కు చెందిన 14 ఏళ్ల సాహిల్ తన తండ్రి పక్షవాతానికి గురవడంతో స్థానికంగా ఒక కిరాణా దుకాణంలో పని చేస్తున్నాడు. రోజుకు 11 గంటల పాటు పనిచేస్తే.. నెలకు రూ 6 వేలు ఇస్తుంటారు. శనివారం పని ముగించుకుని ఇంటికి వెళుతుండగా స్థానిక కమ్యూనిటీ సెంటర్‌కు ఒక వివాహ ఊరేగింపు వెళ్తున్నట్లు గమనించాడు. ఆ ఊరేగింపు వెనకాల తన నివాస ప్రాంతానికి చెందిన వ్యక్తులు, తన స్నేహితులు కూడా వెళుతుండటం చూసి సాహిల్ కూడా వారితో చేరాడు. ఊరేగింపు కొద్దిసేపట్లో పెళ్లి మండపానికి చేరుతుందనగా.. కొందరు అతిథులు కరెన్సీ నోట్లను గాల్లోకి విసరడం ప్రారంభించారు. ఈ నోట్లు ఏరుకోవడానికి సాహిల్, అతని స్నేహితులు ప్రయత్నించారు. పెళ్లి బృందంలోని వారు వీరిపై దాడికి దిగారు. సాహిల్ స్నేహితులు తప్పించుకుని పారిపోగా, సాహిల్ వారికి దొరికిపోయాడు. పెళ్లి బృందంలోని కొంత మంది సాహిల్‌ను చెంపదెబ్బలు కొట్టారు. వరుడి తండ్రి బంధువైన కాన్పూర్‌లో పనిచేస్తున్న సిఐఎస్‌ఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మదన్ గోపాల్ తివారి మరింత కోపంతో ఊగిపోతూ.. సాహిల్‌పై తన వద్ద వున్న తుపాకీతో కాల్పులు జరిపాడు. సాహిల్ అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే సాహిల్ మరణించినట్లు వైద్యులు చెప్పారు. తమ కుటుంబాన్ని పోషించాలని అనుకోవడమే సాహిల్ చేసిన నేరమని అతని తల్లి నిషా విలపించారు. సాహిల్ తండ్రికి కొన్ని నెలల క్రితం పక్షవాతం వచ్చిందని, దీంతో కుటుంబాన్ని పోషించడం కోసం చదువు మానివేసి షాహిల్ పనికి వెళుతున్నాడని తెలిపింది. సాహిల్‌కు ముగ్గురు సోదరులు, ముగ్గురు అక్కచెల్లెల్లు ఉన్నారు. వారందరికీ మంచి జీవితాన్ని ఇస్తానని సాహిల్ చెప్పేవాడని నిషా తెలిపారు. సిఐఎస్‌ఎఫ్ అధికారిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు.



విజయవాడ లెనిన్ సెంటర్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా నాయకులు

పెంచలయ్య హంతకులను శిక్షించాలి

- విజయవాడలో గంజాయి ముఠా దిష్టిబొమ్మ దహనానికి యత్నం
- పోలీసులకు, సిపిఎం శ్రేణులకు మధ్య తోపులాట

ప్రజాశక్తి - యంత్రాంగం

సిపిఎం కార్యకర్త, డివైఎఫ్‌ఐ, ప్రజానాట్యమండలి నాయకులు పెంచలయ్య హత్యను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో నిరసన తెలిపారు. సిపిఎం, సిఐటియు, కెవిపిఎస్, పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. డ్రగ్స్, గంజాయి మత్తుపదార్థాలను అరికట్టాలని, పెంచలయ్య హంతకులను కఠినంగా శిక్షించాలి పలువురు నాయకులు డిమాండ్ చేశారు.

విజయవాడ బీసెంట్ రోడ్డు మహంతి మార్కెట్ వద్ద గంజాయి ముఠా దిష్టిబొమ్మ తగలబెట్టే క్రమంలో సిపిఎం కార్యకర్తలను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఆందోళనకారులకు, పోలీసులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ క్రమంలో సిపిఎం నాయకులు సోమేశ్వరరావు, పీరుసాహేబ్‌లు కిందపడిపోయారు. పోలీసులు వలయంగా ఏర్పడి దిష్టిబొమ్మ దగ్ధం ప్రక్రియను అడ్డుకున్నారు. పెంచలయ్య మృతికి కారుకులైన వారందరినీ తక్షణమే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని, డ్రగ్స్, గంజాయి మత్తుపదార్థాలను ప్రభుత్వం అరికట్టాలంటూ సిపిఎం నాయకులు, కార్యకర్తలు చేసిన నినాదాలు హోరెత్తాయి. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి, మద్యం, మత్తు పదార్థాల అక్రమ అమ్మకాల మాఫియాను అరికట్టేందుకు మరింత స్పష్టమైన, సమగ్రమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గంజాయి, మత్తుమందులను అడ్డుకుని నెల్లూరులో ప్రజలకు అండగా నిలిచిన కె.పెంచలయ్యను చంపినవారిని, వారికి అండదండలిచ్చి ప్రోత్సహించిన వారందరినీ అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, సిపిఎం కార్పొరేటర్ బోయ సత్యబాబు, ఇద్వా జిల్లా కార్యదర్శి కె.సరోజ తదితరులు పాల్గొన్నారు. అనకాపల్లి జిల్లా పరవాడ కాలనీలో ఐద్వా ఆధ్వర్యాన మహిళలు నిరసన తెలిపారు. నర్సీపట్నంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. తిరుపతి జిల్లా గూడూరులోని టవర్ క్లాక్ సెంటర్‌లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. విజయనగరంలోని రామకృష్ణానగర్‌లో నిరసన తెలిపారు.

పెంచలయ్య కేసులో నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ విజయవాడ లెనిన్ సెంటరులో మంగళవారం సాయంత్రం ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా రాష్ట్ర కమిటీల ఆధ్వర్యాన కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలోని కాలేజీ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలంలోని అద్దేపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో పెంచలయ్యకు నివాళులర్పించారు. ప్రకాశం జిల్లా, నాగులుప్పలపాడు మండలం, ఉప్పుగుండూరులో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు.

ఎస్‌ఐఆర్.. ఓట్లు చోరీ ఆపాలి

(మొదటిపేజీ తరువాయి)

పట్టుబట్టారు. వెల్‌లోకి దూసుకెళ్లి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ఎస్‌ఐఆర్ ఒక ముఖ్యమైన అంశమని, దానిపై వెంటనే చర్చించాలని డిమాండ్ చేశారు. సభ సజావుగా సాగే పరిస్థితి లేకపోవడంతో చైర్మన్ సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ఎన్నికల సంస్కరణలు, ఇతర అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కిరణ్ రిజిజు అన్నారు. రాజ్యసభ రూల్ 267 ప్రకారం ఎస్‌ఐఆర్‌పై తక్షణ చర్చ చేపట్టవచ్చుని మల్లికార్జున ఖర్గే, సిపిఎం రాజ్యసభ నాయకుడు జాన్ బ్రిట్టాస్, టిఎంసి ఎంపి డెరిక్ ఓ'బ్రియన్, డిఎంకె ఎంపి తిరుచ్చి శివ డిమాండ్ చేశారు. రాజ్యసభ ఛైర్మన్ అంగీకరించకపోవడంతో ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. అనంతరం సభ మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (రెండో సవరణ) బిల్లు-2025 చర్చించి ఆమోదం తెలిపింది. అనంతరం సభ్యులు అత్యవసర ప్రాముఖ్యత కలిగిన అంశాలను లేవనెత్తారు. ఆ తరువాత సభను బుధవారానికి వాయిదా వేశారు.

పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్షాల ఆందోళన

ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)'కు వ్యతిరేకంగా మంగళవారం ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. పార్లమెంట్ సమావేశాల ప్రారంభానికి ముందు మకర ద్వారం ఎదుట ప్రతిపక్ష నేతలంతా 'ఎస్‌ఐఆర్'కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, సిపిఎం ఎంపిలు కె.రాధాకృష్ణన్, జాన్ బ్రిట్టాస్, డిఎంకెకు చెందిన కనిమొళి, టిఆర్ బాలు, ఇతర పార్టీల కీలక ఎంపిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు, పోస్టర్లు పట్టుకొని నిరసన తెలిపారు. 'స్టాప్ ఎస్‌ఐఆర్-స్టాప్ ఓటు చోరీ' అని రాసి ఉన్న భారీ బ్యానర్‌తో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తమ నిరసన కొనసాగిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అన్నారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు.

కేరళ వాదనల్లో న్యాయం ఉంది

(మొదటిపేజీ తరువాయి)

23,612 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. పని ఒత్తిడి భరించలేక ఇటీవల బూత్ లెవల్ అధికారులు కొంతమంది మరణిస్తుండగా, మరికొంతమంది బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారని వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ గణన దశ గడువును ఈ నెల 4 నుంచి 11కి పొడిగించింది. ఈ నేపథ్యంలో ఎస్‌ఐఆర్ రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ కేరళ ప్రభుత్వం, ప్రాంతీయ పార్టీలు, తమిళనాడు పాలక పార్టీ, పశ్చిమ బెంగాల్ నేతలు ఇలా అందరూ వేర్వేరుగా సుప్రీం కోర్టులో సవాలు చేశారు.

కేరళ సమస్య తక్షణమే విచారించాల్సిన అవసరం వుంది. ఒకపక్క ఎస్‌ఐఆర్, మరోపక్క స్థానిక సంస్థల ఎన్నికలు రెండూ ఒకేసారి జరగడం వల్ల పాలనాపరమైన ప్రతిష్టంభన దిశగా రాష్ట్రప్రభుత్వం పయనిస్తోందని కేరళ సర్కార్ పేర్కొంటోంది. రోజువారీ ప్రభుత్వ కార్యకలాపాలు సాగించడానికి సిబ్బంది ఎవరూ అక్కడ వుండని పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితుల్లో ఎస్‌ఐఆర్‌ను తాత్కాలికంగా వాయిదా వేయాల్సిందిగా ఇసిని కోరేందుకు కోర్టు జోక్యం చేసుకోవాలని రాష్ట్రం కోరింది. స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ఈ నెల 9, 11 తేదీలు. ఓట్ల లెక్కింపు 13వ తేదీ, ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడానికి చివరి తేదీ ఈ నెల 18 అని కేరళ ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న న్యాయవాది సి.కె.శశి చెప్పారు.

స్థానిక సంస్థల ఎన్నికల విధుల నిమిత్తం ప్రభుత్వ, క్వాసి ప్రభుత్వ సర్వీసులకు చెందిన 1,76,000మంది సిబ్బందిని మోహరించాల్సి వుంది. పైన మరో 68వేల మంది పోలీసులు, ఇతర భద్రతా సిబ్బంది కావాల్సి వుంటుంది. మరొకవైపు ఎన్నికల సంబంధిత కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు శిక్షణ పొందిన సిబ్బంది పెద్ద సంఖ్యలో 22,668మంది అవసరపడతారని పేర్కొంది. ఎస్‌ఐఆర్, స్థానిక సంస్థల ఎన్నికలకు అడ్డం కాదని భారత ఎన్నికల కమిషన్, కేరళ రాష్ట్ర ఎన్నికల కమిషన్ తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు.

గంజాయి ఖైదీలతో కిక్కిరిసిన కేంద్ర కారాగారం

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహారాలు, చిన్న పిల్లలపై అత్యాచారాలు వంటివి గంజాయి, డ్రగ్స్ మత్తులోనే జరుగుతున్నాయన్న విషయం పోలీసుల దర్యాప్తుల్లో రూఢి అయింది. సెంట్రల్ జైల్లో ఎక్కువ మంది ఈ ఖైదీలే ఉండడంతో అక్కడ కూడా గంజాయి సాగు చేసిన ఉదంతం ఇటీవల వెలుగులోకి వచ్చింది. విశాఖ కెజిహెచ్ సమీపాన కూడా గంజాయి సాగు గతంలో బట్టబయలైంది. వార్డు బాయ్‌లు, కొంతమంది రోగులు, వారి బంధువులు వినియోగించినట్టు వెల్లడైంది. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు గంజాయి వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ఇచ్చిన హామీ నీటిమీద రాతగానే మిగిలింది. మూలాల్లోకి వెళ్లాలని, తయారీదారుల, సరఫరాదారుల ఆటకట్టించాలని ప్రజలు కోరుతున్నారు

2, 3 రోజుల్లో టెట్ హాల్ టిక్కెట్లు

- కన్వీనర్ ఎమ్వి కృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు రెండు, మూడు రోజుల్లో హాల్ టిక్కెట్లు అందుబాటులోకి వస్తాయని కన్వీనర్ ఎమ్వి కృష్ణారెడ్డి వెల్లడించారు. ఎంవ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్సైట్ నుంచి అభ్యర్థులు డౌన్లోడ్ చేసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 నుంచి ప్రతిరోజూ టెట్ పరీక్ష ఉంటుందన్నారు. రోజుకు రెండు పూటలా పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. తొలి సెషన్ ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తామని వెల్లడించారు. అక్టోబరు 24 నుంచి నవంబరు 23 వరకు దరఖాస్తులు స్వీకరించగా, 2,41,509 మంది అభ్యర్థులు 2,71,692 దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు.

పవన్ మాటలను వక్రీకరించొద్దు : జనసేన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇరు రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొన్న క్రమంలో డిప్యూటీ సిఎం పవన్కల్యాణ్ రైతులతో ముచ్చటించిన మాటలను కొందరు వక్రీకరిస్తున్నారని జనసేన పార్టీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. రాజోలు నియోజకవర్గ పర్యటనలో రైతులతో పవన్కల్యాణ్ ముచ్చటిస్తూ చెప్పిన మాటలను కొందరు వక్రీకరిస్తున్నారని పేర్కొంది. పవన్ వ్యాఖ్యలపై తెలంగాణ ప్రజా ప్రతినిధులు, మంత్రులు స్పందిస్తుండటంతో ఈ వివాదానికి ఫుల్స్టాప్ పెట్టడంలో భాగంగా ఈ మేరకు ఆ పార్టీ ప్రకటన విడుదల చేసినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

పింఛను సొమ్ముతో ఇంజనీరింగ్ అసిస్టెంట్ పరారీ

ప్రజాశక్తి-దగదర్తి

నెల్లూరు జిల్లా దగదర్తిలో పింఛను సొమ్ముతో ఇంజనీరింగ్ అసిస్టెంట్ పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు...దగదర్తి మండల పరిధిలోని చెన్నూరు సచివాలయంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్ జి. శ్రీనివాసులు ప్రతినెల మాదిరి పింఛను సొమ్ము కోసం బ్యాంకుకు వెళ్లి డబ్బులు తీసుకున్నారు. చెన్నూరు పంచాయతీలోని సిద్ధారెడ్డిపాలెంలో సుమారు 75 మందికి పింఛన్లు పంపిణీ చేయాలి. అయితే సాయంత్రమైనా రాకపోవడంతో పింఛనుదారులు శ్రీనివాసులుకు ఫోన్ చేశారు. ఆయన ఫోన్ స్విచ్ఆఫ్ రావడంతో ఆందోళన చెందిన పింఛనుదారులు వెంటనే ఎంపిడిఓకు సమాచారమిచ్చారు. ఎంపిడిఒ పోలీసులకు సమాచారమిచ్చారు. మొత్తం రూ. రూ.3,22,500తో పరారైనట్టు పోలీసులు భావిస్తున్నారు.

అక్రమ తవ్వకాలు ఆర్టిజిఎస్తో గుర్తించండి

- ఉత్తరాంధ్ర కేంద్రగా మెటల్ పరిశ్రమల క్లస్టర్
- సమీక్షా సమావేశంలో సిఎం చంద్రబాబు



గనుల శాఖ, ఆర్టిజిఎస్ ఉన్నతాదికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గనుల అక్రమ తవ్వకాలను ఆర్టిజిఎస్ వ్యవస్థతో గుర్తించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. లీజు పొందిన ప్రాంతంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో తవ్వకాలు జరిపితే గుర్తించేందుకు డ్రోన్, శాటిలైట్ చిత్రాలను వినియోగించుకోవాలని సూచించారు. సచివాలయంలో గనుల శాఖపై సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గనుల ద్వారా వచ్చే ఆదాయం విషయంలో ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలను అంచనా వేసుకోవాలన్నారు. అధిక ఆదాయాన్ని పొందుతున్న రాష్ట్రాల్లో ఒడిశా మొదటి స్థానంలో ఉందని, ఆ రాష్ట్రంలో ఎలాంటి పద్ధతులను అనుసరిస్తున్నారో గమనించి, వాటిని రాష్ట్రంలో అమలు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. గనుల నుంచి వచ్చే వివిధ ఖనిజాలకు సంబంధించి ముడి సరుకును ఇతర దేశాలకు ఎగుమతి చేయడంతోపాటు, ఆ ఖనిజాలకు విలువ జోడించడంతో దేశీయంగా వాటిని వినియోగించుకుని, మరింత ఆదాయం వచ్చేలా చేయాలన్నారు. ఉత్తరాంధ్ర కేంద్రంగా మెటల్కు సంబంధించిన క్లస్టర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విశాఖలో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలకు అవసరమైన మెటీరియల్ సరఫరా జరిగేలా చూడాలన్నారు. రాష్ట్రంలో లభిస్తున్న లైమ్ స్టోన్, బీచ్ శాండ్, ఐరన్ ఓర్, మాంగనీస్, క్వార్జ్, సిలికా శాండ్, క్లేస్, గ్రానైట్ సహా వివిధ ఖనిజాలు ఏపీ ఉత్పత్తులకు ముడి సరుకుగా ఉపయోగపడతాయనే అంశాన్ని విశ్లేషించాలని సూచించారు. ఆ మేరకు ఏపి ఖనిజాలను నేరుగా వినియోగించవచ్చు, ఏపి ఖనిజాలకు విలువ జోడించాలనే విషయాలను గుర్తించాలన్నారు. సిమెంట్, ఫ్యాక్టరీలు ఇప్పటికే లైమ్ స్టోన్ ఖనిజాన్ని తీసుకుంటున్నాయని, అదేవిధంగా ఐరన్ ఓర్ స్థానికంగా స్టీల్ పరిశ్రమలు వినియోగించుకుంటున్నాయన్నారు. బీచ్ శాండ్ ద్వారా టైటానియం ఉత్పత్తులు, మాంగనీస్ ఖనిజం ద్వారా ఫెర్రో ఎల్లాయిస్ ఉత్పత్తులు, క్వార్జ్, సిలికా శాండ్ ద్వారా సోలార్ ప్యానెళ్లు, సోలార్ పివి సెల్స్, గ్లాస్ ఉత్పత్తి, గ్రానైట్ ద్వారా కటింగ్, పాలిషింగ్ పరిశ్రమలు వస్తాయన్నారు. విలువ జోడించే పరిశ్రమలను ప్రోత్సహించే దిశగా గనుల శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైనతే ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకంలో, ఏపి కంపెనీలకు వర్తిస్తుందో చూసి ఆయా కంపెనీలకు ఇన్సెంటీవ్ ఇచ్చేలా కేంద్రంతో సంప్రదింపులు జరుపుదామన్నారు. అప్పుడే రాష్ట్రానికి మరింత ఆదాయం పెరుగుతుందని, వీటితోపాటు ఫ్యూచరిస్టిక్ మినరల్స్పై దృష్టి సారించాలని, నిపుణుల సహాయాన్ని తీసుకోవాలని సూచించారు. రాజధాని నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, గ్రావెల్, మెటల్ వంటి వాటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేయాలని ఆదేశించారు. నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో అభ్యమవుతాయన్నారు. సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందుల తలెత్తకుండా చూడాలన్నారు.

సింగిల్ విండో విధానంలో నేరుగా జిల్లా కలెక్టర్లతో మాట్లాడి.. మెటీరిల్ను సిఆర్డీఎకు పంపాలని ఆదేశించారు. మధ్యలో ఎవరైనా ఇబ్బందులు పెట్టే ప్రయత్నం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక సరఫరా విషయంలో సంతృప్త స్థాయి మరింత పెరగాలని, రాష్ట్ర సరిహద్దుల్లో చెక్పోస్టులు, సిసి కెమెరాలతో నిత్యం పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర, గనుల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ మాఫియాను అరికట్టాలి

- పెంచలయ్య హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి
- సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నెల్లూరులో డ్రగ్స్ మాఫియాకు వ్యతిరేకంగా ప్రజల్ని చైతన్యవంతం చేసి, పోరాడుతున్న సిపిఎం నాయకుడు, ప్రజానాట్య మండలి కళాకారుడు కె పెంచలయ్యను డ్రగ్స్ మాఫియా అతి దారుణంగా హత్య చేయడాన్ని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన డ్రగ్స్ మాఫియా డాన్ కామాక్షిని, ఆమె భర్తను, వారికి సహాయపడిన అనుయాయులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. నెల్లూరు జిల్లా బంద్కు, రాష్ట్రవ్యాప్త నిరసనలకు సిపిఎం ఆంధ్రప్రదేశ్ కమిటీ ఇచ్చిన పిలుపునకు సంఘీభావం తెలిపింది. ఈ మేరకు సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్వెస్లీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'డ్రగ్స్ మాఫియాని అరికట్టడంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పూర్తిగా విఫలమవుతున్నాయి. ప్రభుత్వాలు, అధికారులు, రాజకీయ నాయకుల అండదండలతో ఈ రాష్ట్రాల్లోని పట్టణాలు, గ్రామాల వరకు విచ్చలవిడిగా డ్రగ్స్ సరఫరా జరుగుతోంది. డ్రగ్స్ మత్తులో కొందరు యువకులు అరాచకాలకు పాల్పడుతున్నారు. తెలంగాణలో డ్రగ్స్ను అరికట్టడంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి కఠినంగా మాట్లాడుతున్నప్పటికీ, ఆచరణలో డ్రగ్స్ను పూర్తిగా అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు సరిపోవట్లేదు. ప్రజలు, యువతను ఈ డ్రగ్స్కు దూరమయ్యే పద్ధతుల్లో చైతన్యం కల్పించాలి' అని పేర్కొన్నారు. ప్రభుత్వాలు డ్రగ్స్ను అరికట్టేందుకు చర్యలు తీసుకోకపోతే, ఉమ్మడి రాష్ట్రాల్లో తీవ్రమైన అరాచకాలు, హత్యలు జరిగే పరిస్థితులు నెలకొనే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల సిఎంలు ఇప్పటికైనా డ్రగ్స్ మాఫియాను ఉక్కుపాదంతో అణచేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి ఉద్భవ్ వేడుకలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అడవి బిడ్డల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఉద్భవ్ - 2025ను నిర్వహిస్తున్నట్లు గిరిజన సంక్షేమశాఖ తెలిపింది. గుంటూరు జిల్లా, వడ్డేశ్వరంలో ఉన్న కెఎల్ యూనివర్సిటీలో 3వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని కేంద్ర గిరిజన వ్యవహారాలశాఖ మంత్రి జువల్ ఒరమ్ ప్రారంభించనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్కల్యాణ్, మంత్రులు, తదితరులు హాజరుకానున్నట్లు తెలిపింది. జాతీయ స్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఇఎంఆర్ఎస్) సాంస్కృతిక ఉత్సవాలు ఆంధ్రప్రదేశ్లో జరగడం ఇదే తొలిసారని పేర్కొంది.



విశాఖలో లోకో పైలట్ల దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

రైల్వే లోకో సిబ్బంది 48 గంటల నిరసన దీక్ష

- రైల్వేను ప్రయివేటీకరించేందుకు యత్నం : నర్సింగరావు

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రైల్వే లోకో సిబ్బంది నిరసన దీక్ష చేపట్టారు. ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 48 గంటల దీక్షలను రాష్ట్రంలోని డిఆర్ఎం కార్యాలయాల వద్ద మంగళవారం చేపట్టారు. లోకోపైలెట్లకు, అసిస్టెంట్ లోకోపైలెట్లకు నాలుగు నైట్డ్యూటీలు బదులు రెండు నైట్ డ్యూటీలు వేయాలని, ఇన్కం ట్యాక్స్లో 70 శాతం మైలేజ్పై రిడక్షన్ ఇవ్వాలని, మహిళా లోకో పైలెట్లకు అసిస్టెంట్లకు రన్నింగ్ రూమ్లో తగిన సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

విశాఖలోని దొండపర్తి డిఆర్ఎం కార్యాలయం వద్ద దీక్షలను సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కెఎస్వి.కుమార్ ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగంలో లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న రైల్వేలను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. రైల్వేలో లక్ష మందికిపైగా ఉద్యోగ విరమణ పొందినప్పటికీ ఆ ఖాళీలను ఏళ్ల తరబడి భర్తీ చేయడం లేదని తెలిపారు.

ఎఐఎల్ఆర్ఎస్ఎ వాల్తేరు డివిజనల్ కార్యదర్శి ఎ.భోలానాథ్ మాట్లాడుతూ... 2024 జనవరి ఒకటి నుంచి టిఎ రేట్ల పెంపు మాదిరిగా కిలోమీటర్స్ అలవెన్స్లో 25 శాతం పెంపుదల చేయాలని, కిలోమీటర్స్ అలవెన్స్లో 70 శాతాన్ని ఆదాయపు పన్ను నుండి మినహాయించాలని, ఎఎల్పి నియామక ప్రక్రియ (ఆర్ఆర్బి-2025), ట్రైనింగ్ ప్రక్రియ (ఆర్ఆర్బి-2024)ను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. పనిభారం పెంచరాదని, కాలానుకూల విశ్రాంతి సమయాన్ని పాటించాలని కోరారు.

ఎన్టిఆర్ జిల్లా విజయవాడ రైల్వే డిఆర్ఎం కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్షలను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వ విధానాల కారణంగా రైల్వేలో భద్రతా ప్రమాణాలు దిగజారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా లోకో రన్నింగ్ స్టాఫ్ చేపట్టిన 48 గంటల దీక్షకు సిఐటియు తరపున సంఘీభావం తెలుపుతున్నామని వెల్లడించారు. లోకో రన్నింగ్ స్టాఫ్ ఆందోళనకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రామకృష్ణ మాట్లాడుతూ.. తమపై అధిక పని భారం పెరగడం వల్ల రైల్వేలలో ప్రమాణాలు దిగజారే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రన్నింగ్ స్టాఫ్కు చెల్లించే టిఎపై ఆదాయ పన్ను మినహాయింపు కల్పించాలని కోరారు. రేణిగుంట రైల్వే స్టేషన్ క్రూ లాబీ వద్ద, విజయనగరంలో దీక్షలను చేపట్టారు.

కోర్టుకు చేరిన సిఐడి నివేదికలో ఏముంది?

25 రోజులు సాగిన 'పరకామణి' కేసు విచారణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిటిడి పరకామణి కేసుకు సంబంధించి 370 పేజీల నివేదికను హైకోర్టులో సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యనార్ మంగళవారం సమర్పించారు. ఈ కేసుకు సంబంధించిన విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు. నివేదికలో తమ గురించి ఏమైనా ఉందా? లేదా? అనే ఆందోళన మరికొంత మందిలో నెలకొంది. నివేదిక పరిశీలించాక హైకోర్టు తీసుకునే చర్యలెలా ఉంటాయి? వాటి పర్యవసానం ఎలా ఉంటుందనేది అందరిలోనూ ఉత్కంఠ రేపుతోంది.

కేసు పూర్వపరాలివి

గత వైసిపి ప్రభుత్వంలో 2023 ఏప్రిల్లో పరకామణిలో హుండీ లెక్కింపు సమయంలో పెద్ద జియ్యంగార్ మఠం గుమస్తా కోయంబత్తూరు రవికుమార్ అమెరికన్ డాలర్లు దొంగలిస్తూ పట్టుబడ్డారు. ఈ కేసులో రవికుమార్పై నమోదు చేసిన క్రిమినల్ కేసును టిటిడి విజిలెన్స్ అధికారులు హడావిడిగా లోక్అదాలత్లో రాజీ చేశారు. రవికుమార్ ఆస్తులను టిటిడికి విరాళాలుగా ఇస్తున్నట్లు అతనితో వ్రాయించుకున్నారు. ఈ వ్యవహారం వెనుక భారీ కుట్ర జరిగిందన్న ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి.

హైకోర్టు ఆదేశాలతో చర్యలు

పరకామణి చోరీ కేసును హడావిడిగా మూసివేయడంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తిరుపతికి చెందిన జర్నలిస్టు మాచర్ల శ్రీనివాసులు హైకోర్టులో ఈ ఏడాది రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ, తిరుమల వన్టౌన్ పోలీస్స్టేషన్, టిటిడి కార్యాలయాల్లోని సంబంధిత కేసు ఫైళ్లను, రికార్డులను స్వాధీనం చేసుకుని కోర్టుకు అందజేయాలంటూ సిఐడిని ఆదేశించింది. సిఐడి చీఫ్ అయ్యనార్ రంగంలోకి దిగి రికార్డులు స్వాధీనం చేసుకుని హైకోర్టుకు అందజేశారు. అనంతరం అక్టోబరు 27న హైకోర్టు తదుపరి ఆదేశాలు జారీ చేసింది. సిఐడి చీఫ్ స్వయంగా ఈ వ్యవహారంపై విచారణ జరిపి డిసెంబరు రెండున నివేదిక అందజేయాలని ఉత్తర్వులిచ్చింది.

35 మందిని విచారించిన సిఐడి

నవంబర్ నాలుగున సిఐడి చీఫ్ అయ్యనార్ తిరుపతి చేరుకున్నారు. సిఐడి ఎస్పి గంగాధర్, పలువురు డిఎస్పిలు, సిఐలు, ఎస్ఐలు, సిబ్బందితోపాటు అదనంగా టెక్నికల్ టీమ్, ఫోరెన్సిక్ టీమ్, లీగల్ టీమ్ వంటివి తిరుపతిలో ఏర్పాటు చేశారు. ఆ రోజు నుంచి 25 రోజుల పాటు విచారణ సాగింది. నిందితుడు రవికుమార్, ఆయన కుటుంబసభ్యులను, బినామీలుగా అనుమానిస్తున్న వ్యక్తులను విచారించారు. పరకామణి చోరీ జరిగినప్పుడు, లోక్ అదాలత్లో కేసు రాజీ చేసుకున్నప్పుడు పనిచేసిన అప్పటి టిటిడి, విజిలెన్స్, పోలీసు అధికారులను, ఉద్యోగులను ప్రశ్నించారు. లోక్ అదాలత్లో కేసు రాజీకి సంబంధించి కోర్టు సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు.

ఫిర్యాదుదారు అనుమానాస్పద మతి

ఫిర్యాదుదారు సతీష్కుమార్ విచారణకు వస్తూ నవంబర్ 14న అనంతపురం జిల్లా పరిధిలో రైలు పట్టాల పక్కన శవమై కనిపించారు. దీంతో వారం రోజుల పాటు విచారణకు బ్రేక్ పడింది. నవంబరు 21న తిరిగి విచారణ మొదలైంది. టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్రెడ్డిని సైతం విచారించారు. అప్పటి టిటిడి ఇఒ ధర్మారెడ్డిని, చైర్మన్ వైవి సుబ్బారెడ్డిని విచారించారు.

ఆర్బిఐకి చేరని రూ.5,743 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు



న్యూఢిల్లీ : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బిఐ) రూ.2000 నోట్లను ఉపసంహరించుకుని రెండున్నరేళ్లు అవుతోన్నప్పటికీ.. ఇప్పటికీ దాదాపు రూ.5,743 కోట్ల విలువ చేసే నోట్లు కేంద్ర బ్యాంక్కు చేరలేదు. అక్టోబర్ 31 నాటికి రూ.5,817 కోట్ల విలువ చేసే పెద్ద నోట్లు చెలామణిలో ఉండగా.. నవంబర్ 29 నాటికి రూ.74 కోట్లు సెంట్రల్ బ్యాంక్కు చేరడం ద్వారా మిగితా రూ.5,743 కోట్లు ఆర్బిఐకి చేరాల్సి ఉంది. 2023 మే 19న ఈ పెద్ద నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్బిఐ ప్రకటించింది. అదే ఏడాది అక్టోబర్ 7తో గడువు ముగియగా.. ఆ తర్వాత నుంచి ఆర్బిఐ ప్రాంతీయ కార్యాలయల్లో మాత్రమే రూ.2 నోట్లను స్వీకరిస్తోంది. రూ.500, రూ.1,000 నోట్లను రద్దు చేసిన సమయంలో ఖచ్చితమైన గడువు విధించి.. ఆ తర్వాత ఈ నోట్లను స్వీకరించడానికి అంగీకరించలేదు. కానీ.. రూ.2,000 నోట్లకు మాత్రం ఎలాంటి గడువు, పరిమితి విధించకపోవడం గమనార్హం.

ఆపిల్ ఎఐ చీఫ్గా అమర్ సుబ్రమణ్యన్



వాష్టింగన్ : టెక్ దిగ్గజం ఆపిల్ కంపెనీ కృత్రిమ మేధ (ఎఐ) బాధ్యతలను భారతీయుడు అమర్ సుబ్రమణ్యన్కు అప్పగించింది. ఆయనను ఆపిల్ ఎఐ వైస్ ప్రెసిడెంట్గా నియమించింది. ఇప్పటి వరకు ఈ హోదాలో జాన్ జియానాంద్రియా కొనసాగారు. ఇకపై వైస్ ప్రెసిడెంట్ పదవిలో అమర్ ఎఐ విభాగాన్ని నడిపిస్తారని ఆపిల్ తెలిపింది. అమర్ బెంగళూరు యూనివర్సిటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఆ తర్వాత వాషింగ్టన్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ సైన్స్లో పిహెచ్డి చేశారు. పలు దిగ్గజ టెక్ కంపెనీల్లో పని చేశారు.

ఎల్ఐసి ఎమ్డిగా రామక్రిష్ణన్ బాధ్యతలు



ముంబయి : దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) మేనేజింగ్ డైరెక్టర్గా రామక్రిష్ణన్ చందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఈ హోదాలో 30 సెప్టెంబర్ 2027 వరకు లేదా తదుపరి ఉత్వర్వులు వచ్చే వరకు కొనసాగనున్నారని ఎల్ఐసి ఓ ప్రకటనలో తెలిపింది. ఎండికి ముందు ఆయన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, చీఫ్ ఇన్వెస్ట్మెంట్ ఆఫీసర్గా పని చేశారు. 1990లో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్గా ఎల్ఐసిలో చేరిన రామక్రిష్ణన్ పలు హోదాల్లో విశేష అనుభవం కలిగి ఉన్నారు. ఎల్ఐసి నిర్వహణలో ఆయనకు 35 ఏళ్ల అనుభవం ఉంది.

టిడిపి ప్రచార కేంద్రాలుగా పిటిఎంను మార్చొద్దు

- ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ (పిటిఎం)లను టిడిపి ప్రచార కేంద్రాలుగా మార్చొద్దని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ సమావేశాల్లో టిడిపి కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని ఆదేశించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి రామ్మోహన్రావు, కె ప్రసన్నకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సమస్యలు విద్యారంగ అభివృద్ధి చర్చించే వేదికగా ఉండాలని, రాజకీయ వేదికగా ఉండకూడదని సూచించారు. విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాలు రాకూడదని ఒకవైపు సర్క్యులర్ను విడుదల చేసిన కూటమి ప్రభుత్వం.. మరోవైపు నేరుగా పాఠశాలల సమావేశాలకు పార్టీ కార్యకర్తలు హాజరుకావాలని ఆదేశించడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఒకవైపు విద్యాసంస్థల్లోకి రాజకీయ ప్రసంగాలు, కార్యకలాపాలు, జెండాలు వద్దని చెప్తూనే వారి పార్టీ కార్యకర్తలతో పేరెంట్స్ సమావేశాలు నిర్వహించాలని అనుకోవడం దుర్మార్గమైన చర్య అని తెలిపారు. ఈ నెల 5న జరిగే పిటిఎం సమావేశాలకు విద్యార్థి సంఘాలకు అనుమతులిచ్చి, విద్యార్థి సమస్యలు, అకడమిక్, మౌలిక సదుపాయాలపై చర్చించాలని కోరారు. ఆ దిశగా పిటిఎం ఉపయోగపడాలని, లేదంటే ఈ సమావేశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. విద్యారంగంలో సమస్యలు గాలికొదిలేసి ఇప్పుడు అది కప్పిపుచ్చేందుకు పార్టీ కార్యకర్తలు పాల్గొనాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

ప్రధాని మోడీ వ్యాఖ్యలు సరికావు

- సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రతిపక్షాలను పార్లమెంట్ సమావేశాల వేదికగా ప్రధాని మోడీ కించపరిచే విధంగా చేసిన వ్యాఖ్యల్ని సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ తప్పుబట్టారు. చట్టసభల్లో ప్రజా సమస్యలపై ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తితే అది ఎందుకు డ్రామా అవుతుందో మోడీ సమాధానం చెప్పాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 ఏళ్లలో మోడీ చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. డాలర్తో పోలిస్తే రూపాయి విలువ గణనీయంగా తగ్గిందన్నారు. 2014లో రూ.60 ఉంటే అది ప్రస్తుతం రూ.89.65కు చేరుకుందని తెలిపారు. రూ.55 లక్షల కోట్ల అప్పును రూ.200 లక్షల కోట్లకు పెంచారని చెప్పారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించలేకపోతున్నారని పేర్కొన్నారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆర్థిక శాఖ మాజీ మంత్రి థామస్ ఐజాక్పై అక్రమ కేసులు బనాయించారన్నారు.

'మొంథా' వల్ల నష్టం రూ.6,352 కోట్లు

- కేంద్ర మంత్రులు అమిత్ షా, శివరాజ్ సింగ్ చౌహాన్తో మంత్రులు లోకేష్, అనిత భేటీ
- తుపాను నష్టంపై నివేదిక అందజేత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇటీవల మొంథా తుపాను కారణంగా రాష్ట్రంలో రూ.6,352 కోట్ల మేర నష్టం వాటిల్లిందని విద్యా, ఐటిశాఖల మంత్రి నారా లోకేష్, హోంమంత్రి అనిత తెలిపారు. మంగళవారం నాడిక్కడ కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్తో మంత్రులు లోకేష్, అనిత, టిడిపి ఎంపిలు భేటీ అయి తుపాను నష్టంపై నివేదికను అందజేశారు. తుపాను కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనడమే కాకుండా మౌలిక సదుపాయాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. 'మొంథా తుపాను మొత్తం 24 జిల్లాల్లోని 443 మండలాల పరిధిలో 3,109 గ్రామాలను ప్రభావితం చేసింది. సుమారు 9.53 లక్షల మంది ప్రజలు నష్టాన్ని చవిచూశారు. అక్టోబరు 28 రాత్రి కాకినాడ సమీపంలో తుపాను తీరం దాటింది. ఆ సమయంలో గంటకు 100 కిలోమీటర్ల వేగంతో గాలులతో భారీ వర్షం పడటంతో తీవ్ర నష్టం వాటిల్లింది. రాష్ట్ర ప్రభుత్వం వెనువెంటనే అప్రమత్తమై 1.92 లక్షల మందిని 2,471 పునరావాస శిబిరాలకు తరలించింది.

వారికి అవసరమైన ఆహారం, తాగునీరు, పాలు, ఇతర వస్తువులను అందించింది. ప్రతి ప్రభావిత కుటుంబానికి తక్షణ సాయంగా రూ.3 వేలు అందించాం. ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కూలిన చెట్ల తొలగింపు, తాత్కాలిక నివాస సౌకర్యాలు, నీటి సరఫరా పునరుద్ధరణ వంటి పలు చర్యలు చేపట్టింది. తక్షణ సహాయం కింద రూ.60 కోట్ల ఆర్థిక సహాయం అందించింది. వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.271 కోట్లు, గృహ నష్టం రూ.7 కోట్లు, రహదారులు, మౌలిక సదుపాయాలకు రూ.4,324 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.41 కోట్లు, నీటి వనరులు, నీటి పారుదల ప్రాజెక్టులకు రూ.369 కోట్లు, శాశ్వత నిర్మాణాలకు రూ.1,302 కోట్లు, సామూహిక ఆస్తులకు రూ.48 కోట్ల మేర నష్టం వాటిల్లింది. మొత్తం రూ.6,356 కోట్ల నష్టంలో ఎన్డిఆర్ఎఫ్ మార్గదర్శకాల ప్రకారం రూ.902 కోట్లు తక్షణ ఉపశమనం, తాత్కాలిక పునరుద్ధరణ కోసం అర్హమైనవి. తాము సమర్పించిన నివేదికపై కేంద్ర మంత్రుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన కూడా జరిపింది' అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

వ్యవసాయ రంగంపై ప్రభావం

'తీర, డెల్టా ప్రాంతాల్లో నిరంతర వర్షపాతం, ఎక్కువ కాలం పంట నీట మునగటం కారణంగా వ్యవసాయ పంటలకు భారీగా నష్టం సంభవించింది. సుమారు 1.61 లక్షల హెక్టార్ల పంటలు (వరి, మక్కజొన్న, పత్తి, వేరుశనగ, కంది పప్పు, సిరిధాన్యాలు మొదలైనవి) దెబ్బతిన్నాయి. 3.27 లక్షల మంది రైతులు ప్రభావితమయ్యారు. ఉత్పత్తి నష్టాలు సుమారు 4.36 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంది. పంటలతో పాటు చెరువులు, కాలువలు, పుంత రోడ్లు దెబ్బ తినడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు' అని మంత్రి లోకేష్ తెలిపారు.

పండ్ల తోటలు, ఉద్యాన పంటలపై ప్రభావం

'సుమారు 6,250 హెక్టార్లలో (33 శాతం కంటే అధికం) అరటి, బొప్పాయి, కొబ్బరి, పసుపు, మిరప, కూరగాయలు, పూలు, ఉద్యానవన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ విపత్తు వల్ల తోటల మద్దతు నిర్మాణాలు ధ్వంసమై రైతులకు జీవనోపాధి సవాళ్లను సృష్టించింది. తోటలకు అనుబంధ మౌలిక సదుపాయాలు నర్సరీలు, షేడ్నెట్లు, వ్యవసాయ చెరువులు, నిల్వ గదులు, చిన్ననీటి వనరులు కూడా తీవ్రమైన నష్టాన్ని చవిచూశాయి' అని మంత్రి లోకేష్ తెలిపారు.

జిఎంఆర్ సంస్థ సీనియర్ అధికారులతో లోకేష్ భేటీ

జిఎంఆర్ సంస్థ సీనియర్ అధికారులతో మంత్రి లోకేష్ ఢిల్లీలో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని విశాఖపట్నం వద్ద దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ అభివృద్ధిపై చర్చించారు. ఇందుకు సంబంధించి అభివృద్ధి ప్రణాళికను ఖరారు చేశారు. దీనిని జిఎంఆర్ ఎయిర్ పోర్ట్స్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేయనున్నారు. ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు, జిఎంఆర్ సంస్థ సీనియర్ అధికారులు ఎస్జికె కిషోర్, సి ప్రసన్న, పియుష్ నాయుడు, టిడిపి ఎంపిలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతోన్న వాయుగుండం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతోందని, దీని ప్రభావంతో బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. వాయుగుండం ప్రభావంతో తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఆ సంస్థ మంగళవారం వెల్లడించింది. కృష్ణా, ఎన్టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం పలు ప్రాంతాల్లో వర్షపాతాలు నమోదయ్యాయి. తిరుపతి జిల్లా మల్లంలో 53.5 మిల్లీమీటర్లు, తడలో 50.7, చిత్తమూరులో 50.2, పూలతోటలో 33.5 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతాలు నమోదయ్యాయి. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసింది. సముద్రంలో రెండో నంబరు ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. చేపలవేటను నిషేదించారు.

ఎయులో స్పెషల్ డ్రైవ్ పరీక్షల నోటిఫికేషన్

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో స్పెషల్ డ్రైవ్ పరీక్షలకు సంబంధించిన నోటిఫికేషన్ను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి.చిట్టిబాబు విడుదల చేశారు. 2010-11 సంవత్సరం నుంచి 2025 వరకు వర్సిటీలో ప్రవేశం పొందిన విద్యార్థులు స్పెషల్ డ్రైవ్ పరీక్షలకు అర్హులని తెలిపారు.

డిసెంబర్ నాలుగు నుంచి ఎయు పరీక్షల విభాగం వెబ్సైట్లో ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని, డిసెంబర్ 26 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలను ఫిబ్రవరి 20 నుంచి నిర్వహించాలని ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వివరించారు. పరీక్షలన్నీ ఎయు క్యాంపస్లోనే జరుగుతాయని తెలిపారు. థియరీ పరీక్షకు ఒక్క పేపర్కు రూ.1500, ప్రాక్టికల్ పరీక్ష, వైవా, ప్రాజెక్ట్ పరీక్షలకు ఒక్కోదానికి రూ.3000 చొప్పున పరీక్ష ఫీజుగా చెల్లించాలని వివరించారు. ఈ పరీక్షలకు సంబంధించి రీ వాల్యుయేషన్ విధానం అమలు చేయమని పేర్కొన్నారు. డిగ్రీ, పీజీ, ప్రొఫిషనల్ కోర్సులలో బ్యాక్లాగ్స్ ఉన్న విద్యార్థులంతా సత్వరం దరఖాస్తు చేసుకోవాలని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సూచించారు. వివరాలకు www.exams.andhrauniversity.edu.in సంప్రదించాలని సూచించారు.

పిఎం ఇంటర్న్‌షిప్ అట్టర్ ఫ్లాప్!

- ముందుకొచ్చిన అభ్యర్థులు 16 వేలమందే
- ప్రతి ఐదుగురిలో ఒకరే చేరిక
- మధ్యలోనే వదిలేసిన 41 శాతం మంది



న్యూఢిల్లీ : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం (పిఎంఐఎస్) అట్టర్ ఫ్లాప్ అయింది. రాబోయే ఐదు సంవత్సరాల కాలంలో కోటి మంది యువతీ యువకులకు శిక్షణ ఇస్తామని చెప్పుకున్న ప్రభుత్వం ఈ లక్ష్య సాధనలో చతికిలపడింది. ఈ పథకంలో చేరిన విద్యార్థుల సంఖ్యే చాలా స్వల్పంగా వుండగా, వారిలో మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయిన వారి సంఖ్య గణనీయంగా ఉంది. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సోమవారం లోక్‌సభ ముందు ఉంచిన డేటా ప్రకారం... తొలి రౌండ్‌లో 60వేల మందికి, రెండో రౌండ్‌లో 71వేల మందికి ఇంటర్న్‌షిప్ ఆఫర్ చేశారు. మొత్తంగా 16వేల మంది మాత్రమే (తొలి రౌండ్‌లో 8,700 మంది, రెండో రౌండ్‌లో 7,300 మంది) ఈ పథకంలో చేరారు. ఆ తర్వాత సమయంలో డ్రాపౌట్ రేటు కూడా ఆందోళన కలిగిస్తోంది. ఈ పథకంలో చేరిన వారిలో 41 శాతం మంది... అంటే 6,618 మంది 12 నెలల ప్లేస్‌మెంటును పూర్తి చేయకుండానే మధ్యలో ఇంటర్న్‌షిప్‌ను వదిలేశారు. వీరిలో 4,565 మంది తొలి రౌండ్ అభ్యర్థులు వుండగా, 2,053 మంది రెండో రౌండ్‌కు చెందిన వారున్నారు.

అనాసక్తికి కారణాలు

పథకంలో చేరిన వారిలో ఇప్పటి వరకూ కేవలం 95 ఇంటర్న్‌లు మాత్రమే యాజమాన్యాల నుంచి ఉద్యోగ ఆఫర్ లెటర్లు అందుకున్నారని కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి హర్ష్ మల్హోత్రా తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలియజేశారు. ఈ పథకానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.10,831 కోట్లు కేటాయించారు. సెప్టెంబర్ 30వ తేదీ నాటికి ఖర్చు చేసింది కేవలం రూ.73.72 కోట్లు మాత్రమే. ఇంటర్న్‌షిప్ కోసం ఐదు నుంచి పది కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి రావడం, సాధారణ నైపుణ్యాల శిక్షణ కార్యకలాపాలతో పోలిస్తే ఈ ఇంటర్న్‌షిప్ గడువును సంవత్సరం కాలంగా నిర్ణయించడం, అప్పగించిన బాధ్యతలపై విద్యార్థులకు ఆసక్తి లేకపోవడం వంటి కారణాలతో అభ్యర్థులు వెనుకంజ వేశారని మంత్రిత్వ శాఖ తెలిపింది. పిఎంఐఎస్ పథకాన్ని గత సంవత్సరం అక్టోబర్‌లో రెండు దశల్లో ప్రారంభించారు. 1.27 లక్షల ఇంటర్న్‌షిప్ అవకాశాలను ప్రతిపాదించగా, 1.81 లక్షల మంది అభ్యర్థుల నుండి 6.21 లక్షల దరఖాస్తులు అందాయి. 60వేల మంది అభ్యర్థులకు 82 వేల ఇంటర్న్‌షిప్ ఆఫర్లు ఇచ్చారు. వారిలో 8,700 మంది ఆఫర్లను అంగీకరించారు. ఈ సంవత్సరం జనవరిలో రెండో దశ ప్రారంభమైంది. 1.18 లక్షల ఇంటర్న్‌షిప్ అవకాశాలు ఇవ్వగా, 2.14 లక్షల మంది అభ్యర్థుల నుండి సుమారు 4.55 లక్షల దరఖాస్తులు వచ్చాయి. భాగస్వామ్య కంపెనీలు 71 వేల మంది దరఖాస్తుదారులకు 83 వేల ఆఫర్లు ఇచ్చాయి, వీటిలో కేవలం 24,600 ఆఫర్లను మాత్రమే అభ్యర్థులు అంగీకరించారు. ఇప్పటివరకు 2,053మంది అభ్యర్థులు ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేయకుండానే మధ్యలో వెళ్లిపోయారు.

ఆంధ్రప్రదేశ్ నుండి 51,225 మంది

రెండు దశలలో కలిపి ఆంధ్రప్రదేశ్ నుంచి 51,225 మంది అభ్యర్థులు అత్యధికంగా దరఖాస్తులు సమర్పించారు. ఉత్తరప్రదేశ్ (46,272), మధ్యప్రదేశ్ (43,851) ఆ తర్వాతి రెండు స్థానాలలో నిలిచాయి. రెండో రౌండ్‌కు వచ్చేసరికి మిజోరం, హర్యానా, అస్సాం, ఉత్తరప్రదేశ్, నాగాలాండ్, మణిపూర్, ఢిల్లీ, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్‌లలో దరఖాస్తులు బాగా తగ్గిపోయాయి. ఉద్యోగాల ఆఫర్లు పొందిన అభ్యర్థుల విషయంలో ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో నిలవగా అస్సాం, మధ్యప్రదేశ్ తర్వాతి స్థానాలలో నిలిచాయి.

ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థుల విషయానికి వస్తే తొలి రౌండ్‌తో పోలిస్తే రెండో రౌండ్‌లో బాగా తగ్గారు. మొత్తంగా ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు భాగస్వామ్య కంపెనీలు 30,001 ఇంటర్న్‌షిప్ ఆఫర్లు అందజేశాయి. పథకంలో చేరిన 95 మంది ఇంటర్న్‌లకు 17 కంపెనీలు ఆఫర్ లెటర్లు ఇచ్చాయి. ఈ కంపెనీలలో ముత్తూట్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, మణప్పురం ఫైనాన్స్, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ఉన్నాయి. ప్రభుత్వ రంగం నుంచి కేవలం ఒఎన్‌జిసి మాత్రమే పూర్తి స్థాయి ఆఫర్ లెటర్లు ఇచ్చింది. ఇవి కాకుండా మరో 93 సంస్థలు కూడా ఆఫర్లు ఇచ్చాయి, కానీ చాలా తక్కువ సంఖ్యలో ఇచ్చాయి.

బానిసత్వ శాంతి మాకొద్దు : మదురో

కారకాస్ : తమ దేశం శాంతిని కోరుకుంటోందని, అది సార్వభౌమత్వం, సమానత్వం, స్వేచ్ఛను కలిగి ఉండాలని వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో స్పష్టం చేశారు. బానిసత్వంతో కూడిన శాంతి తమకు అవసరం లేదని తేల్చి చెప్పారు. వెనిజులాపై చేపట్టాల్సిన తదుపరి చర్యల గురించి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన జాతీయ భద్రతా బృందంతో శ్వేతసౌధంలో సమావేశమైన నేపథ్యంలో కారకాస్‌లోని మిరాఫ్లోర్స్ ప్యాలెస్ వెలుపల దేశాధ్యక్షుడు మదురోకు మద్దతుగా సోమవారం భారీ ప్రదర్శన నిర్వహించారు. వెనిజులా పతాకాలతో ర్యాలీకి హాజరైన వేలాదిమంది మద్దతుదారులను ఉద్దేశించి మదురో ప్రసంగిస్తూ దేశ ప్రజలకు పూర్తిగా విధేయుడిగా ఉంటానని చెప్పారు. 'మేము బానిసత్వంతో కూడిన శాంతిని కోరుకోవడం లేదు. అలాగే కాలనీల శాంతిని కూడా కోరుకోవడం లేదు' అని మదురో చెప్పారు.

8న వందేమాతరం.. 9న ఎస్ఐఆర్‌పై చర్చ

- 10 గంటల పాటు డిబేట్
- బిఎసిలో నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై చర్చకు కేంద్రం అంగీకరించింది. అయితే ప్రత్యేకంగా ఎస్ఐఆర్‌పై కాకుండా ఎన్నికల సంస్కరణలపై విస్తృత అంశాన్ని సభ ముందు ఉంచనుంది. ఈ మేరకు స్పీకర్ ఓం బిర్లా మంగళవారం మధ్యాహ్నం ఏర్పాటుచేసిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఎసి) సమావేశంలో కేంద్ర ప్రభుత్వం, ప్రతిపక్షాల మధ్య అవగాహన కుదిరింది. ఆ ప్రకారం ఈ నెల 8న వందేమాతరంపై, 9న ఎన్నికల సంస్కరణలపై లోక్‌సభలో చర్చ జరగనున్నట్లు పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. 'లోక్‌సభ స్పీకర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. వందేమాతర గీతం 150 ఏళ్ళు పూర్తి చేసుకుంటున్నందున దానిపై ఈ నెల 8న మధ్యాహ్నం 12 గంటల నుంచి చర్చ జరపాలని సమావేశం నిర్ణయించింది. అలాగే 9న మధ్యాహ్నం 12 గంటల నుంచి ఎన్నికల సంస్కరణలపై చర్చ మొదలవుతుంది' అని కిరణ్ రిజిజు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో తెలిపారు. కాగా, అఖిలపక్ష సమావేశానంతరం మీడియాతో కాంగ్రెస్ ఎంపీ కె సురేష్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ అంశంపై చర్చించాలని ప్రతిపక్షాలు కోరాయని, ఎస్ఐఆర్‌ను కూడా జతచేసి ఎన్నికల సంస్కరణలపై విస్తృత చర్చకు సమావేశం నిర్ణయించిందని తెలిపారు. సభలో 10 గంటల పొడవున ఈ రెండు డిబేట్లకు సమయం కేటాయించారని, అవసరమైతే సమయం మరింత పొడిగించే అవకాశం ఉంటుందని చెప్పారు.

ఇమ్రాన్‌ఖాన్ మానసిక హింస ఎదుర్కొంటున్నారు.

- సోదరిని ఎట్టకేలకు అనుమతించిన జైలు అధికారులు
- పాక్‌లో రాజ్యాంగం లేదు : ఇమ్రాన్ ఖాన్

ఇస్లామాబాద్ : పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను మానసికంగా హింసిస్తున్నారని ఆయన సోదరి ఉజ్మా తెలిపారు. జైలు అధికారుల అనుమతి కోసం ఆందోళనల నేపథ్యంలో ఇమ్రాన్ ఖాన్‌ను కలిసేందుకు అడియాలా జైలు అధికారులు మంగళవారం అనుమతించారు. ఆయనను కలిసిన అనంతరం ఉజ్మా మాట్లాడుతూ ఇమ్రాన్ బానే ఉన్నారని, కాని జైలు అధికారులు మానసికంగా హింసిస్తున్నారన్నారు. 'నేను బోనులో బంధించబడ్డాను, వారికి మిగిలిన నన్ను చంపడమే' అని ఆయన వ్యాఖ్యానించారని ఉజ్మా వెల్లడించారు. పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ అస్థిరంగా ఉన్నారని కూడా అన్నారని ఆమె తెలిపారు. మన దేశంలో చట్టబద్ధపాలన, రాజ్యాంగం లేవు. ఉన్నది ఒక్కటే అది ఆసిమ్ లా పాలన. ఆసిమ్ మునీర్ అత్యంత నిరంకుశ వ్యకి. ఆయన మానసికంగా అస్థిరంగా ఉన్నాడు. అతని అణిచివేత అసాధారణమైనది, తన అధికార దాహానికి ఏదైనా చేస్తాడు ' అన్న ఇమ్రాన్ సందేశాన్ని ఆయన సోదరి ఉజ్మా జైలు బయట ఉన్న వేలాది అనుచరులకు వెల్లడించారు..

'సంచార్ సాథీ'కి పెమ్మసాని సమర్థన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అందరూ సంచార్ సాథీ యాప్‌ను వినియోగించాలని కేంద్ర ఐటి, టెలి కమ్యూనికేషన్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. మంగళవారం నాడిక్కడ ఆయన ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'టెలికాం మంత్రిత్వశాఖ, డిజిటల్ ఇంటెలిజెన్స్ అధికారులతో కలిసి సంచార్ సాథీ యాప్ రూపొందించారు. గతేడాది నుంచి 50 లక్షల మంది బాధితులు సైబర్ ఫ్రాడ్ బారినపడ్డారు. ఇప్పటి వరకు రూ.23 వేల కోట్లు నష్టపోయారు. మోసాలకు గురయ్యేవారు వృద్ధులు, తెలియని వారు ఉన్నారు. ఆర్థిక నేరాలను అరికట్టేందుకు సంచార్ సాథీ యాప్‌ను రూపొందించారు. ఎవరైనా ఫోన్ కొట్టేసినా, లేదంటే ఏదైనా దొంగ ఫోన్ దొరికిందని అమ్మేశారో' అనేది కూడా తెలుస్తుంది. 2.20 కోట్ల మొబైల్ నెంబర్లను బ్లాక్ చేశాం. 26 లక్షల ఫోన్లు దొంగిలించారు. అందులో 7 లక్షల ఫోన్లు రికవరి చేశాం. ఈ యాప్‌ను ఫోన్‌లో ఉంచుకోవాలని చూడాలని మొబైల్ కంపెనీలను విజ్ఞప్తి చేశాం. ఈ యాప్‌లో ఎలాంటి ఇబ్బంది లేదు. ప్రతిపక్షాలు చెప్తున్నట్టు అలాంటి అంశాలు ఏమీ లేవు. ఇప్పటి వరకు రూ.500 కోట్ల ఫ్రాడ్ లావాదేవీలను అడ్డుకట్ట వేశాం' అని తెలిపారు.

రైల్వేస్‌కు ఆంధ్ర ఝలక్

- సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీ



లక్నో : సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ జట్టు మరో విజయాన్ని నమోదు చేసుకుంది. ఎలైట్ గ్రూప్-ఎలో భాగంగా మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు ఐదు వికెట్ల తేడాతో రైల్వేస్‌పై సంచలన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన రైల్వేస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 167 పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని 19.3ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 172పరుగులు చేసి సునాయాసంగా విజయం సాధించింది. ఆంధ్ర జట్టులో అశ్విన్ హెబ్బర్(78) అర్ధసెంచరీకి తోడు వి ప్రసాద్(39నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించారు. ఈ గెలుపులో ఆంధ్ర జట్టు 4మ్యాచుల్లో 3విజయాలతో 12 పాయింట్లతో 2వ స్థానంలో నిలిచింది.

స్కోర్‌బోర్డు...

రైల్వేస్ ఇన్నింగ్స్: శివమ్ చౌదరి (సి)శశికాంత్ (బి)సౌరభ్ కుమార్ 32, నవనీత్ విర్క్ (సి)రషీద్ (బి)సత్యనారాయణ రాజు 5, మహ్మద్ సైఫ్ (సి)రషీద్ (బి)శశికాంత్ 1, అక్షత్ పాండే (సి)వి.ప్రసాద్ (బి)శశికాంత్ 13, ఉపేంద్ర యాదవ్ (సి)శశికాంత్ (బి)పృధ్వీరాజ్ 55, రవి సింగ్ (సి)వి.ప్రసాద్ (బి)సత్యనారాయణ రాజు 49, అశుతోష్ శర్మ (సి)రషీద్ (బి)సత్యనారాయణ రాజు 0, కర్ణ్ శర్మ (నాటౌట్) 1, రాజ్ చౌదరి (నాటౌట్) 1, అదనం 10. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 167పరుగులు.

వికెట్ల పతనం: 1/11, 2/12, 3/29, 4/67, 5/165. 6/165, 7/166

బౌలింగ్: శశికాంత్ 4-0-33-2, సత్యనారాయణ రాజు 4-0-3-3, పృధ్వీరాజ్ 4-0-34-1, సౌరభ్ కుమార్ 4-0-33-1, బి.యశ్వంత్ 4-0-35-0.

ఆంధ్ర ఇన్నింగ్స్: కెఎస్ భరత్ (సి)ఉపేంద్ర యాదవ్ (బి)అక్షత్ పాండే 15, అశ్విన్ హెబ్బర్ (సి)కర్ణ్ శర్మ (బి)రాహుల్ శర్మ 78, రషీద్ (సి)రవిసింగ్ (బి)రాహుల్ శర్మ 3, రికీ బుయ్ (సి)కర్ణ్ శర్మ (బి)బీహారీ రాయ్ 2, పెన్మెట్సా రాజు (ఎల్‌బి)రాజ్ చౌదరి 25, వి.ప్రసాద్ (నాటౌట్) 39, కెవి శశికాంత్ (నాటౌట్) 2, అదనం 9. (19.3ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 173పరుగులు.

వికెట్ల పతనం: 1/26, 2/35, 3/45, 4/104, 5/150

బౌలింగ్: బీహారీ రాయ్ 4-0-33-1, రాహుల్ శర్మ 4-0-34-2, అక్షత్ పాండే 2-0-23-1, రాజ్ చౌదరి 3.3-0-27-1, కర్ణ్ శర్మ 3-0-28-0, శివమ్ చౌదరి 3-0-21-0.

న్యాయ రంగ అవసరాలకు ప్రత్యేక కోర్సు

దస్తావేజుల లేఖకులు, గుమస్తాలు, క్లర్కుల కోసం సర్టిఫికెట్ కోర్సు • ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ప్రొ.ఎస్ విజయలక్ష్మి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దైనందిన జీవితంలో ప్రతి విషయాన్ని చట్టం ఎలా ప్రభావితం చేస్తుందో తెలుసుకోవాలంటే న్యాయవిద్యను అభ్యసించడమే మార్గం. న్యాయవాద వృత్తి చేపట్టడానికి సాధారణంగా ఇంటర్ విద్యార్హతతో బిఎ ఎల్‌ఎల్‌బి (ఇంటిగ్రేటెడ్ కోర్సు), డిగ్రీ అర్హతతో ఎల్‌ఎల్‌బి, ఆ తర్వాత మాస్టర్స్ స్థాయిలో ఎల్‌ఎల్‌ఎం వంటి కోర్సులను తెలుగు రాష్ట్రాల్లోని వివిధ న్యాయ విద్యా కళాశాలలు అందిస్తున్నాయి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం కూడా వర్ధమాన న్యాయ రంగ అవసరాలను దృష్టిలో ఉంచుకొని పలు న్యాయ విద్యా కోర్సులను అందిస్తోంది. బిఎ ఎల్‌ఎల్‌బి ఇంటిగ్రేటెడ్ డిగ్రీతో పాటు వివిధ స్పెషలైజేషన్స్‌తో ఎల్‌ఎల్‌ఎం కోర్సు అందిస్తోంది. లా సెట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తున్నారు. అయితే ఈ సాధారణ డిగ్రీలతో న్యాయరంగ అవసరాలు తీరడం లేదు. ప్రత్యేకించి లీగల్ డ్రాఫ్టింగ్, ప్లీడింగ్, కన్వేయన్సింగ్, దస్తావేజులు, అఫిడవిట్లు, వీలునామాలు వంటివి న్యాయ ప్రక్రియలో చాలా కీలకమైనవి. రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, కోర్టు ఆవరణల్లో ఇలాంటి పనులు చేసేవారు ఎంతో మంది ఉంటారు. సాధారణంగా వీరికి న్యాయ విద్యా డిగ్రీలుండవు. వీరితో పాటు న్యాయవాదుల కార్యాలయాల్లో పనిచేస్తున్న గుమస్తాలు, కోర్టు క్లర్కులు, టైపిస్టులు సైతం న్యాయ విద్యాభ్యాసనంతో సంబంధం లేకుండానే సేవలందిస్తున్నారు. అయితే వీరికి న్యాయ విద్య కూడా అందితే.. మరింత ఉన్నతస్థానాలను అధిరోహించేందుకు, క్లయింట్లకు మెరుగైన న్యాయ సేవలందించేందుకు ఉపకరిస్తుంది. ప్రస్తుతం మన న్యాయ వ్యవస్థకు ఇది ఎంతో అవసరం. ఈ అవశ్యకతను గుర్తించిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ ప్రత్యేకంగా ఒక సర్టిఫికెట్ కోర్సుకు రూపకల్పన చేసింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను లీగల్ స్టడీస్ విభాగ అధిపతి ప్రొఫెసర్ ఎస్ విజయలక్ష్మి ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తెలియజేశారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..



ప్రజాశక్తి : మేడమ్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తున్న న్యాయ విద్యా కోర్సుల గురించి చెబుతారా?

ప్రొఫెసర్ విజయలక్ష్మి : భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) ఎన్‌వి రమణ గారితో సహా అనేక మంది న్యాయ కోవిదులను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందించింది. 1979 నుంచి ఎల్‌ఎల్‌బి కోర్సులు కొనసాగుతున్నాయి. 1984లో ఎల్‌ఎల్‌ఎం కోర్సులు ఆరంభమయ్యాయి. బిఎఎల్‌ఎల్‌బి కూడా అందుబాటులోకి తీసుకొచ్చాం. ఇవి కాకుండా ప్రస్తుత న్యాయ వ్యవస్థ అవసరాలను గుర్తించి ప్రత్యేకంగా దస్తావేజుల లేఖకులు, క్లర్కులు, గుమస్తాలు, టైపిస్టులు వంటి ఇతర సిబ్బంది అవసరాలు తీర్చేలా 'సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ప్లీడింగ్ అండ్ డ్రాఫ్టింగ్' ను అందుబాటులోకి తీసుకొచ్చాం.

➢ **ఇప్పటికే లీగల్ డ్రాఫ్టింగ్, ప్లీడింగ్ ప్రక్రియల్లో పనిచేస్తున్నవారు కానీ, న్యాయ విద్యార్థులు కానీ ఈ సర్టిఫికెట్ కోర్సు చేయాల్సిన అవసరం ఏమిటి?**

- లీగల్ డ్రాఫ్టింగ్, ప్లీడింగ్ అంశాలు న్యాయ ప్రక్రియలో చాలా ప్రముఖ పాత్ర పోషిస్తాయి. వీటికి ప్రత్యేక నైపుణ్యాలు కావాలి. అందుకనే ఇటు న్యాయ విద్యార్థులు, అటు ప్రస్తుతం వివిధ విభాగాల్లో అంటే దస్తావేజుల లేఖకులుగా, కోర్టు గుమస్తాలు, క్లర్కులుగా పనిచేస్తున్నవారు, టైపిస్టులు తమ నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. ఆ అవసరాలను ఈ సర్టిఫికెట్ కోర్సు తీరుస్తుంది. సివిల్; క్రిమినల్ కేసులలో దావాలు, పిటిషన్లు రూపొందించడానికి, సంబంధిత న్యాయస్థానాల్లో వాదనలు వినిపించడానికి యువ న్యాయవాదులకు ఈ కోర్సు ఎంతో దోహదహారిగా ఉంటుంది. అనుభవజ్ఞులైన న్యాయ నిపుణులు బోధకులుగా ఉంటారు. ఇది ప్రాక్టికల్‌గా ఎదురయ్యే అనేక సందేహాలను నివృత్తి చేయగలిగే కోర్సు.

➢ **ఈ కోర్సుకు అర్హతలు, ప్రవేశ వివరాలు, ఫీజుల గురించి తెలియజేస్తారా?**

- ప్రత్యేక అవసరాల దృష్ట్యా రూపొందించిన ఈ కోర్సు ప్రవేశాలకు ప్రస్తుతం ఎల్‌ఎల్‌బి, ఎల్‌ఎల్‌ఎం చదువుతున్న విద్యార్థులు, కోర్టు గుమస్తాలు, కోర్టు క్లర్కులు, అలాగే దస్తావేజులు రాసేవారు, వీలునామాలు, అఫిడవిట్లు వంటి పత్రాలు కంపోజ్ చేసే టైపిస్టులు అర్హులు. అయితే ఇందుకు తగిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సివుంటుంది. తొలి సెషన్ ప్రవేశాలకు ఇప్పటికే (గత నవంబరు 5న) నోటిఫికేషన్ విడుదలైంది. అపరాధ రుసుము లేకుండా ఈ నెల డిసెంబర్ 12 వరకు, రూ.500 అపరాధ రుసుంతో.. ఆ తర్వాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు మొత్తానికి రూ.10 వేలు ఫీజుగా నిర్ణయించాం. మెటీరీయల్, స్టేషనరీ వంటివాటికి నామమాత్రపు ఫీజులుంటాయి.

➢ **ఈ కోర్సుకు సంబంధించిన తరగతులు ఏ పద్ధతిలో ఉంటాయి?**

- సాధారణ రోజుల్లో అంటే సోమవారం నుంచి శుక్రవారం వరకు హైబ్రిడ్ (ఆన్‌లైన్) పద్ధతిలోనూ, వారాంతాలు అంటే శని, ఆదివారాల్లో ఆఫ్‌లైన్ పద్ధతిలో ఉంటాయి. వారాంతాల్లో అభ్యర్థులు వర్శిటీలో నిర్వహించే తరగతులకు నేరుగా హాజరు కావాల్సి వుంటుంది. మూడు నెలలు పాటు కోర్సు ఉంటుంది. తొలి సెషన్ తరగతులు ఈ నెల 19న ప్రారంభమై..వచ్చే ఏడాది మార్చి 31 వరకు కొనసాగుతాయి.

➢ **అర్హతలు, ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలకు ఎవరిని సంప్రదించాలి?**

- ఈ కోర్సుకు సంబంధించిన పూర్తి వివరాల కోసం, లేదా సందేహాల నివృత్తి కోసం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ విభాగాన్ని నేరుగా సంప్రదించవచ్చు. లేదా ఆ విభాగపు డైరెక్టర్ డాక్టర్ పి బ్రహ్మాజీరావు కార్యాలయం ఫోన్ నంబర్లు 0863-2346171, 94402 58811, 94402 58822లలో సంప్రదించవచ్చు.

రికార్డు పుటల్లో వైభవ్ సూర్యవంశీ

- బీహార్‌పై మహారాష్ట్ర గెలుపు

ముంబయి: సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో 14ఏళ్ల వైభవ్ సూర్యవంశీ శతకంతో మెరిసి రికార్డు పుటల్లోకెక్కాడు. ఈ టోర్నీ చరిత్రలో 14ఏళ్ల 250 రోజులకే శతకం కొట్టిన తొలి క్రికెటర్‌గా వైభవ్ ఈ రికార్డును నెలకొల్పాడు. బీహార్ తరఫున ఆడుతూ వైభవ్.. కేవలం 58బంతుల్లోనే శతకం బాదాడు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బీహార్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 176పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని మహారాష్ట్ర జట్టు 19.1ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 182పరుగులు చేసి గెలిచింది. పృథ్వీ షా(66; 30బంతుల్లో) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో మెరిసాడు. అంతకుముందు ఐపిఎల్ 2025లో సూర్యవంశీ రాజస్తాన్ రాయల్స్ తరఫు గుజరాత్‌పై కేవలం 35బంతుల్లో సెంచరీ కొట్టిన తొలి యువ క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే.



హైస్కోరింగ్ మ్యాచ్‌లో బరోడా గెలుపు

హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో పంజాబ్-బరోడా జట్ల మధ్య హై స్కోరింగ్ మ్యాచ్‌లో ముంబయి గెలిచింది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్ల బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడి పరుగులు వరద పారించారు. ఇరుజట్లు కలిసి మొత్తం 19 సిక్సర్లు కొట్టడం మరో విశేషం. తొలుత పంజాబ్ ఇన్నింగ్స్‌లో యువ సంచలనం అభిషేక్ శర్మ కేవలం 19 బంతుల్లోనే 50 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. అతనితో పాటు అన్‌మోల్‌ప్రీత్ సింగ్ కూడా 32 బంతుల్లో 69 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. దీంతో పంజాబ్ జట్టు బరోడా ముందు 223 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. ఛేదనలో బరోడా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అదరగొట్టాడు. గాయం నుంచి కోలుకున్న తర్వాత గ్రౌండ్‌లోకి అడుగుపెట్టిన శివాలిక్ శర్మతో కలిసి హార్దిక్ 62 బంతుల్లో 109 పరుగుల మ్యాచ్-విన్నింగ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. పాండ్యా 42 బంతుల్లో 183.33 స్ట్రైక్ రేట్‌తో 77 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఇన్నింగ్స్‌లో 7 ఫోర్లు, 4 సిక్సర్లు ఉన్నాయి. హార్దిక్ తన జట్టును విజయతీరాలకు చేర్చాడు. పంజాబ్ తరఫున అభిషేక్ శర్మ ఆడిన మెరుపు ఇన్నింగ్స్ కన్నా.. హార్దిక్ పాండ్యా ఇన్నింగ్స్ మ్యాచ్ ఫలితాన్ని డిసైడ్ చేసింది. తన ఈ నాక్ తో బరోడాకు విజయాన్ని అందించాడు. చివరి ఓవర్ తొలి బంతికే బరోడా లక్ష్యాన్ని ఛేదించి 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

2026 ఐపిఎల్‌కు మ్యాక్స్‌వెల్ దూరం

- 16న అబుదాబి వేదికగా వేలం



ముంబయి: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) 2026 కోసం జరిగే ఆటగాళ్ల వేలానికి ఆస్ట్రేలియా క్రికెటర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ దూరం అయ్యాడు. 2026 ఐపిఎల్ సీజన్ వేలానికి తమ పేరును సమర్పించడం లేదని మంగళవారం ప్రకటించాడు. ఈనెల 16న అబుదాబిలో ఐపిఎల్ ప్లేయర్ల వేలం జరగనుంది. 2012 ఐపిఎల్ సీజన్ నుంచి ఆడుతున్న మ్యాక్స్‌వెల్‌కు హార్డ్‌హిట్టర్‌గా పేరుంది. 141 ఐపిఎల్ మ్యాచుల్లో 2819 పరుగులు చేశాడు. అతనికి స్ట్రయిక్ రేట్ 155 ప్లస్‌గా ఉంది. అయితే ఐపిఎల్ వేలంలో అతనికి ఫ్రాంఛైజీలు ఎక్కువే సమర్పిస్తున్నా.. మ్యాక్స్‌వెల్ మాత్రం ఆశించిన రీతిలో సక్సెస్ సాధించలేదు. స్పిన్ బౌలింగ్ వేసే మ్యాక్స్‌వెల్ .. ఐపిఎల్‌లో కేవలం 41 వికెట్లు తీసుకున్నాడు. ఐపిఎల్‌లో ఎన్నో మరుపురాని సీజన్స్ ఆడానని, అయితే ఈ ఏడాది జరిగే ఆటగాళ్ల వేలానికి తమ పేరును సమర్పించడం లేదని మ్యాక్స్‌వెల్ తన సోషల్ మీడియా అకౌంట్‌లో ప్రకటించాడు. గత రెండు సీజన్లలో అతను 17 మ్యాచుల్లో కేవలం వంద పరుగులు మాత్రమే చేశాడు. 2024లో 52, 2025లో 48 రన్స్ మాత్రమే స్కోరు చేశాడు. గత సీజన్‌లో ఏడు మ్యాచ్‌లు ఆడి ఆ తర్వాత స్వదేశం వెళ్లి తిరిగి రాలేదు.

బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి ప్రయోగం సక్సెస్

- కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడి



న్యూఢిల్లీ : బంగాళాఖాతం వద్ద నుంచి బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి ప్రయోగం సక్సెస్ అయ్యిందని కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దక్షిణ కమాండ్‌లోని బ్రహ్మోస్ యూనిట్, ట్రై-సర్వీసెస్ అండమాన్, నికోబార్ కమాండ్ అంశాలతో కూడిన కచ్చితమైన సమన్వయ ప్రయత్నం ద్వారా విజయవంతమైందని పేర్కొంది. అధునాతన మార్గదర్శకత్వం , నియంత్రణ వ్యవస్థలతో అమర్చబడిన ఈ క్షిపణి అధిక-వేగ విమాన స్థిరత్వం, టెర్మినల్ కచ్చితత్వాన్ని ప్రదర్శించిందని, దాని నిర్దేశించిన లక్ష్యాన్ని కచ్చితంగా ఛేదించిందని వివరించింది. యుద్ధభూమి సవాళ్లను ఎదుర్కోవడానికి రియల్-టైమ్ ప్రెసిషన్ స్ట్రైక్ మిషన్లను చేపట్టే సామర్థ్యాన్ని పునరుద్ఘాటించింది. ఈ సందర్భంగా దక్షిణ కమాండ్ జనరల్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ విజయవంతమైన పోరాట ప్రయోగాన్ని ప్రశంసించారు .



క్వార్టర్స్‌కు భారత్

- ఎఫ్‌ఐహెచ్ ప్రపంచకప్ జూనియర్ హాకీ

చెన్నై: ఎఫ్‌ఐహెచ్ ప్రపంచకప్ జూనియర్ హాకీ క్వార్టర్‌ఫైనల్లోకి భారతజట్టు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన గ్రూప్-బి చివరి లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు స్విట్జర్లాండ్‌ను చిత్తుచేసింది. తొలి కార్టర్ ముగిసేసరికి 3-0గోల్స్ ఆధిక్యతలో నిలిచిన భారత్.. ఆ ఆధిక్యతను చివరి వరకు నిలుపుకొని విజయం సాధించింది. దీంతో గ్రూప్-బిలో భారతజట్టు టాప్‌లో నిలిచి క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. రెండో క్వార్టర్‌లో భారత్ మరో గోల్ చేసి 5-0 ఆధిక్యతలో నిలిచింది. గ్రూప్-బి నామమాత్రపు మ్యాచ్‌లో చిలీ జట్టు 2-0గోల్స్ తేడాతో ఓమన్ ఓడించి 3వ స్థానానికే పరిమితం కాగా.. ఈ మ్యాచ్‌కు ముందే ఇండియా, స్విట్జర్లాండ్ జట్లు క్వార్టర్‌ఫైల్‌కు చేరాయి. మంగళవారం జరిగిన ఇతర లీగ్ మ్యాచుల్లో ఫ్రాన్స్ జట్టు 3-2 గోల్స్ తేడాతో బంగ్లాదేశ్‌ను ఓడించింది. మేయర్ రాధాకృష్ణ హాకీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఈ గెలుపుతో గ్రూప్-ఎఫ్‌లో ఫ్రాన్స్ జట్టు అగ్రస్థానంలో నిలిచి క్వార్టర్స్‌కు చేరింది. ఇదే గ్రూప్‌లో ఉన్న ఆస్ట్రేలియా జట్టు 3-1గోల్స్ తేడాతో ద. కొరియాను చిత్తుచేసి 2వ స్థానంలో నిలిచి క్వార్టర్స్‌కు చేరింది. ఇక గ్రూప్-డిలో స్పెయిన్ జట్టు 13-0గోల్స్ తేడాతో నమీబియాను, బెల్జియం జట్టు 10-0తో ఈజిప్ట్‌ను ఓడించాయి. దీంతో స్పెయిన్ జట్టు 9పాయింట్లతో గ్రూప్-డిలో అగ్రస్థానంలో నిలువగా.. బెల్జియం 6పాయింట్లతో 2వ స్థానంలో నిలిచి క్వార్టర్‌ఫైనల్ బెర్త్ దక్కించుకుంది. మంగళవారం జరిగిన మరో మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 11-0తో ఆస్ట్రియాను, ఇంగ్లండ్ జట్టు 3-1తో మలేషియాను ఓడించాయి. దీంతో ఈ గ్రూప్‌నుంచి నెదర్లాండ్స్, ఇంగ్లండ్ జట్లు 1, 2 స్థానాల్లో నిలిచి నాకౌట్‌కు చేరాయి. గురువారం నుంచి క్వార్టర్‌ఫైనల్ పోటీలు జరగనున్నాయి.

లీగ్ దశ ముగిసిన తర్వాత పాయింట్ల పట్టిక..

వ.స. జట్టు	ఆ	గె	డ్రా	ఓ	చే.గో.	ఇ.గో.	గో.అ.	పా
గ్రూప్-ఎ								
1. జర్మనీ	3	3	0	0	16	1	+15	9
2. దక్షిణాఫ్రికా	3	2	0	1	11	6	+5	6
3. ఐర్లాండ్	3	1	0	2	6	10	-4	3
4. కెనడా	3	0	0	3	4	20	-16	0
గ్రూప్-బి								
1. ఇండియా	3	3	0	0	29	0	+29	9
2. స్విట్జర్లాండ్	3	2	0	1	7	7	+5	6
3. చిలీ	3	1	0	2	4	10	-6	3
4. ఓమన్	3	0	0	3	0	23	-23	0
గ్రూప్-సి								
1. అర్జెంటీనా	3	2	1	0	10	5	+5	7
2. న్యూజిలాండ్	3	2	1	0	11	8	+3	7
3. జపాన్	3	1	0	2	6	9	-3	3
4. చైనా	3	0	0	3	6	11	-5	0
గ్రూప్-డి								
1. స్పెయిన్	3	3	0	0	23	0	+23	9
2. బెల్జియం	3	2	0	1	22	3	+19	6
3. నమీబియా	3	1	0	2	5	27	-22	3
4. ఈజిప్ట్	3	0	0	3	2	22	-20	0
గ్రూప్-ఇ								
1. నెదర్లాండ్స్	3	3	0	0	22	3	+19	9
2. ఇంగ్లండ్	3	2	0	1	19	6	+13	6
3. మలేషియా	3	1	0	2	6	10	-4	3
4. ఆస్ట్రియా	3	0	0	3	1	29	-28	0
గ్రూప్-ఎఫ్								
1. ఫ్రాన్స్	3	3	0	0	22	6	+16	9
2. ఆస్ట్రేలియా	3	2	0	1	11	12	-1	6
3. బంగ్లాదేశ్	3	0	1	2	8	11	-3	1
4. ద.కొరియా	3	0	1	2	5	17	-12	1

గమనిక: ఆ:ఆడినవి; గె:గెలుపు; డ్రా:డ్రాలు; ఓ:ఓటమి; చే.గో:చేసిన గోల్స్; ఇ.గో:ఇచ్చిన గోల్స్; గో.వ్య:గోల్స్ వ్యత్యాసం పా:పాయింట్లు

'సంచార్ సాథీ' మంటలు

- ఉభయసభల్లో నిరసనల పర్వం
- దేశ ప్రజల గోప్యతపై దాడి అంటూ ప్రతిపక్షాల ఆందోళన
- విస్తృత చర్చ జరగాలని కాంగ్రెస్, సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

'సంచార్ సాథీ' అంశం పార్లమెంట్ ఉభయసభల్ని కుదిపేసింది. ఈ యాప్ ప్రజల ప్రైవసీని కేంద్రం హరించడమేనని ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. దేశంలో విక్రయించే అన్ని కొత్త స్మార్ట్‌ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను ప్రీ-ఇన్‌స్టాల్ (డిఫాల్ట్‌గా) చేయాలంటూ కేంద్రం ఇచ్చిన ఆదేశాలపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దీనిపై చర్చకు తాము వ్యతిరేకం కాదని అధికార పక్షం వివరణ ఇచ్చుకుంది.కాంగ్రెస్, సిపిఎం, శివసేన, టిఎంసి ఈ యాప్‌ను తీవ్రంగా విమర్శించాయి. ఇది.. ప్రజల ప్రైవసీ ఉల్లంఘనే అంటూ సభలో ఆందోళన చేశాయి. ప్రతిపక్ష కాంగ్రెస్, సిపిఎం దీని మీద వాయిదా తీర్మానం ఇచ్చి సంచార్ సాథీపై విస్తృత చర్చ జరగాలని డిమాండ్ చేశాయి. సంచార్ సాథీ యాప్.. ఫోన్ యూజర్ల కదలికల్ని, మెసేజెస్, కాల్స్ మానిటర్ చేస్తుందని విమర్శించాయి. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి, సిపిఎం ఎంపీ శివదాసన్ దీనిపై వాయిదా తీర్మానం ఇచ్చారు. "గోప్యతా హక్కు అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద హామీ ఇవ్వబడిన జీవించే ప్రాథమిక హక్కు. వ్యక్తిగత స్వేచ్ఛ అంతర్గత అంశం. పౌరుల ప్రతి కదలికను నిఘాలో ఉంచే ప్రమాదం ఉంది" అని అన్నారు.

గూఢచర్య యాప్ : ప్రియాంకాగాంధీ

" సంచార్ సాథీ ఒక గూఢచర్య యాప్. ఇది హాస్యాస్పదంగా ఉంది. పౌరులకు గోప్యత హక్కు ఉంది. దాన్ని తుంగలో తొక్కుతోంది. దేశం నియంతృత్వం చేతుల్లోకి వెళ్తోంది. ఫోన్లపై నిఘానో, సంచార్ సాథీ యాప్ విషయమో కాదు. అన్ని అంశాల్లో నియంతృత్వం వైపు తీసుకెళ్తున్నారు"

రాజ్యాంగ విరుద్ధం : కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ కెసి వేణుగోపాల్

"ఈ యాప్ డిస్టోపియన్ టూల్. ఇది ప్రతి భారతీయుడిని మానిటర్ చేయడమే కాకుండా.. వారి ఆర్థిక హక్కులపై దాడి చేయడమే. దీని అమలు రాజ్యాంగ విరుద్ధం.

ప్రజల గోప్యతపై దాడి : సిపిఎం ఎంపీ జాన్‌బ్రిట్టాస్

"సంచార్ సాథీ యాప్ వాడకం ప్రజల గోప్యతపై స్పష్టమైన దాడినే. ఇది సుప్రీంకోర్టు 2017లో ఇచ్చిన పుట్టస్వామి తీర్పును ఉల్లంఘించడమే. ముందే ఇన్‌స్టాల్ చేయబడింది. తొలగించబడదు, అంటే 120 కోట్ల పరికరాలకు ఇది తప్పనిసరి. ఇది మరొక రకమైన నిఘా. తదుపరి దశ, యాంగిల్ మానిటర్లు, బ్రెయిన్ చిప్‌లను ఉంచడం లాంటిది. ప్రజలు చెప్పే, ఆలోచించే ప్రతి క్షణాన్ని ప్రభుత్వం పర్యవేక్షిస్తుంది. గతంలో పెగాసస్‌కు సంబంధించిన ఘటనలు జరిగాయి. కేంద్ర ప్రభుత్వం దానికి సహకరించలేదని సుప్రీంకోర్టు తెలిపింది. రాష్ట్ర సంస్థలు పరికరాన్ని యాక్సెస్ చేస్తున్నాయంటే హ్యాకింగ్ ప్రయత్నాలు చేస్తున్నాయని ఐఫోన్ వినియోగదారులకు హెచ్చరికలు వచ్చాయి. వారు దర్యాప్తు చేసి 2-3 ఏళ్లకు పైగా అయింది. కానీ ఫలితం ఏమిటి? ఇప్పుడు వారు దానిని పోలీసు రాజ్యంగా మారుస్తున్నారు"


ఈ యాప్‌పై శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగరిక ఘోష్ తీవ్రంగా తప్పుబట్టారు. ఇది ప్రభుత్వంపై నమ్మకాన్ని సన్నగిల్లేలా చేస్తుందని విమర్శించారు.

గోప్యతపై మోడీ తాజా దాడి! సిపిఎం విమర్శ

న్యూఢిల్లీ : భారత్‌లోకి కొత్తగా వచ్చే ప్రతి ఫోన్‌లో ఇక 'సంచార్ సాథీ' నిఘా యాప్ ముందుగానే అప్‌లోడ్ చేయాల్సి రావడాన్ని సిపిఎం తీవ్రంగా విమర్శించింది. ఇది ప్రజల గోప్యతా హక్కుపై తాజాగా దాడి చేయడమేనని పేర్కొంది. ఈ నిర్ణయం తీసుకోవడానికి ముందుగా ప్రజల నుండి ఎలాంటి ఆమోదం కోరలేదని, ఎంచుకునేందుకు వారికి అవకాశం ఇవ్వలేదని, ప్రజలతో చర్చలు, సంప్రదింపులు జరపలేదని పార్టీ విమర్శించింది. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్టు చేసింది. ప్రతి ఫోన్‌లోనూ ఈ ప్రభుత్వ నిఘా వ్యవస్థను బలవంతంగా చొప్పించేందుకు ఒత్తిడి తీసుకువస్తున్నారని పేర్కొంది. "ఐఎంఇఐ మోసాన్ని నివారించడం" అనే సాకుతో కింది స్థాయి నుండి ఈ చర్యలు తీసుకుంటున్నారని పేర్కొంది. ఇది మోసాన్ని నివారించడం కాదని, మొత్తంగా డిజిటల్ నిఘాకు పాల్పడటమేనని, ప్రాథమిక హక్కు అయిన గోప్యతా హక్కుపై ప్రత్యక్షంగా దాడి జరపడమేనని విమర్శించింది. ఈ రాజ్యాంగ విరుద్ధమైన ఉల్లంఘనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొంది. తక్షణమే ఈ చర్యను ఉపసంహరించుకోవాలని, రాజ్యాంగాన్ని గౌరవించాలని, ప్రజల ఫోన్లను నిఘాకు వినియోగించవద్దని కోరింది.

రెండు దశల్లో 'జన గణన'

- డిజిటల్ విధానంలో నిర్వహణ
- 2026 ఏప్రిల్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు : కేంద్రం



న్యూఢిల్లీ : దేశంలో జనగణన రెండు దశల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. 2026 ఏప్రిల్ - సెప్టెంబర్ మధ్య మొదటి దశ, 2027 ఫిబ్రవరిలో రెండో దశ జనగణన జరుగుతుందని మంగళవారం లోక్‌సభకు తెలిపింది. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ వేసిన ప్రశ్నకు, హోం వ్యవహారాల సహాయమంత్రి నిత్యానంద్ రాయ్ సమాధానమిస్తూ జనగణన గురించి తెలిపారు. జనగణన మొదటి దశలో హౌస్ లిస్టింగ్, సెన్సెస్, రెండో దశలో జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని స్పష్టం చేశారు. 'మొదటి దశ జన గణన 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు జరుగుతుంది. అయితే ఆయా రాష్ట్రాల, కేంద్రపాలిత ప్రాంతాల సౌలభ్యానికి అనుగుణంగా 30 రోజుల వ్యవధిలోనే సెన్సెస్ నిర్వహణ ఉంటుందని' నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు.

"2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1 మధ్యలో రెండో దశ జనగణన జరుగుతుంది. అయితే లద్దాక్, జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోని మంచుతో కప్పబడే నాన్-సింక్రోనస్ ప్రాంతాల్లో జనగణన 2026 సెప్టెంబర్ నుంచి అక్టోబర్ 1 మధ్య జరుగుతుంది" అని నిత్యానంద్ రాయ్ లోక్‌సభకు తెలిపారు. ఈ ప్రక్రియకు ముందు వివిధ మంత్రిత్వశాఖలు, విభాగాలు, సంస్థలు, సెన్సెస్ డేటా యూజర్ల నుంచి వచ్చిన సలహాలు, సూచనలు ఆధారంగా జన గణన ప్రశ్నాపత్రాన్ని రూపొందించినట్టు మంత్రి చెప్పారు. మన దేశంలో జన గణనకు 150 ఏండ్లకు పైగా చరిత్ర ఉందని, ఇంతకు ముందు నిర్వహించిన జనాభా లెక్కల నుంచి నేర్చుకున్న పాఠాల ఆధారంగా తదుపరి జన గణనకు పరిగణనలోకి తీసుకుంటామని ఆయన అన్నారు.

డిజిటల్ విధానంలో...

2027 జనాభా లెక్కింపు డిజిటల్ వేలో నిర్వహించనున్నట్లు మంత్రి నిత్యానంద్ రాయ్ పేర్కొన్నారు. మొబైల్ యాప్‌ల ద్వారా డేటాను సేకరిస్తామని, స్వీయ గణనకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.

కులగణన కూడా

మరో ప్రశ్నకు నిత్యానంద్ రాయ్ సమాధానం ఇస్తూ, ఈ ఏడాది ఏప్రిల్ 30న రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ నిర్ణయించిన విధంగా కుల గణనను కూడా ఈ జనాభా గణనలోనే జరుగుతుందని ఆయన లోక్‌సభకు తెలిపారు.

విద్యుత్ శక్తితో నడిచే టెథర్డ్ కైట్ బెలూన్

- చైనా తొలి విమాన ప్రయాణం విజయవంతం

బీజింగ్ :రిమోట్ సెన్సింగ్ పర్యవేక్షణ కోసం చైనా మొట్టమొదటి విద్యుత్ శక్తితో నడిచే టెథర్డ్ కైట్ బెలూన్ ప్రయోగం విజయవంతమైంది. ఈశాన్య చైనాలోని లియోనింగ్ ప్రావిన్స్‌లోని జియాన్‌పింగ్ కౌంటీలో తొలి విమాన ప్రయాణాన్ని పూర్తి చేసిందని సైన్స్ అండ్ టెక్నాలజీ డైలీ నివేదించింది. హీలియం తేలియాడే శక్తి ద్వారా ఎత్తబడిన ఈ ఎయిర్‌షిప్ 20 కిలోమీటర్ల కవరేజ్ వ్యాసార్థంలో నిరంతరం 24 గంటలు పైకి లేచి, అగ్ని పర్యవేక్షణను నిర్వహిస్తుంది. విద్యుత్ మౌలిక సదుపాయాలను - ట్రాన్స్‌మిషన్ లైన్ ఐసింగ్‌తో సహా కీలకమైన అంశాలపై అంచనా వేస్తుంది. 32.8 మీటర్ల పొడవు , 13.8 మీటర్ల ఎత్తు, 1,818-క్యూబిక్-మీటర్ టెథర్డ్ ఎయిర్‌షిప్ భూమి పైన దాదాపు 200 మీటర్ల ఎత్తులో స్థిరంగా తిరుగుతుంది . గ్రౌండ్ వించ్‌కు అనుసంధానించబడి ఉంటుంది. దీని నిర్మాణంలో ప్రధాన ఎన్వలప్, గొండోలా, టెయిల్ ఫిన్స్, ప్రెజర్ సిస్టమ్ , ఆన్‌బోర్డ్ మానిటరింగ్ , కంట్రోల్ సిస్టమ్‌లు ఉన్నాయి. స్టేట్ గ్రిడ్ లియోనింగ్ ఎలక్ట్రిక్ పవర్ సప్లై కో నుండి ఈ ప్రాజెక్టుకు బాధ్యత వహించే టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ గెంగ్ లినా ప్రకారం, కంపెనీ అభివృద్ధి చేసిన ఇంటెలిజెంట్ ఎయిర్‌షిప్ ఇన్‌స్పెక్షన్ ప్లాట్‌ఫామ్ పర్వతాలపై అడవి మంటల పర్యవేక్షణ, విద్యుత్ లైన్ తనిఖీ , వాతావరణ పర్యవేక్షణతో సహా బహుళ విధులను అందిస్తుంది . సంబంధిత సాంకేతిక పరిశోధన ఫలితాలను సాధించడంతో ఇప్పటికే లియోనింగ్ యొక్క ఎనర్జీ బిగ్ డేటా సిస్టమ్‌తో అనుసంధానించబడింది.ఎయిర్‌షిప్, గ్రౌండ్ డేటా సిస్టమ్, డేటా ప్రాసెసింగ్ ప్లాట్‌ఫారమ్ రిమోట్ సెన్సింగ్ , మల్టీ-సోర్స్ డేటాను మిళితం చేసే ఇంటిగ్రేటెడ్ మానిటరింగ్ నెట్‌వర్క్‌ను ఏర్పరుస్తాయి, పవర్ గ్రిడ్ పరికరాల నిరంతర, అన్ని-వాతావరణ పర్యవేక్షణను అనుమతిస్తుంది . ఇంధన రంగంలో విపత్తు నివారణకూ సహకరిస్తుందని అధికారులు వివరించారు.

గాజాపై ఆగని ఇజ్రాయిల్ నరమేధం

గాజా : గాజాలో ఇజ్రాయిల్ నరమేధం కొనసాగుతోంది. మంగళవారం జరిపిన దాడుల్లో నలుగురు పాలస్తీనియన్లు మరణించారు. దక్షిణగాజాలోని ఒక శరణార్థి శిబిరంపై ఇజ్రాయిల్ డ్రోన్‌తో దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఇద్దరు మరణించారు. వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయిల్ సైన్యం జరిపిన కాల్పుల్లో మరో ఇద్దరు మరణించారు. ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటివరకూ మరణించిన పాలస్తీనియన్ల సంఖ్య 70,000 దాటినట్లు గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

గంజాయి కార్యకలాపాలపై ఉక్కుపాదం

- గుంటూరు ఎస్‌పి వకుల్ జిందాల్
- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లాలో గంజాయి కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికలో మంగళవారం 'గుంటూరులో గంజాయి పంజా' శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఆయన పై విధంగా స్పందించారు. గత 75 రోజుల్లో గంజాయి కార్యకలాపాల్లో పాల్గొంటున్న 163 మంది వ్యక్తులను గుర్తించామని, వీరిపై 28 కేసులు నమోదు చేసి వీరిలో 127 మందిని అరెస్ట్ చేశామని ఇంకా 36 మందిని అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు. నమోదైన 28 కేసుల్లో సుమారు 48 కేజీల ఘనరూప గంజాయిని, 139 గ్రాముల లిక్విడ్ గంజాయిని, 28 గ్రాముల ఎండిఎం అనే మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. గంజాయి కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిని గుర్తించి, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడానికి "టాస్క్ ఫోర్స్" బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి కార్యకలాపాలు జరిగే ప్రాంతాలు, గంజాయి కేసుల్లో ఉన్న పాత నేరస్తుల కదలికలపై పటిష్ట నిఘా పెట్టి, విస్తృత తనిఖీలు చేయిస్తూ ఎక్కడిక్కడ గంజాయి కార్యకలాపాలను అరికడుతున్నామని చెప్పారు. అదే విధంగా "సంకల్పం - మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం" అనే కార్యక్రమాన్ని రాజధానిలోని విట్ యూనివర్సిటీలో నిర్వహించామన్నారు. విద్యాసంస్థలలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాల గురించి విదార్థులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. గుంటూరు జిల్లాను మాదక ద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే ధృడ సంకల్పంగా గంజాయి కార్యకలాపాలకు తావు లేకుండా చేసేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్ గస్తీ నిర్వహించే విధంగా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.



గుడ్లవల్లేరులో తొమ్మిది మంది అరెస్టు

ప్రజాశక్తి- గుడివాడ, గుడ్లవల్లేరు

కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో గంజాయి విక్రయిస్తున్న తొమ్మిది మందిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుండి సుమారు మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గుడివాడ రూరల్ సిఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామానికి చెందిన కొందరు యువకులు పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయిని తీసుకొచ్చి గుడివాడ, మచిలీపట్నం, గుడ్లవల్లేరు పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారంతో పోలీసులు నిఘా పెట్టారు. కౌతవరం రైల్వే స్టేషన్ సమీపంలోని పొదల్లో కొందరి వద్ద గంజాయిని గుర్తించారు. రెవెన్యూ సిబ్బంది సహకారంతో దాడి చేశారు. గుడ్లవల్లేరు, పమిడిముక్కల, గుడివాడ, మచిలీపట్నం ప్రాంతాలకు చెందిన ఎరుకపాటి సందీప్, బెజ్జం గిరీష్, నత్తా ధనేష్, దరిశనం విజయ్, దిరిశనం పవన్ కల్యాణ్, పరిసే అజయ్, సాంబయ్య, మేకా మోక్షజ్ఞ, ప్రత్తిపాటి రాజేష్‌లను అరెస్టు చేశారు. నిందితుల నుంచి 3 కిలోల 100 గ్రాములు గంజాయి, ఒక బైక్, తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గుడ్లవల్లేరుకు చెందిన ముగ్గురు యువకులకు పరిచయమైన రాహుల్ అనే వ్యక్తి పొరుగు రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దాడిలో గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్‌వివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

21 పోస్టులకు ఎపిపిఎస్‌సి పరీక్ష తేదీలు ప్రకటన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎపిపిఎస్‌సి) పలు పోస్టులకు పరీక్ష తేదీలను ప్రకటించింది. వివిధ శాఖలకు చెందిన 21 పోస్టులకు తేదీలను ప్రకటిస్తూ కమిషన్ కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ శాఖలోని అగ్రికల్చర్ ఆఫీసర్ పోస్టులు, ఎపి భూగర్భ నీటి జలాల శాఖలో టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు, ఇంటర్మీడియట్ విద్యలో లైబ్రేరియన్ జూనియర్ లెక్చరర్ పోస్టులు, బిసి సంక్షేమ శాఖలో హాస్టల్ వెల్ఫేర్ పోస్టు, ఆరోగ్యుబిస్ అండ్ ఇంజనీరింగ్ సర్వీస్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు, హార్టికల్చర్ శాఖలో హార్టికల్చర్ ఆఫీసర్ పోస్టు, అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, జైళ్లశాఖలో జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్, మత్స్యశాఖలో అసిస్టెంట్ ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్, వికలాంగ శాఖలో వార్డెన్, గనుల శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ శాఖలో జూనియర్ అకౌంట్ ఆఫీసర్, సైనిక్ వెల్ఫేర్‌లో జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్, వెల్ఫేర్ ఆర్గనైజర్, అటవీశాఖలో సెక్షన్ ఆఫీసర్, డ్రాట్స్‌మ్యాన్, బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, తాండేర్ పోస్టులు, దేవాదాయ శాఖలో గ్రేడ్-2 ఇఓ పోస్టుల పరీక్ష తేదీలను ప్రకటించింది. పరీక్ష సమయం, తేదీలను ఎపిపిఎస్‌సి తన వెబ్‌సైట్ psc.ap.gov.inలో పొందుపరిచింది.

కామన్ డేటా సెంటర్‌గా ఆర్‌టిజిఎస్ : సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ శాఖలన్నింటికీ కామన్ డేటా సెంటర్‌గా ఆర్‌టిజిఎస్ వ్యవహరిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. డిసెంబరు నెలాఖరు నుంచి ప్రభుత్వ శాఖలకు చెందిన సమాచారం అంతా క్రోడీకరించి డేటా ద్వారా విశ్లేషించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలో ఆర్‌టిజిఎస్ నుంచి వివిధ అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ప్రజల్లో సానుకూల దృక్పథం పెరిగేలా మెరుగ్గా పౌరసేవలు అందించాలన్నారు. ప్రజల నుంచి వస్తున్న సమాచారాన్ని విశ్లేషించి సేవలను సులభతరం చేయాలని ఆదేశించారు. సమాచార మాధ్యమాల్లో వచ్చిన వివిధ అంశాలపై స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు సంబంధించిన అంశాల్లో ఎక్కడా రాజీపడొద్దని వెల్లడించారు. ప్రభుత్వం పథకాలు, కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. 175 నియోజకవర్గాల్లో స్వర్ణాంధ్ర విజన్ యూనిట్లు ఏర్పాటు ద్వారా విస్తృత ప్రచారం జరగాలన్నారు. వ్యవసాయం నీటి భద్రత, మార్కెటింగ్, అధిక డిమాండ్ ఉన్న పంటలు సాగు వంటి అంశాలపై 'రైతన్నా మీ కోసం' పేరిట రైతుల వద్దకు వెళ్లాలన్నారు. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న వివిధ సంస్థలు, కాంట్రాక్టర్లు నిబంధనల ప్రకారం పన్నులు చెల్లించేలా డేటాను విశ్లేషించాలని ఆదేశించారు. ఈ నెలాఖరులోగా అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించి 794 సర్వీసులు వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. ఇక ప్రతినెలా జిఎస్‌డిపి సహా ఆర్థిక సూచికలను పరిశీలించనున్నట్లు తెలిపారు. కేంద్రానికి పంపే నివేదికలు కూడా కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ఆధారంగానే ఉంటాయని, ఆ మేరకు అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు సామర్థ్యాలు పెంచుకోవాలని సూచించారు. ప్రజావసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాలన్నారు.

నిజమైన పౌరులను వేధించే అవకాశం

- 'ఎస్ఐఆర్'పై అప్పుడే ఎన్నికల కమిషనర్ సంధు ఆందోళన
- తుది ఆదేశాలలో కానరాని పౌరసత్వ చట్టం ప్రస్తావన

న్యూఢిల్లీ : బీహార్‌తో ప్రారంభించి దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టాలని కేంద్ర ఎన్నికల సంఘం జూన్ 24న ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ ఆదేశాలకు సంబంధించిన ముసాయిదాపై ఎన్నికల కమిషనర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ నోట్ పెట్టారని 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక తెలియజేసింది. 'నిజమైన ఓటర్లు / పౌరులు... ముఖ్యంగా వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు, వికలాంగులు, పేదలు, ఇతర బలహీన గ్రూపులు తాము వేధింపులకు గురవుతామేమోనని భావించకూడదు. వారికి సౌకర్యవంతంగా ఉండాలి' అని సంధు ముసాయిదా ఆదేశాల ఫైలుపై రాశారు. ప్రస్తుతం ఓటర్లుగా ఉన్న వారందరూ ఎన్యూమరేషన్ పత్రాలు పూర్తి చేయాలని, కొన్ని వర్గాల వారు తమ అర్హతను నిరూపించుకోవడానికి అదనపు పత్రాలు సమర్పించాలని ఎన్నికల సంఘం నిర్దేశించడాన్ని దృష్టిలో పెట్టుకొని సంధు ఈ నోట్ పెట్టారని తెలుస్తోంది. చివరికి ఆ ఫైలుపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ సంతకం చేశారు. ఆదేశాలను అత్యవసరంగా జారీ చేయాల్సి ఉన్నందున ముసాయిదా ఆర్డర్‌ను అదే రోజు వాట్సప్‌లో ఆమోదించారు. జూన్ 24న తుది ఆదేశాలను బహిర్గతం చేసినప్పుడు అందులో ఓ సవరణను చేర్చారు. ముసాయిదా ఆదేశాలలో ఎస్ఐఆర్‌ను పౌరసత్వ చట్టంతో ముడి పెట్టారు. తుది ఆదేశాలలో పౌరసత్వ చట్టం ప్రస్తావన తేలేదు. 2003లో ఆమోదించిన సవరణను 2004 నుంచి వర్తింపజేశారు. సంధు వ్యక్తం చేసిన ఆందోళనను పరిగణనలోకి తీసుకొని తుది ఆదేశాలు జారీ చేశారని అర్థమవుతోంది. ఆయన లేవనెత్తిన అంశాన్ని తుది ఆదేశాలలోని 13వ పారాగ్రాఫ్‌లో చేర్చారు. అయితే అందుకు ఆయనే కారకుడని చెప్పలేదు.

ఇంగ్లాండ్‌లో భారత విద్యార్థి మృతిపై దర్యాప్తు జరపాలి

- ఎస్ఎఫ్ఐ యూకె కమిటి డిమాండ్

లండన్ : ఇంగ్లాండ్‌లో మృతి చెందిన భారత విద్యార్థి విజయ్ కుమార్ శియోరాన్(30) మరణంపై సమగ్ర దర్యాప్తు జరపాలని భారత విద్యార్థి ఫెడరేషన్ - యూనైటెడ్ కింగ్డమ్ (ఎస్ఎఫ్ఐ-యూకె) కమిటి డిమాండ్ చేసింది. విద్యార్థి మృతికి సంతాపం తెలుపుతూ అధ్యక్ష, కార్యదర్శులు సోమిహా చటర్జీ , నూపూర్ పాలివాల్‌లు మంగళవారం లండన్‌లో ఒక ప్రకటన విడుదల చేశారు. హర్యానా రాష్ట్రానికి చెందిన విజయ్ శియోరాన్ బ్రిస్టల్‌లోని యూనివర్సిటి ఆఫ్ ది వెస్ట్ ఆఫ్ ఇంగ్లాండ్ (యూకె)లో మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో చదువుతున్నారు. అయితే నవంబర్ 25 ఉదయం, వోర్సెస్టర్ నగరంలో దుండగులు అతనిపై భయంకరంగా కత్తితో దాడి చేసి హత్య చేశారని తెలిపారు. శియోరాన్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకురావడంలో సహాయం చేయాలని లండన్‌లోని భారత హైకమిషన్‌ను వారు ప్రకటనలో కోరారు. ఈ ఘటన అంతర్జాతీయ విద్యార్థులపై పెరుగుతున్న హింసలో భాగమని, విదేశీ విద్యార్థుల పట్ల పెరిగిపోతున్న అనిశ్చితిని బహిర్గతం చేస్తుందని ప్రకటనలో వారు విమర్శించారు. యూకెలో భారత విద్యార్థులకు భద్రత లేకుండా పోయిందని వారు ఆందోళనలను వ్యక్తం చేశారు. అడ్డంకులను దాటుకుని ఉన్నత విద్యను చదవడానికి వస్తే అనేక సమస్యలు వస్తున్నాయన్నారు. బాధితుడి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై తక్షణ దర్యాప్తు జరగాలని , నేరస్థులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే శియోరాన్ మృతదేహాన్ని అతని స్వగ్రామానికి తీసుకురావడానికి జోక్యం చేసుకోవాలని భారత విదేశీ మంత్రిత్వ శాఖను కోరారు.

'పిపిపి'ని అడ్డుకుంటున్న జగన్ : వర్ల రామయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వైద్య కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పిపిపి) విధానంలో వైద్య కళాశాలలను అభివృద్ధి చేస్తుంటే మాజీ సిఎం వైఎస్ జగన్ అడ్డుపడటం ఏం న్యాయం, ఏ ధర్మమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పిపిపి విధానం వల్ల రాష్ట్రానికి అదనంగా 220 మెడికల్ సీట్లు లభిస్తాయని తెలిపారు. పేదవాళ్లకు మంచి జరుగుతుంటే ఎందుకింత బాధ అని ప్రశ్నించారు.

కరూర్ తొక్కిసలాట కేసులో సిబిఐ విచారణ వద్దు సుప్రీంకోర్టులో తమిళనాడు

న్యూఢిల్లీ : సినీనటుడు, టివికె అధ్యక్షులు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాటపై విచారణను సిబిఐకు అప్పగించడాన్ని తమిళనాడు ప్రభుత్వం వ్యతిరేకించింది. ఈ కేసు విచారణను సిబిఐకి అప్పగిస్తూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేయాలని సుప్రీంకోర్టును మంగళవారం కోరింది. రాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ కేసు విచారణను కొనసాగించడానికి అనుమతి ఇవ్వాలని సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. ఈ కేసును సిబిఐకి అప్పగించడానికి, లేదా రాష్ట్ర పోలీసులను అనుమానించడానికి ఒక్క కారణం లేదని తెలిపింది.

జీవన సౌరభం


మిమ్మల్ని బలవంతులుగా చేసే ప్రతి ఆశయాన్ని స్వీకరించండి. బలహీనపరిచే ప్రతి ఆలోచనను తిరస్కరించండి.

మీకోసం

నీటిలో కొద్దిగా వంట సోడా కలిపి, ఆ నీటిలో వంటపాత్రలు, ప్లేట్లు, స్పూన్లు, గరిటెలు కడిగితే వాటికి పట్టిన వాసన పోతుంది.



కాలం విలువ



నిత్య ప్రవాహం కాలం
ఆది అంతం లేని రూపం
వెన్నంటి ఉండే దళం
కాలమే గెలుపుల స్వరూపం

గడిచిన కాలం మారదు
క్షణము కూడా మారదు
కాలాన్ని గౌరవించు
కనకమై తోడుగా నిలుచు

వర్తమానమే మనకు వరం
సద్వినియోగమే విజయపథం
నిలువ ఉండనిది సమయం
సమయమే ఆశకు జయం

కాలానికి ద్వేషం ఉండదు
కాలాన్ని నిందించకు
అపజయాన్ని అందించదు

కాలంపై నెట్టడం ఎందుకు?
కాలం ధర్మాన్ని పాటిస్తూ
తను నిత్యం కదులుతూ
ప్రవాహంలా సాగుతూ
సృష్టినంతా నడిపిస్తుంది

కాలానికి విలువిస్తూ
ప్రగతిని సాధించు
అమూల్యమైన ఆభరణం
వినియోగిస్తే జగతికి నీవే కిరణం

– కొప్పుల ప్రసాద్,
98850 66235.

పదబంధాలు

పిల్లలూ, ఇక్కడ కొన్ని తెలుగు పదాలను ఇచ్చాం. వాటికి సమాన అర్థం వచ్చే పదాలు మీరు రాయండి.

చందమామ-----	జా------	హిమం-----	మం--------
సాగరం -----	స-------	వెండి-----	ర---------
కాన-----	అ-------	కాలం-----	స---------
మార్గం-----	దా------	అడుసు-----	బు---------

నేను గీసిన బొమ్మ



ఎస్.జెస్సీ జాస్మిన్,
7వ తరగతి,
అరవింద హైస్కూలు,
సిబిఎస్ఇ
కుంచనపల్లి, గుంటూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పాలకులు కూల్చేస్తే ... ప్రజలు నిలబెట్టారు!

అన్యాయాన్ని, అక్రమాన్ని తన కలం గళంతో గట్టిగా వినిపించినందుకు జమ్మూలో ఉంటున్న ఓ ముస్లిం జర్నలిస్టు ఇంటిని అధికారులు ఇటీవల నిట్టనిలువునా కూల్చేశారు. కుప్పకూలిన ఆ ఇంటి ముందు నిరాశ్రయంగా ఆ జర్నలిస్టు వృద్ధ తల్లిదండ్రులు, భార్యా పిల్లలు బిక్కుబిక్కుమంటూ ఉంటే, వాళ్లని చూసి ఇంటిని కూల్చిన వారు తెగ సంతోషపడిపోయారు. అయితే అది వారికి క్షణం కాలం మాత్రమే మిగిలింది. ఆ ముస్లిం జర్నలిస్టు కుటుంబానికి 'నేనున్నా' అంటూ ఓ హిందు సోదరుడు ముందుకు వచ్చాడు. కూల్చేసిన భూమికి రెట్టింపు భూమిని అతనికి బహుమతిగా ఇచ్చాడు. 'కులాలు, మతాలు వేరైనా మేమంతా మనుషులం. మత సామరస్యంతో మెలగడం మా నైజం' అంటూ అక్కడున్న వారికే కాదు, దేశం నలుమూలలా వినపడేంత గట్టిగా చెప్పాడు.

మాదక ద్రవ్యాలను రవాణా చేస్తున్న ముఠాతో ఓ పోలీసు అధికారికి ఉన్న సంబంధాల గుట్టును రట్టు చేసిన ఆ పాత్రికేయుడు అర్ఫజ్ అహ్మద్ డయాంగ్. 'నీస్ సహర్ ఇండియా' పేరుతో డిజిటల్ న్యూస్ పోర్టర్‌ని అతను నిర్వహిస్తున్నాడు. అక్రమ రవాణాలో పోలీసు సంబంధాల వార్త అక్కడి ప్రజల్లో తీవ్ర కలకలం రేపింది. పోలీసులు అప్రమత్తమయ్యారు. అర్ఫజ్‌పై బెదిరింపులకి దిగారు. చివరికి సరైన పత్రాలు లేవంటూ అతని ఇంటిని కూల్చేశారు. అడ్డుకొన్న అర్ఫజ్‌ని పోలీసులు నోటికొచ్చినట్లు దుర్భాషలాడారు. కొట్టారు. 'తమకి కొంచెం సమయం ఇవ్వమ'ని అర్ఫజ్ కుటుంబ సభ్యులు అధికారుల కాళ్లావేళ్లా పడడం అక్కడున్న వారి గుండెలు బరువెక్కించింది. అయినా వారు కనికరం చూపలేదు. అప్పుడే ఆ ప్రాంతానికి చెందిన సామాజిక కార్యకర్త కులదీప్ శర్మ వారికి అండగా నిలబడ్డారు. అర్ఫజ్ తిరిగి ఇంటిని నిర్మించుకునేందుకు అవసరమైన స్థలాన్ని ఉచితంగా ఇచ్చారు.




'నిధుల కోసం దాతలను అడుక్కోవాల్సి వచ్చినా సరే మీ కోసం ఇంటిని కట్టిస్తాను. ముస్లింలకు హిందువులను వ్యతిరేకులుగా చిత్రీకరించే కుట్ర ఎన్నటికీ విజయం సాధించదు. మన మధ్య సోదరభావం చిరకాలం కొనసాగుతుంది. మీరు మంచి మనిషి. మీ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు చేకూరాలి' అంటూ అర్ఫజ్‌కి ఇంటి పత్రాలు ఇస్తూ కులదీప్ కన్నీటిపర్యంతమయ్యారు.

ఇంకా ఆయన ఇలా అన్నారు. 'చూడండి, ఆయన పిల్లలు ఆరుబయట ఎలా కూర్చున్నారో? ఇది ప్రభుత్వానికి సిగ్గుచేటు. దేశ పౌరులు అయినప్పటికీ వీరు నిరాశ్రయులయ్యారు' అని వాపోయారు. కులదీప్ శర్మ కుమార్తె తానియా మాట్లాడుతూ తండ్రి తీసుకున్న నిర్ణయం తమకు ఎంతో గర్వకారణమని చెప్పింది.

'నాకు చాలా బాధగా ఉంది. రాత్రికి రాత్రే అర్ఫజ్ ఇంటిని ఎలా కూల్చివేస్తారు? అతను నాకు సోదరుడి వంటి వాడు. నేను మాత్రమే కాదు.. నా కుటుంబం, ఈ సమాజం మొత్తం ఆయనకు అండగా నిలుస్తుంది' అని తానియా చాలా గట్టిగా చెప్పింది.

2025 నవంబర్ 27న అర్ఫజ్ ఇంటిని కూల్చివేసిన తర్వాత వేలాది మంది ప్రజలు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. అర్ఫజ్ తండ్రి గులామ్ ఖాదిర్ ఆ సందర్భాన్ని ఇలా చెప్పారు. 'అధికారులు మా ఇంటిని కూల్చారు. మమ్మల్ని నిరాశ్రయులని చేశామని అనుకున్నారు. అయినా ప్రజలు మా పక్షాన నిలిచారు. నా కుమారుడికి మద్దతు ఇచ్చారు. ఇది నాకు ఎంతో విలువైనది. ఇంతకంటే నేను ఏం ఆశించగలను? ఇలాంటి ఉదంతాలు జమ్మూకాశ్మీర్‌లో ఇప్పటికీ మత సామరస్యం నెలకొని ఉన్నదని నిరూపిస్తున్నాయి. నేను నిజంగా సంతోషిస్తున్నాను. అవినీతిపరులను, అక్రమంగా వ్యాపారాలు చేసే వారిని, భూములను కబ్జా చేసే వారిని ఎవరూ ప్రశ్నించరు. ఒకే అంతస్తుతో నిర్మించిన ఇంటిని జమ్మూ డెవలప్‌మెంట్ అథారిటీ లక్ష్యంగా చేసుకుంది. నలభై సంవత్సరాల క్రితం దీనిని కట్టారు. మాకు వేరే ఇతర ఆస్తులేవీ లేవు. ఒకవేళ నా కుమారుడు నిజంగా అవినీతిపరుడై ఉంటే మా కోసం పెద్ద ఇంటినే కట్టి ఉండేవాడు' అని ఆయన ఆవేదనగా మాట్లాడారు.



అర్ఫజ్ ,కులదీప్ శర్మ

నేలమట్టమైన ఇంటి శిథిలాల వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన టార్పాలిన్ గుడారంలో ప్రస్తుతం అర్ఫజ్ నివసిస్తున్నారు. కూలిపోయిన తన ఇంటి శిథిలాలు చూపిస్తూ.. 'చూడండి. ఈ దేశంలో అన్యాయాలు, అక్రమాలు చేసిన సాధువులు కూడా దర్జాగా బతుకుతున్నారు. సత్యాన్ని చూపించిన జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు మాత్రం ఇలా బాధపడుతున్నారు' అని ఓ వీడియో ఫుటేజ్‌ని విడుదల చేశారు. గతంలో కూడా పోలీసులు అర్ఫజ్ ఇంటిని కూల్చేశారు. అప్పటి నుండి అతను తన తండ్రి ఇంట్లో తలదాచుకుంటున్నారు. ఇప్పుడు ఆ ఇంటిని కూడా కూల్చేశారు.

విటమిన్ 'డి' .. ఇలా పొందండి...

శీతకాలంలో ఎముకలు, కండరాలు నొప్పులు వస్తుంటాయి. మెదడుకు అందాల్సిన సంకేతాలూ అందవు. స్తబ్దతో కూడిన వాతావరణమే అందుకు కారణం. వర్షం, మంచు కారణంగా సూర్యకాంతి నుండి శరీరానికి తగినంత మొత్తంలో విటమిన్ డి లభించదు. ఇది మన శరీరంలో కాల్షియం గ్రహించడంలో సహాయపడుతుంది. నరాలు. రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి కూడా సహాయపడుతుంది. ఇలాంటప్పుడు ఆహారంలో క్రమం తప్పకుండా కొన్ని నియమాలు చేర్చుకోవాలి.



- విటమిన్ డి పుష్కలంగా ఉండే ఆహారాలలో చేప ఒకటి. 100 గ్రాముల చేపలో విటమిన్ డి సమృద్ధిగా దొరుకుతుంది. చేప తినడానికి ఇష్టపడని వారు కాడ్ లివర్ ఆయిల్ ఉపయోగించవచ్చు.
- గుడ్డులోని తెల్లసొనలో ప్రోటీన్లు పుష్కలంగా ఉన్నప్పటికీ, సొనలు ఎక్కువగా కొవ్వు, విటమిన్లు, మినరల్స్‌లో విటమిన్ డి అధికంగా ఉంటుంది.
- పుట్టగొడుగులు సూర్యరశ్మి నుంచి విటమిన్ డిని సంశ్లేషణ చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. అందుకే ఆహారంలో వారంలో రెండు, మూడు సార్లు పొట్టగొడుగులను చేర్చుకోవచ్చు.
- పాలలో కాల్షియం అధికంగా ఉంటుంది. గ్లాసు పాలలో రోజుకు అవసరమైన విటమిన్ డి అందుతుంది. పాలులో ప్రోటీన్, కాల్షియం, భాస్వరం, మెగ్నీషియం, మాంగనీస్, జింక్‌తో పాటు, విటమిన్ కె కూడా ఇందులో ఉన్నాయి.
- పాలు తాగడం ఇష్టం లేనివారు పెరుగును ఆహారంలో చేర్చుకోవాలి. ప్రత్యేక విటమిన్ లోపాన్ని తీర్చగల సామర్థ్యం పెరుగుకు ఉంది. సోయా పదార్థాల్లో విటమిన్ డి ఉంటుంది.
- ఈ సీజన్‌లో దొరికే నారింజ పండులో కాల్షియం, ఇనుము, జింక్, మెగ్నీషియం, విటమిన్ ఎ,బి,సి, డి పుష్కలంగా లభిస్తాయి. వీటిలో ఏదో ఒకటి రోజూ తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉండొచ్చు.

ముగిసిన 12వ సిఐఐ బిగ్ పిక్చర్ సమ్మిట్



కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) 12వ బిగ్ పిక్చర్ సమ్మిట్–2025 ముంబైలోని జుహూ జేడబ్ల్యూ మారియట్ హోటల్‌లో సోమ, మంగళవారాల్లో రెండురోజులపాటు జరిగింది. అన్ని రాష్ట్రాలకు చెందిన సినీ రంగ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, బుక్ మై షో ప్రతినిధులు అనిల్ మఖిజా, చిరాగ్ సరైయా, 91 ఫిల్మ్ స్టూడియోస్ వ్యవస్థాపకులు నవీన్ చంద్ర, గగన్ విహార్ స్పేస్ సిటీ, స్పేస్ ఎగ్జిబిషన్ ఫౌండర్ శ్రీకాంత్ కోడెబోయిన, అమెరికాకు చెందిన బ్లూ ఐ సాఫ్ట్ కార్ప్, బిఈఎస్ స్పేస్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధులతో డెల్లా రిసార్ట్స్, డెల్లా అడ్వెంచర్ పార్క్ (ఎంఒయు భాగస్వామి) ఫౌండర్ జిమ్మి మిస్త్రీ, ఐలైన్ స్టూడియోస్ డైరెక్టర్ డి.రాకేష్ తదితరులు హాజరయ్యారు. వీరితో రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, ఎపి టూరిజం కార్పొరేషన్ ఎండి ఆమ్రపాలి కాట ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రవి కొట్టార్కర్ సినిమా రంగానికి సంబంధించిన పలు ప్రతిపాదనలను మంత్రి దుర్గేష్ దృష్టికి తీసుకొచ్చారు. సినిమా రంగంలో పెట్టుబడులకు సిద్ధమని, త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌కు వస్తామని రవి వివరించారు.

త్వరలో సమగ్ర కొత్త ఫిల్మ్ టూరిజం పాలసీ

'రాష్ట్రంలో సాహస, ఆధ్యాత్మిక, తీరప్రాంత, ఫిల్మ్ టూరిజం సర్క్యూట్లను అభివృద్ధి చేస్తాం. విశాఖపట్నం, తిరుపతి, గండికోట, రాజమండ్రి, అమరావతి, శ్రీశైలం, అరకు లోయలను యాంకర్ హబ్‌లుగా గుర్తించి అభివృద్ధి చేయబోతున్నాం. యానిమేషన్, గేమింగ్, విఎఫ్ఎక్స్ రంగాల్లో గ్లోబల్ లీడర్‌గా ఎదగడానికి, ఎఐ, ఎక్స్ఆర్ టెక్నాలజీలు, క్లౌడ్ మౌలిక సదుపాయాల్లో పెట్టుబడి పెట్టి ఆంధ్రప్రదేశ్‌ను సృజనాత్మక పరిశ్రమల కోసం 'ఆంధ్ర వ్యాలీ'గా మారుస్తాం. ప్రొడక్షన్ నుంచి ఎగ్జిబిషన్ వరకూ, సినిమా షూటింగ్‌ల కోసం అనుమతులను సులభతరం చేసే లక్ష్యంతో కొత్త 'సమగ్ర కొత్త ఫిల్మ్ టూరిజం పాలసీ'ని త్వరలో తీసుకురాబోతున్నాం. ఈ క్రమంలో సినిమా రంగ అభివృద్ధికి పెట్టుబడులు పెట్టి సహకరించాలి. ఎపి టూరిజం కొత్త పాలసీ 2024–29 ద్వారా ఇన్వెస్టర్లకు అందించే ప్రోత్సాహకాలు, రాయితీల గురించి వివరించాం. ప్రపంచంలోని పలు దేశాల ఇన్వెస్టర్లతో మాట్లాడాం. రాష్ట్రానికి పెట్టుబడులతో రావాలని కోరాం. త్వరలోనే వస్తామని హామీ ఇచ్చారు. రెండు రోజుల సమ్మిట్‌లో పలువురు ప్రతినిధులు ఏపీలో స్టూడియోల నిర్మాణం చేపట్టడానికి ఆసక్తి చూపారు. ప్రత్యేకించి వైజాగ్‌లో డిజిటల్ స్టూడియోల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు' అని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

'మౌగ్లీ' ట్రైలర్ విడుదల



యాంకర్ సుమ కనకాల తనయుడు, యువ నటుడు రోషన్ కథానాయకుడిగా నటిస్తున్న సినిమా 'మౌగ్లీ 2025'. నేషనల్ అవార్డ్ విన్నర్ సందీప్ రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈనెల 12న విడుదల కాబోతుంది. చిత్ర యూనిట్ ట్రైలర్‌ను విడుదల చేసింది. సాక్షి సాగర్ మదోల్కర్ కథానాయిక. వైవా హర్ష ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. కాలా భైరవ సంగీతం అందిస్తున్నారు.

12న 'పైసావాలా' విడుదల



అధ్విక్ అలియాస్ రాజేష్ బెజ్జంకి, శ్రీధర్, సృజనక్షిత, పి.అన్ను ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'పైసావాలా'. కె. నవీన్ తేజస్ దర్శకత్వం వహించారు. ఎఆర్ ఎంటర్‌టైన్మెంట్స్, ఫైవ్ ఎలిమెంట్స్ క్రియేషన్స్, విక్రం మూవీస్ బ్యానర్లపై నూనెల పైడిరాజు, కె.నవీన్ తేజస్, పిజె దేవి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. ట్రైలర్‌ను గీత రచయిత చంద్రబోస్ విడుదల చేసి చిత్ర బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. నగేష్ గౌరీష్ సంగీతం, గౌతం వాయిలాడ సినిమాటోగ్రాఫర్, ఎంజె సూర్య ఎడిటర్‌గా వ్యవహరించారు. ఈనెల 12న ఈ సినిమా విడుదల కానుంది.



'పోలీస్ స్టేషన్ మే భూత్' ప్రమోషన్ స్టిల్

ఆర్జీవీ కొత్త సినిమా 'పోలీస్ స్టేషన్ మే భూత్' నుండి తాజాగా ఒక ప్రమోషనల్ స్టిల్‌ను సోషల్ మీడియా వేదికగా విడుదల చేశారు. ఈ ఫొటోలో రావు రమేష్, మనోజ్ బాజ్‌పేయ్ పోలీస్ ఆఫీసర్లుగా కనిపిస్తున్నారు. ఆర్జీవీ సుమారుగా ఐదేళ్ల తర్వాత హారర్ జోనర్‌లో తెరకెక్కిస్తున్న సినిమా ఇది. అలాగే మనోజ్ బాజ్‌పేయ్ సుమారు 25 ఏళ్ల తర్వాత ఆర్జీవీతో చేస్తున్న చిత్రం ఇది. ఈ చిత్రంలో జెనీలియా దేశ్‌ముఖ్, రమ్యాకృష్ణ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు.

కోహ్లి, రోహిత్‌పైనే ఆశలు

- సిరీస్ ఇక్కడే సాధించాలి
- నేడు దక్షిణాఫ్రికాతో రెండో వన్డే
- మధ్యాహ్నం 1.30గం॥ల నుంచి



రాయ్‌పూర్: తొలి వన్డేలో నెగ్గిన టీమిండియా ఒక రెండో వన్డేపై దృష్టి సారించింది. రాయ్‌పూర్ వేదికగా బుధవారం జరిగే రెండో వన్డేలో టీమిండియా గెలిస్తే.. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను చేజిక్కించుకోనుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా రాంచీ వేదికగా ఆదివారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా నెగ్గి 1–0 ఆధిక్యతలో నిలిచింది. హోరాహోరీగా జరిగిన తొలి వన్డేలో టీమిండియా 17 పరుగుల తేడాతో సఫారీలను ఓడించి సిరీస్‌లో ఆధిక్యాన్ని సాధించింది. మంగళవారం రాయ్‌పూర్ చేరుకున్న టీమిండియా ఆటగాళ్లకు ఘన స్వాగతం లభించింది. స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిని చిన్నారులు చుట్టుముట్టి గులాబీలతో ఘనంగా స్వాగతం పలికారు. తొలి వన్డేలో గెలిచిన టీమ్ ఇండియా ఇప్పుడు రెండో వన్డేకి సిద్ధమవుతోంది. స్వదేశంలో దక్షిణాఫ్రికాకు టెస్టు సిరీస్‌ను చేజార్చుకున్న భారత జట్టు.. వన్డేల్లో మాత్రం శుభారంభం చేసింది.

సూపర్ ఫామ్‌లో రోహిత్, కోహ్లి: శ్రీకాంత్

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలను 2027 ఐసిసి వన్డే ప్రపంచకప్ వరకు టీమిండియాలో కొనసాగించాలని మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ సూచించాడు. వారి అనుభవం, నిలకడైన ప్రదర్శన జట్టుకు అత్యవసరం అని, వారిద్దరూ లేకుండా ప్రపంచకప్ గెలవడం కష్టమని, భారత క్రికెట్ జట్టుకు కష్టమని పేర్కొన్నాడు. వీరిద్దరూ దశాబ్దాలుగా సేవలు అందిస్తూ.. కీలకమైన పిల్లర్లుగా ఉన్నారని, వారి అంకితభావం, నిలకడైన ప్రదర్శన మిగిలిన ఆటగాళ్లకు మోటివేషన్ అని, ప్రస్తుతం జట్టులో యువ ఆటగాళ్లు ఎక్కువగా ఉన్నా.. మేనేజ్‌మెంట్ లేదా బిసిసిఐ ఈ ఇద్దరు ఆటగాళ్ల భవిష్యత్తుపై క్లారిటీ ఇవ్వాలని అన్నాడు. వారిద్దరూ లేని జట్టుతో తక్షణమే అద్భుతాలు సాధించడం కష్టమని, వారి కెరీర్ గురించి ఇప్పుడే ఒక నిర్ణయానికి రావడం సీనియర్ ఆటగాళ్లపై ఒత్తిడి పెంచడమేనని అన్నాడు.

యువ ఆటగాళ్ల కంటే రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలు నిలకడగా రాణిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా శ్రీకాంత్ గుర్తు చేశాడు. కోహ్లి, రోహిత్ క్రీజ్‌లో 20 ఓవర్ల వరకు నిలబడితే, ప్రత్యర్థుల గెలుపు అవకాశాలు తగ్గుతాయని, ఒకే ఫార్మాట్‌కు పరిమితమైనప్పుడు రిథమ్ కొనసాగిం చడం కష్టమే అయినా... వారిద్దరూ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారని, ఫిజికల్ ఫిట్‌నెస్‌పైనా దృష్టి సారించారని శ్రీకాంత్ అన్నాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా కోహ్లి కొనసాగుతున్నాడని, 37ఏళ్ల వయస్సులోనూ దూకుడుగా ఆడుతున్న టాప్ క్లాస్ ప్లేయర్ కోహ్లి ప్రపంచకప్ ఆడితే టీమిండియాకు ఎంతో ప్రయోజనమని అభిమానులు కూడా కోరుకుంటున్నారని తెలిపాడు.

జట్లు(అంచనా)...

ఇండియా: కెఎల్ రాహుల్(కెప్టెన్, వికెట్ కీపర్), రోహిత్, కోహ్లి, జైస్వాల్, తిలక్ వర్మ, పంత్(వికెట్ కీపర్), సుందర్, గైక్వాడ్, జడేజా, కుల్దీప్/ప్రసిధ్, అర్షదీప్.

దక్షిణాఫ్రికా: బవుమా(కెప్టెన్), మార్‌క్రమ్, రికెల్టన్, ముల్డర్, జోర్జి, స్టబ్స్, వెర్రెయనె(వికెట్ కీపర్), యాన్సెన్, బోచ్, హార్మర్, మహరాజ్.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68